www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 270 | గురువారం | 22 మార్చి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

పంచాంగం

శ్రీచాంద్రమాన విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్రమాసం

తిథి : శుక్ల. పంచమి ప.2.08 వరకు అనంతరం షష్ఠి

నక్షత్రం: కృత్తిక సా.6.24 వరకు అనంతరం రోహిణి

వర్జ్యం: ఉ.6.55 - 8.24 వరకు

దుర్ముహూర్తం : ఉ.10.06 - 10.55 వరకు తిరిగి ప.2.54 - 3.44 వరకు

రాహుకాలం: ప.1.30 - 3.00 వరకు

యమగండం: ఉ.6.00 - 7.30 వరకు

శుభసమయాలు: ఉ.11.01 - 11.56 వరకు క్రయవిక్రయాలు, అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్లు.



కాంగ్రెస్‌కు ఫేస్‌బుక్ బురద?

డేటా చోరీ సమాచారాన్ని రాహుల్ గాంధీ ఎన్నికల్లో ఉపయోగించుకున్నారని బిజెపి ఆరోపణ

ఫేస్‌బుక్ వినియోగదారుల వివరాలను దొంగిలించిన కేంబ్రిడ్జి అనలిటికాతో కాంగ్రెస్‌కు సంబంధాలున్నాయని, దానికి ఎంతమంది భారతీయుల సమాచారాన్ని ఇచ్చారో చెప్పాలని కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ డిమాండ్ • రుజువైతే కఠిన చర్యలు తప్పవని ఫేస్‌బుక్‌కు హెచ్చరిక

ఖండించిన కాంగ్రెస్ నేతలు, బిజెపి, జెడి(యు)లకే కేంబ్రిడ్జి అనలిటికాతో లింకులున్నాయని ప్రత్యారోపణ

10లో

వర్క్ వీసాలు రద్దు

11

- ప్రీమియం ప్రాసెసింగ్‌కు తాత్కాలికంగా స్వస్తి
- కష్టకాలంలో మన ఐటి నిపుణులు
- ఏప్రిల్ 2 నుంచి హెచ్ 1 బి ఆమోదం

అప్పుపై అర్థంలేని విమర్శ

అప్పులు చేసేది అభివృద్ధి కోసమే, ఆడంబరాలకు కాదు

బడ్జెట్‌పై అవగాహన లేని ప్రతిపక్షాలు

ఎన్‌డిఎ ప్రభుత్వం రూ.24 లక్షల కోట్లు అప్పు చేసింది

నిధులతోనే ప్రగతి సాధ్యం

శాసనమండలిలో ముఖ్యమంత్రి కెసిఆర్



ఎంఎల్‌సిలు, అధికారులతో కలిసి మండలి భవనంలో మార్పులు చేర్పులపై చర్చిస్తున్న సిఎం కెసిఆర్

మన తెలంగాణ / హైదరాబాద్ : అప్పులు చేసేది రాష్ట్ర అభివృద్ధి కోసమే తప్ప ఆడంబరాలకు కాదని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు స్పష్టం చేశారు. శాసన మండలిలో బడ్జెట్‌పై చర్చకు సమాధానంగా సిఎం కెసిఆర్ బుధవారం మాట్లాడుతూ రాష్ట్ర రెవెన్యూలో 22 శాతం అభివృద్ధిని సాధించామని, ఇది తెలంగాణ ఏర్పాటు కావడం ద్వారానే సాధ్యమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టడంతోనే ప్రతిపక్షాల సభ్యులు అంకెల గారడీ, చప్పగా ఉంది వంటి వ్యాఖ్యానాలు చేస్తున్నారని, బడ్జెట్‌పై పూర్తి అవగాహనతో మాట్లాడాలని, విశ్లేషణాత్మకంగా అవగాహన చేసుకుని మాట్లాడే పరిణితిని సాధించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేస్తోందంటూ విపక్ష సభ్యులు విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని, నిజానికి ఉమ్మడి రాష్ట్రంలోని 23 జిల్లాల్లో పదేళ్ళ కాలంలో (2004 నుంచి 2014 వరకు) ఖర్చు పెట్టింది కేవలం రూ. 1.29 లక్షల కోట్లు మాత్రమేనని, కానీ తెలంగాణ ఏర్పడిన తర్వాత నాలుగేళ్ళలోనే రూ.1.24 లక్షల కోట్లను ఖర్చు పెట్టిందని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలోనే ధనిక రాష్ట్రంగా అవతరిస్తామని తాను వ్యాఖ్యానించానని, ఇప్పుడు అదే జరుగుతోందన్నారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతిని కేంద్రంతో పాటు అనేక రాష్ట్రాలు గమనిస్తున్నాయని, ఈ ఏడాదిలోనే మరే రాష్ట్రానికి రానన్ని అవార్డులు తెలంగాణకు వివిధ రంగాల్లో లభించాయని కెసిఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అప్పు చేయడం, ఖర్చు చేయడాన్ని విపక్షాలు తప్పుబట్టడం సరికాదని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటేనే అనుకున్న పనులు పూర్తవుతాయని చెప్పారు. మంచి పనులు చేసినప్పుడు ప్రశంసించాల్సి ఉంటుందని, అనేక రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు వారికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నిజంగా రాష్ట్ర ప్రభుత్వం తప్పులు చేసినట్లయితే వాటిని ఎత్తిచూపి నిర్మాణాత్మకంగా విమర్శ చేసి సరిదిద్దే పనికి పూనుకుంటే అభినందిస్తామని, కానీ రాష్ట్రం అప్పులపాలైంది అనే విమర్శకు మాత్రమే పరిమితమయ్యే తీరులో మాట్లాడడం బాధాకరమని కెసిఆర్ వ్యాఖ్యానించారు. బిజెపి అధికారంలో ఉన్న ఇరవై రాష్ట్రాలు అప్పులు చేయడం లేదా అని ఎదురు ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అప్పులు చేయడం తప్పుకాదన్నారు.

కేంద్రం కూడా అప్పులు చేస్తోంది : కెసిఆర్

తెలంగాణ రాష్ట్రం మాత్రమే అప్పులు చేయడం లేదని, అనేక రాష్ట్రాలు, చివరకు కేంద్ర ప్రభుత్వం కూడా అప్పులు చేస్తోందని సిఎం కెసిఆర్ పేర్కొన్నారు. కేంద్ర తరువాయి 6లో



ఒక్క బొట్టూ వదలం

కృష్ణ, గోదావరుల్లోని ప్రతి నీటి చుక్కా సద్వినియోగం చేస్తాం

రాష్ట్ర న్యాయమైన వాటా రాబట్టి తీరుతాం : అసెంబ్లీలో మంత్రి హరీశ్‌రావు

మన తెలంగాణ / హైదరాబాద్ : కృష్ణా, గోదావరి నదుల్లోని ప్రతి నీటి చుక్కనూ వృథా పోకుండా సద్వినియోగం చేసుకుంటామని, కృష్ణా, గోదావరిలో తెలంగాణకు రావలసిన న్యాయమైన వాటాను సాధిస్తామని నీటిపారుదల శాఖమంత్రి టి. హరీశ్ రావు అన్నారు. నీటి కేటాయింపులపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు మన వాదనలు బలంగా వినిపిస్తున్నామని, ప్రస్తుతం ట్రిబ్యునల్‌లో విచారణ జరుగుతున్నందున పూర్తి వివరాలను సభలో చెప్పలేమని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతి ప్రాజెక్టుకూ సమగ్ర నివేదిక (డిపిఆర్) ఉందని, ఏ ప్రాజెక్టుకూ డిపిఆర్ లేదంటూ విపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఏ మాత్రం నిజం లేదన్నారు. రాష్ట్రాన్ని ఆకుపచ్చని తెలంగాణగా, కోటి ఎకరాల మాగాణిగా మార్చడం ముఖ్యమంత్రి కెసిఆర్ సంకల్పమని, ఆ సోయితోనే తమ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను రీ డిజైన్ , రీ ఇంజినీరింగ్ చేసినట్లు తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఎంఎల్‌ఎలు గొంగిడి సునీత, రసమయి బాలకిషన్, కె. విద్యాసాగర్ రావు తదితరులు బుధవారం అడిగిన ప్రశ్నకు మంత్రి పై విధంగా సమాధానం చెప్పారు. ప్రాజెక్టుల సర్వే, డిజైన్లు, నిర్మాణ పనులకు సంబంధించి ప్రతి దశలోనూ అత్యంత పారదర్శకంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. నీటి లభ్యత తక్కువ ఉన్న కారణంగానే ప్రాణహిత – చేవెళ్ల పథకం కింద ప్రతిపాదించిన తుమ్మిడిహట్టి కాకుండా మేడిగడ్డ దగ్గర ప్రాజెక్టుకు సిఎం కెసిఆర్ రూపకల్పన చేశారన్నారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారంలో వరుస బ్యారేజీల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. తుపాకులగూడెం నుండి శ్రీరాంసాగర్ తరువాయి 6లో

సిర్పూర్‌కు గ్రీన్‌సిగ్నల్

కాగజ్‌నగర్ పేపర్ మిల్లు పునరుద్ధరణకు జిఒ జారీ



మన తెలంగాణ/ మంచిర్యాల : కొమురంభీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని మూతపడ్డ సిర్పూర్ పేపర్ మిల్లును పునరుద్ధరించే దిశలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రూ. 628 కోట్లతో పేపర్‌మిల్లును రెండు నెలల్లో తెరిచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇటీవల ఈ మిల్లు పునఃప్రారంభానికి కేబినేట్ ఆమోదం తెలుపగా, దీనిని నడిపించేందుకు ముందుకు వచ్చిన జెకె పేపర్ మిల్లు యాజమాన్యానికి పదేళ్లపాటు రాయితీలు కల్పిస్తూ ప్రభుత్వం తాజాగా బుధవారం జిఒ నెం. 18ని విడుదల చేసింది. అంతే కాకుండా సిర్పూర్ పేపర్ మిల్లులో పనిచేస్తున్న 1200 మంది కార్మికులు, ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికులను కూడా తిరిగి విధుల్లోకి తరువాయి 6లో

కుంచెపోటు





డిజిపి పేరు చెప్పి భూటోపీ!

- మేడ్చల్‌జిల్లా యాద్గార్‌పల్లిలోని తమ పట్టా భూముల కబ్జాపై రైతుల ఆందోళన
- డిజిపి అనుచరులమంటూ బెదిరించి ఆరు ఎకరాలను స్వాధీనం చేసుకున్నారని ఆరోపణ

మన తెలంగాణ/ కీసర: డిజిపి అనుచరులమంటూ నల్లగొండ జిల్లాకు చెందిన కొందరు దౌర్జన్యంగా తమ పట్టా భూములను కబ్జా చేశారని మేడ్చల్ జిల్లా కీసర మండలం యాద్గార్‌పల్లి గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తే ఫిర్యాదు తీసుకోకుండా కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. బుధవారం జిల్లా ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బాధిత రైతులు కన్నీటి పర్యంతమై తమ గోడు వెల్లబోసుకున్నారు. బాధిత రైతులు కాటేపల్లి బాల్‌రెడ్డి, కె.నాగిరెడ్డి, తరువాయి 6లో

జూనియర్ కాలేజీలుగా 27 గురుకుల స్కూళ్లు 6

కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసిన కాంగ్రెస్ నేతలు 3

కనిష్క్ గోల్డ్ రూ.824 కోట్ల శ్కాం 10

వ్యూహాత్మక రహదారులు

- హైదరాబాద్‌లో రూ.300 కోట్లతో పనులు
- మున్సిపల్ బాండ్ల ద్వారా రూ.1000 కోట్లు
- ఇప్పటికే రూ.200 కోట్ల సేకరణ
- బెస్ట్ లివింగ్ సిటీలలో నెంబర్‌వన్‌గా నగరం

– మంత్రి కెటిఆర్



మన తెలంగాణ/ హైదరాబాద్ : హైదరాబాద్‌లో వ్యూహాత్మక రహదారులను నిర్మిస్తున్నట్లు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కెటిఆర్ తెలిపారు. బుధవారం శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ ఎస్‌ఆర్‌డిపి (స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) కింద వీటిని నిర్మిస్తున్నామన్నారు. మూడు వేల కోట్ల రూపాయలతో పనులు చేపడుతున్నామని చెప్పారు. ఎస్‌ఆర్‌డిపి కోసం మున్సిపల్ బాండ్ల ద్వారా రూ. 1000 కోట్లు సేకరిస్తున్నామని, 'సెబి' మార్గదర్శకాలను పాటిస్తున్నామన్నారు. ఈ విషయాన్ని ప్రధాని మోడీకి చెబితే ఆయన కూడా ప్రశంసించారన్నారు. ఇప్పటికే బాండ్ల ద్వారా మొదటి దశలో 200 కోట్ల రూపాయలు సేకరించామన్నారు. రూ. 23వేల కోట్లతో ఫ్లైఓవర్లు తదితర పనులు చేపడుతున్నామని, ఒక దానికి పనులను కూడా ప్రారంభించామన్నారు. ఈ తరువాయి 6లో

'జి' అని రాసుంటే ప్రభుత్వ భూమి ఎలా అవుతుంది : హైకోర్టు

మన తెలంగాణ/ హైదరాబాద్: టౌన్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ (టిఎస్ఎల్ఆర్)లోని భూమికి చెందిన ఫైల్‌పై జీ అని రాసుంటే అది గవర్నమెంటు భూమి ఎలా అవుతుందని హైకోర్టు ప్రశ్నించింది. రాజధానిలోని నాంపల్లి మండలం ఆగాపురలోని ఓ ప్రై వేటు ఆస్తికి చెందిన ఫైల్‌పై జీ అని ఉంటే ప్రభుత్వ భూమేనని ప్రభుత్వం వాదించడాన్ని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మి లతో కూడిన డివిజన్ బెంచ్ తప్పుపట్టింది. ఆగాపురలో కమల్ కిషోర్ అగర్వాల్ అనే వ్యక్తికి చెందిన 558, 870 చదరపు గజాల స్థలాల్ని అధికారులు టిఎస్ఎల్ఆర్‌లో ప్రభుత్వ భూమిగా ప్రకటించి అగర్వాల్‌ను ఆక్రమణదారుడిగా పేర్కొంది. దీనిపై కోర్టుకు వచ్చిన అగర్వాల్‌కు అనుకూలంగా సింగిల్ జడ్జి గతంలో తీర్పు చెప్పారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ రెవెన్యూ శాఖ చేసిన అప్పీల్ వ్యాజ్యాన్ని బుధవారం డివిజన్ బెంచ్ విచారించింది. ప్రభుత్వ భూమి అనుకుంటే సివిల్ కోర్టులో కేసు వేసుకోవాలని, నాలుగు మాసాల్లో ఈ విధంగా ప్రభుత్వం చేయకపోతే సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు ప్రకారం ఆ భూమి అగర్వాల్‌కే చెందుతుందని డివిజన్ బెంచ్ స్పష్టం చేస్తూ తీర్పు చెప్పింది.



ఉపాధితో పాటు ఉత్పత్తులకూ అధిక ధర

- పంటల సాగు ఆధారంగా ప్రాసెసింగ్ యూనిట్ల విస్తరణ
- వ్యవసాయ ఆధారిత పరిశ్రమలపై మంత్రివర్గ ఉపసంఘం
- అగ్రో ప్రాసెసింగ్‌లతో పాటు అనుబంధ ఉత్పత్తుల యూనిట్లు



మన తెలంగాణ/హైదరాబాద్: వ్యవసాయ ఆధారిత పరిశ్రమలలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ మందికి ఉపాధి కలగడంతో పాటు, రైతుల ఉత్పత్తులకు అధిక ధర లభిస్తుందని మంత్రివర్గ ఉపసంఘం అభిప్రాయపడింది. పంటల సాగు ఆధారంగా ఆయా ప్రాంతాలలో అగ్రో ప్రాసెసింగ్ పరిశ్రమలను నెలకొల్పడంతో పాటు అనుబంధ ఉత్పత్తులను తయారు చేసే పరిశ్రమలను కూడా ఏర్పాటు చేయాలని సూచించింది. రాష్ట్రంలో ఆగ్రో ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సా హం, విధివిధానాల రూపకల్పనకై వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి ఛైర్మన్‌గా ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం బుధవారం అసెంబ్లీలోని సమావేశ మందిరంలో భేటీ అయింది. ఈ సమావేశంలో మంత్రులు కెటిఆర్, హరీష్‌రావు, ఈటల, జగదీశ్వర్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. రాష్ట్రంలోని పంటల విస్తీర్ణం, ఉత్పత్తి, స్థాపిత పరిశ్రమలు, సామర్థ్యంపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో పత్తి అధిక విస్తీర్ణంలో సాగువుతోందని, ఉత్పత్తి అయిన పత్తి పంటకు అనుగుణంగా జిన్నింగ్ మిల్లులు కొన్ని ప్రాంతాలలో లేవన్నారు. పత్తి అధికంగా పండిం చే నల్లగొండ జిల్లాలో జిన్నింగ్ మిల్లుల సంఖ్య తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. జిన్నింగ్ మిల్లులే కాకుండా పత్తి గింజల నుండి ఆయిల్‌ను,అనుబంధ ఉత్పత్తులను తయారు చేసే పరిశ్రమలు కూడా లేవని వాటి ఏర్పాటును ప్రోత్సహించాలని పేర్కొన్నారు. అదే విధంగా పత్తి విత్తనోత్పత్తిలో 90 శాతం ఇతర రాష్ట్రాలకు వెళ్ళి తిరిగి అనుబంధ ఉత్పత్తి (బై ప్రోడక్ట్)గా మారుతోందని, ఇక్కడే తయారు చేసే విధంగా అలాంటి పరిశ్రమలను స్థాపించాలన్నారు. వరి ఉత్పత్తయ్యే పంటకు సరిపోయే సంఖ్యలో రైస్ మిల్లులు, పారా బాయిల్డ్ మిల్లులు ఉన్నప్పటికీ కొన్ని కేంద్రాలలోనే అధికంగా కేంద్రీకృతమై ఉన్నాయని పంట పండే ప్రాంతాలలో వీటిని స్థాపించాల్సిన అవసరం ఉందని మంత్రివర్గ ఉపసంఘం భావించింది. బియ్యం నుండి పిండితో పాటు, ఆయిల్, కేకులు, బిస్కెట్లు వంటి ఉత్పత్తులు తయారు చేయడానికి అనుబంధ పరిశ్రమలు, మిర్చీని పౌడర్‌గా, రంగు తీయడానికి అవసరమైన ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించాల్సిన అవశ్యకతను ప్రజెంటేషన్‌లో వివరించారు. ఎగుమతికి, పరిశ్రమలకు అనుకూలంగా ఉండే పంటలను, రకాలను సాగు చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సభ్యులు అభిప్రాయపడ్డారు.రాష్ట్రంలో సాగవుతున్న పసుపు రకాలు ఎగుమతి ప్రమాణాలకు సరిపోవని, ఎగుమతికి అవసరమైన ఇతర రకాల సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పండ్లతోటలలో మామిడి ప్యాకింగ్ పరిశ్రమను ప్రోత్సాహించాలని సూచించారు. మాంసం, కోళ్ళ పరిశ్రమలో అధునాతన పద్దతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. ఆసక్తి కల పారిశ్రామిక వేత్తలకు అవసరమైన సబ్సిడీలను అదించేందుకు శ్లాబులవారీగా మార్గదర్శకాలను రూపొందించాలని సభ్యులు అభిప్రాయపడ్డారు. పరిశ్రమలతోపాటు కోల్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ యూనిట్లు, ల్యాబ్‌లు, బీమా సౌకర్యం కల్పించాలని సూచించింది. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల స్థాపనకు అందించాల్సిన సహకారాలు,మార్గదర్శకాల రూపకల్పనపై 24న మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు.

డిమాండ్ మేరకు పాల ఉత్పత్తి లేదు



మన తెలంగాణ/హైదరాబాద్ : రోజువారీ అవసరాలను తీర్చే స్థాయిలో పాల ఉత్పత్తి లేద ని, అందు వల్లనే ప్రైవేటు పాల డైరీల నుంచి సమకూర్చుకుంటున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ వివరించారు. డిమాండ్‌కు అనుగుణంగా పాల ఉత్పత్తి, సరఫరా లేకపోవడం పట్ల పలువురు శాసనసభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో భాగం గా ఎంఎల్‌ఏలు సోలిపేట రామలింగారెడ్డి, వి. శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల సరఫరా అం శాన్ని ప్రస్తావించారు. హైదరాబాద్ నగరంలో ప్రతి రోజూ కోటి లక్షల లీటర్ల పాల అవసరాలు ఉన్నాయని, కానీ ప్రభుత్వ డైరీ ద్వారా ఆ మేర కు సరఫరా లేదని ఎంఎల్‌ఏలు వ్యాఖ్యానించారు. విజయా డైరీ ద్వారా రోజుకు ఎన్ని లీటర్ల పాలను వినియోగదారులకు అందజేస్తున్నారని ప్రశ్నించారు. హెరిటేజ్, అమూల్, నందిని వంటి ప్రైవేటు రంగ డెయిరీలు కూడా పాలను వినియోగదారులకు అందిస్తున్నాయని సభ దృష్టికి తెచ్చారు. దీనికి పాడి పరిశ్రమాభివృద్ధి శాఖ మంత్రి తలసాని సమాధానం చెబుతూ సభ్యులు చెబుతున్న విషయం వాస్తవమేనన్నారు. విజయా డెయిరీతో పాటు కరీంనగర్, ముల్కనూర్ ప్రైవేట్ డెయిరీల సహకారం కూడా తీసుకుని డిమాండ్ మేరకు పాలను అందజేస్తామన్నారు. మహబూబ్‌నగర్ పాల కేంద్రాన్ని చిల్లింగ్ సెంటర్‌గా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. లాలాపేటలో విజయా డెయిరీని 2 లక్షల కెపాసిటి సామర్థానికి పెంచుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

టిఎస్ఐపాస్ ద్వారా 4,382 యూనిట్లు

- పరిశ్రమల శాఖపై సిఎస్ సమీక్ష



మనతెలంగాణ/హైదరాబాద్ : టిఎస్ ఐపాస్ ద్వారా ఇప్పటివరకు రూ.1,24,664 కోట్ల పెట్టుబడి విలువగల 6,609 యూనిట్లకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వగా, రూ.38,203 కోట్ల పెట్టుబడితో 4,382 యూనిట్లు ప్రారంభమయ్యాయని, వీటి ద్వారా 1,87,978 ఉద్యోగాలు లభించాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె. జోషి తెలిపారు. మరో 684 యూనిట్లు ప్రారంభం కావడానికి అడ్వాన్స్ స్టేజ్‌లో ఉన్నాయని అన్నారు. బుధవారం సచివాలయంలో పరిశ్రమల శాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, కమిషనర్ నదీమ్ అహ్మద్, టిఎస్ఐఐసి ఎండి వెంకటనర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పరిశ్రమలకు అనుమతులు ఇచ్చిన తర్వాత ఆరు నెలలలోగా ప్రారంభం కాని యూనిట్లపై కారణాలు విశ్లేషించాలని సిఎస్ ఆదేశించారు. ఫుడ్ ప్రాసెసింగ్, రిటైల్, ఎలక్ట్రికల్ వెహికిల్స్ పాలసీలపై సంబంధిత శాఖల అభిప్రాయాలు తీసుకున్నామని, త్వరలో వీటిపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సులభ వాణిజ్య విధానానికి సంబంధించి కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ పరిధిలోని పరిశ్రమల ప్రోత్సాహక విభాగం రూపొందించిన 372 సిఫార్సుల్లో 362 ఆమోదం పొందాయని వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి 'టి–ఐడియా' స్కీమ్ ద్వారా 10,195 యూనిట్లకు రూ.1,658 కోట్లు, ఎస్‌సిపి ద్వారా 8,994 యూనిట్లకు రూ.542 కోట్లు టిఎస్‌పి ద్వారా 7,976 యూనిట్లకు రూ.363 కోట్లు ఇన్సెంటివ్‌గా మంజూరు చేశామన్నారు. టిఎస్ఐఐసికి సంబంధించి 23 మెగా ప్రాజెక్టుల పనితీరునూ, మెగా టెక్స్‌టైల్ పార్క్, ఫార్మా సిటీ, నిమ్జ్ తదితరాలపైనా సిఎస్ సమీక్ష జరిపారు. పనుల పురోగతిని ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. పరిశ్రమలు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. స్థానిక యువతకు ఉద్యోగావకాశాల కల్పనపై ప్రత్యేక చొరవ తీసుకుకోవాలని సిఎస్ వివరించారు.

లిఖితపూర్వక సమాధానాలు రావట్లేదు

మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రశ్నోత్తరాల సమయంలో శాసనసభ్యులు వేసిన ప్రశ్నలకు, జీరో అవర్‌లో ప్రస్తావించిన అంశాలకు ప్రభుత్వం నుంచి రాతపూర్వక సమాధానాలు రావడం లేదని బిజెపి ఎంఎల్ఏ కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తాను రాజకీయాలకు అతీతంగా ఈ విషయాన్ని సభ దృష్టికి తెస్తున్నానన్నారు. 15 రోజుల్లో సమాధానాలను రాత పూర్వకంగా అందజేయాల్సి ఉండగా అలాంటివేవీ తమకు అందడం లేదన్నారు. మంత్రులంతా సీనియర్లేనని, ఎవరూ కొత్త వారు కాదని, ఈ విషయంలో ఎందుకు సమాధానాలను సకాలంలో అందజేయలేకపోతున్నారో సభకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై సభా వ్యవహారాల శాఖ మంత్రి హరీష్ రావు సమాధానం ఇస్తూ ప్రభుత్వం వైపు నుండి సమాధానాలు పంపిస్తూనే ఉన్నామన్నారు. తన శాఖకు సంబంధించిన 70 ప్రశ్నలపై సమాధానాలను రెండు మూడు రోజుల క్రితమే పంపించామన్నారు. ప్రతి ప్రశ్నకు సమాధానం ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.స్పీకర్ జోక్యం చేసుకుని సభ్యుల ఆవేదనను అర్థం చేసుకుందని సిఎస్ సమక్షంలో తాను ఒకటి రెండు పర్యాయాలు సమీక్షించానని, ఈ అంశాన్ని సభ్యులు ప్రస్తావించిన నేపథ్యంలో ప్రభుత్వం తగువిధంగా సభ్యులకు సమాధానాలు అందేలా చూస్తామన్నారు.

23న ఎఇఇ పోస్టులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్

మనతెలంగాణ/హైదరాబాద్ : అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ (ఎఇఇ) పోస్టులకు ఈ నెల 23న ఉదయం 10 గంటల నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు టిఎస్‌పిఎస్‌సి ఒక ప్రకటనలో తెలిపింది. ఇతర వివరాలకు వెబ్‌సైట్ చూడాలని పేర్కొంది.



ప్లాస్టిక్ రహిత ప్రాంతాలుగా అడవులు, అర్బన్ పార్క్‌లు

మనతెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలోని అడవులు, అటవీ బ్లాకుల్లో ఏర్పాటు చేస్తున్న అర్బన్ పార్కులను త్వరలో ప్లాస్టిక్ రహిత జోన్లుగా ప్రకటించనున్నట్లు అటవీ శాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు.ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా అటవీ బ్లాకుల్లో అర్బన్ పార్కులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా బుధవారం నగర శివారు ప్రాంతంలోని కండ్లకోయ అర్బన్ ఫారెస్ట్ పార్క్‌లో 'పక్షుల కేంద్రం' నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అడవులు, వన్యప్రాణులకు ప్లాస్టిక్ వల్ల జరుగుతున్న అనర్థాలు, పర్యావరణపరంగా పొంచి ఉన్న ముప్పుపై అధికారులతో చర్చించారు. జాతీయ రహదారికి పక్కనే ఏర్పాటు చేసిన ఫారెస్ట్ అర్బన్ పార్క్ చాలా ఆకర్షణీయంగా ఉందన్నారు. కాలుష్యం, ఒత్తిడి, జీవనశైలి వల్ల వచ్చే వ్యాధుల నుంచి కాపాడుకునేందుకు అర్బన్ పార్కులు ఉపయోగపడతాయని తెలిపారు. దశలవారీగా 186 ఫారెస్ట్ బ్లాక్‌లలో అర్బన్ పార్క్‌లు ఏర్పాటు చేయాలని సిఎం ఆదేశించారని, త్వరలో కీసర, శామీర్‌పేటలో పార్క్‌లు అభివృద్ధి చేసి, అన్ని పార్కుల్లో కనీస సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. రానున్న తరాలకు అర్బన్ పార్క్‌లను ఆస్తిగా అందిస్తామని చెప్పారు.

శాసన మండలి

మధ్యాహ్న భోజన పథకం అవకతవకలపై ప్రత్యేక విజిలెన్స్



మన తెలంగాణ/హైదరాబాద్ : మధ్యాహ్నభోజన పథకంలో అవకత వకలను అరికడతామని విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. బుధవారం శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ ఈ పథకం దుర్వినియోగం,అమలులో జాప్యం వంటి అంశాలు కొన్ని ప్రభుత్వం దృష్టికి వచ్చాయని, వీటిని అరికట్టి నాణ్యమైన ఆహారాన్ని అందించడం, అవకతవకలకు పాల్పడే వారిని గుర్తించి శిక్షించడం కోసం ప్రత్యేక విజిలెన్స్ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రాయోజిత పథకంగా కొనసాగుతున్న ఈ పథకంలో రాష్ట్ర వాటా 40 శాతంగా ఉం టుందని, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఒకటవ తరగతి నుంచి 8 వరకే అమలు చేస్తోందని, తెలంగాణ మాత్రం పదవతరగతి వరకు పొడిగించిందని స్పష్టం చేశారు. 9,10 తరగతుల వారికి అయ్యే ఖర్చు ను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోందని, నాణ్యమైన, పోషకాహారం కోసం రాష్ట్ర ప్రభుత్వం వారానికి ప్రతీ విద్యార్థికి మూడు కోడిగుడ్లను అందిస్తోందని, ఏడాదికి రూ. 90 కోట్లు ఖర్చవుతోందని తెలిపారు. సన్న బియ్యానికి అయ్యే ఖర్చును కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోందని, ఈ పథకాన్ని పదవ తరగతి వరకు అమలు చేయాలని కేంద్రానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా సానుకూల స్పందన రాలేదన్నారు. ఈ కారణంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఏడాదికి రూ. 377 కోట్ల మేర అదనంగా ఖర్చవుతోందని తెలిపారు. గురుకుల విద్యా సంస్థలు, హాస్టళ్లు వంటి వాటిలో ఆహారానికి కేటాయించే నిధుల కంటే మధ్యా హ్న భోజనానికి కేటాయించే నిధులు తక్కువ కాబట్టి అక్కడి నాణ్యతను మధ్యాహ్న భోజనంలో అమలు చేయలేమన్నారు. రాష్ట్రంలో 144కోట్ల రూపాయల తో 7080 పాఠశాలల్లో వంటశాలలను నిర్మిస్తున్నామన్నారు. కొన్ని చోట్ల వంటచెరకుతో వంటలు వండుతున్నారని, అక్కడ కూడా వంటగ్యాస్‌ను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాణ్యమైన ఆహారంతో పాటు అవకతవకల నివారణకు పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేస్తామని చెప్పారు. 'అక్షయపాత్ర' సంస్థ ద్వారా పలు చోట్ల కొన్ని జిల్లాల్లో ఈ పథకాన్ని అమలుచేస్తున్నామన్నారు. త్వరలో వరంగల్‌లో పూర్తిగా ఈ సంస్థ ద్వారానే పథకాన్ని అమలుచేస్తామన్నారు.

పర్యాటక ప్రాధాన్య ప్రాంతాలకు 8 ప్యాకేజీలు

పర్యాటక ప్రాంతాలకు 'సెట్విన్'

పర్యాటక ప్రాధాన్యత ఉన్న ప్రాంతాలకు సందర్శకుల కోసం 8 ప్యాకేజీలలో ప్రత్యేక బస్సు టూర్లను ఏర్పాటు చేశామని రవాణాశాఖ మంత్రి మహేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం శాసనమండలిలో ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ వీటిలో అనంతగిరి, నాగార్జునసాగర్‌లకు రెండు ప్యాకేజీలను ఖరారు చేశామన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు మొత్తం 230 మినీ బస్సులను నడిపిస్తున్నామని చెప్పారు. వీటిలో 100 ఏసి లేనివి కాగా మిగతావి ఏసి బస్సులన్నారు. యాదాద్రి, వేములవాడ, కొండగట్టు, కొమురవెల్లి, ధర్మపురి, భద్రాచలం, బాసర, ఆలంపూర్, సోమశిల, రామప్పదేవాలయం, హన్మకొండలోని భద్రకాళి దేవాలయం, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలం వంటి పుణ్య క్షేత్రాలకు వివిధ కాలనీల నుంచి బస్సులను నడిపిస్తున్నామన్నారు. సెట్విన్ బస్సులకు కూడా అవకాశమిచ్చే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. యాదాద్రి బస్‌స్టేషన్ నుంచి గుట్టపైకి ప్రతి 15 నిముషాలకు ఒక బస్సు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. త్వరలో అన్ని ప్రాంతాలకు మినీ బస్సులను ఏర్పాటుచేస్తామని చెప్పారు.

రూ.80 కోట్లతో అమరుల స్థూపం




హుస్సేన్ సాగర్ వద్ద జ్వాలాదీపం ఆకృతిలో అమరవీరుల స్మారక స్థూపాన్ని ఏర్పాటుచేస్తున్నామని రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం మండలిలో ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ దీని కోసం ప్రభుత్వం రూ. 80 కోట్లను మంజూరుచేసిందని, ప్రత్యేక డిజైన్‌తో పాటు 3.02 ఎకరాల్లో ఇది ఏర్పాట వుతుందని, హైదరాబాద్‌కు వచ్చే జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులతో పాటు పర్యాటకులు వీక్షించేలా నిర్మాణం జరుగుతుంద న్నారు. ఒక్కో అంతస్తులో ఒక్కో ప్రత్యేకత ఉంటుందన్నారు. స్థలం విషయంలో 'ఫోరం ఫర్ హైదరాబాద్' అనే సంస్థ కోర్టును ఆశ్రయించిందని, దీనిపై స్పష్టత రాగానే నిర్మాణం పనులు ప్రారంభమవుతాయని, ఏడాది కాలంలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

26 కొత్త కలెక్టరేట్ల నిర్మాణం : రాష్ట్రంలో 26 కొత్త కలెక్టరేట్ల (సమీకృత భవనాలు) నిర్మిస్తున్నామని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శాసనమండలిలో బుధవారం పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ కొత్తగా ఏర్పాటైన 21జిల్లాలతో పాటు భవనాలు సరిగా లేని ఐదు పాత జిల్లాల్లో కూడా కలెక్టర్ కార్యాలయ భవనాలను నిర్మిస్తున్నామన్నారు.

దివ్యాంగుల శిక్షణా కేంద్రాలకు పక్కాభవనాలు : దివ్యాంగుల వృత్తి శిక్షణా కేంద్రాలకు పక్కా భవనాలను నిర్మిస్తామని ఆయన తెలిపారు. మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ ప్రతి మండలంలో వారికి రీసోర్స్ సెంటర్లు ఉన్నాయన్నారు.

సోలార్ ప్లాంట్లలో రిజర్వేషన్ లేదు



రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న సౌరవిద్యుత్ ప్లాంట్లలో ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్ లేదని విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి స్పష్టం చేశారు. శాసన మండలిలో బుధవారం పలువురు ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ టారిఫ్ ఆధారిత పోటీ ప్రక్రియ ద్వారా సౌర పివి డెవలపర్స్‌ను ఎంపిక చేస్తున్నామన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తన ఖర్చుతో చేపట్టే పనుల్లో, పథకాల్లో రిజర్వేషన్లు ఇస్తున్నామని చెప్పారు. సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు కేంద్ర ప్రభుత్వ మార్గ దర్శకాల మేరకు జరుగుతోందని చెప్పారు. ఇప్పటివరకు రాష్ట్రంలో మొత్తం 2081 సౌరవిద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా 3,381.41మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోందన్నారు.

పదవ తరగతి వరకు తెలుగు తప్పనిసరి

రాష్ట్రంలో రానున్న విద్యాసంవత్సరం నుంచి ఒకటో తరగతి మొదలు పదవ తరగతి వరకు తెలుగును తప్పనిసరి చేస్తున్నామని విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. బుధవారం శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ ప్రభుత్వం ఇంటర్ వరకు తెలుగు తప్పనిసరి చేయాలని మొదట భావించిందన్నారు. సిబిఎస్‌ఇ, ఇంటర్నేషనల్, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు ఇది కష్టమవుతుందన్నారు. తెలుగు తప్పనిసరిపై విద్యాశాఖ ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేసి అధ్యయనం చేయించామన్నారు.

అనుమతి ఇప్పిస్తామంటే

అంతకన్నా భాగ్యమా?

- స్కైవేల విషయంలో ప్రధాన అడ్డంకిగా మారిన కేంద్ర ప్రభుత్వ వైఖరి
- రక్షణశాఖ భూములపై బిజెపి సభ్యులు, మంత్రి కెటిఆర్ మధ్య రసవత్తర చర్చ



మన తెలంగాణ/హైదరాబాద్ : రక్షణశాఖకు చెందిన భూముల విషయంలో బుధవారం శాసనమండలిలో అధికార టిఆర్‌ఎస్, బిజెపిల మధ్య ఆసక్తికరమైన చర్చ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం స్కైవేల నిర్మాణం అంటూ ఆర్భాటపు ప్రకటనలు చేసిందని బిజెపి సభ్యులు వ్యాఖ్యానించగా కేంద్ర ప్రభుత్వం కంటోన్మెంట్ పరిధిలో ఉన్న భూములు ఇవ్వకపోవడం వల్లనే జాప్యం జరుగుతోందని మంత్రి కెటిఆర్ వ్యాఖ్యానించారు. కేంద్రంపై నెపం నెట్టడం భావ్యం కాదని బిజెపి సభ్యులు వ్యాఖ్యానించడంతో పాటు తాము అనుమతులు వచ్చేలా చొరవ తీసుకుంటామని స్వచ్ఛందంగా ముందుకు రావడంతో అంతకన్నా భాగ్యమేముందని బదులిచ్చిన మంత్రి కెటిఆర్ ఆ పుణ్యం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తామని చెప్పిన స్కైవేల నిర్మాణాలు ఎక్కడి దాకా వచ్చాయి, వీటి పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు, ఎప్పుడు పూర్తి చేస్తారు అని బిజెపి సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి కెటిఆర్ తనదైన శైలిలో సమాధానమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్ నగరంలోకి వచ్చే నాలుగు ప్రధాన రహదార్లలో నాలుగు స్కైవేలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందులో రెండింటి ప్రక్రియ ఇప్పటికే మొదలైందని మంత్రి కెటిఆర్ వివరించారు. ఆదిలాబాద్ వైపు నుంచి వచ్చే 44వ నెంబర్ జాతీయ రహదారి, కరీంనగర్ నుంచి వచ్చే రాజీవ్‌రహదారిపై నిర్మించాల్సిన స్కైవేల కోసం దాదాపు 180 ఎకరాల రక్షణ శాఖ భూములను తీసుకోవాల్సి ఉందని, అనుమతి కోసం రక్షణ మంత్రులు అరుణ్‌జైట్లీ, మనోహర్ పారికర్, నిర్మలా సీతారామన్‌లను కోరామని, కానీ ఇప్పటివరకు స్థలాన్ని ఇవ్వలేదన్నారు. బిజెపి ఎమ్మెల్సీ రాంచంద్రారావు జోక్యం చేసుకుని అదే నిజమైతే తాను స్వయంగా కేంద్రం వద్దకు వెళ్లి మాట్లాడి అనుమతులు తెస్తానన్నారు. దీనికి స్పందించిన కెటిఆర్ 'అంతకన్నా భాగ్యమేముంద'ని వ్యాఖ్యానించారు. రక్షణ భూములకు డబ్బులు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పినా కేంద్రం నుంచి స్పందన లేదని, ఆ తర్వాత స్థలానికి ప్రత్యామ్నాయ స్థలం ఇవ్వాలని రక్షణ శాఖ లేఖలో తెలియజేసిందని, రాష్ట్రం కూడా దీనికి అంగీకరించి వంద ఎకరాల రక్షణ భూములకు బదులుగా 600 ఎకరాలను ఇవ్వనున్నట్లు స్పష్టం చేశామని మంత్రి కెటిఆర్ వివరించారు.

అయినప్పటికి రక్షణ శాఖ ఒప్పుకోకుండా మరో లేఖ రాసి కంటోన్మెంట్ రహదారులు కనుమరుగు అవుతున్నందున ప్రతి ఏటా రూ. 30 కోట్లను చెల్లించాలని పేర్కొందని గుర్తుచేశారు. ఒక ప్రభుత్వానికి చెంది న స్థలాన్ని మరో ప్రభుత్వానికి బదలాయించడంలో ఇన్ని ఇబ్బందులు అవసరమా అని కెటిఆర్ ప్రశ్నించారు. కంటోన్మెంట్ ప్రాంతం పూర్తిగా నగరంలో కలిసిపోయిందని, చాలా ప్రాంతాలవారు వారి రోడ్లను ఉపయోగించుకుంటున్నారని, వాటిని మూసేస్తామంటూ జిహెచ్‌ఎంసిని ఇబ్బంది పెడుతున్నదని మంత్రి వివరించారు. రాంచంద్రరావు స్పందిస్తూ రక్షణ మంత్రిని కలిసి తాను ఈ సమస్యను పరిష్కరిస్తానన్నారు. బిజెపి సభ్యులు చొరవ తీసుకుని రక్షణ భూముల్ని రాష్ట్ర అవసరాలకు ఇప్పించగలిగినట్లయితే స్కైవేల నిర్మాణం పనులకు రాంచంద్రరావుతోనే కొబ్బరికాయ కొట్టించి ప్రారంభిస్తామని కెటిఆర్ స్పష్టం చేశారు.

ఏప్రిల్ చివరి నాటికి

తెల్లరేషన్ కార్డులు

మన తెలంగాణ/హైదరాబాద్: అర్హులైనవారందరికీ తెల్లరేషన్ కార్డులను అందజేస్తామని, ఇప్పటికే రెండున్నర లక్షల మంది దరఖాస్తు చేసుకోగా అందులో 77వేల మందిని అర్హు లుగా గుర్తించామని, మిగిలిన దరఖాస్తులను కూడా పరిశీలించి ఏప్రిల్ చివరి నాటికి కొత్త కార్డులను జారీ చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టంచేశారు. శాసనసభలో బుధవారం పౌరసరఫరాల శాఖ పద్దులపై జరిగిన చర్చలో మంత్రి రాజేందర్ సమాధానమిస్తూ ఆహారభద్రత నిబంధనల మేరకు కార్డులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గుర్తులను ముద్రించే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. రాష్ట్రంలో సుమారు 1,91, 696 పేద కుటుంబాలు ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని, ఆ లెక్కల ఆధారంగానే ప్రస్తుతం బియ్యం కోటాను నిర్ణయించి సరఫరా చేస్తోందని, కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడి పరిస్థితులకు అనుగణంగా మొత్తంగా 2.74 కోట్ల మంది లబ్ధిదారులకు రేషన్ బియ్యం సరఫరా చేస్తోందని వివరించారు.రాష్ట్రంలో 17వేల మంది డీలర్లు ఉన్నారని, వారికి కిలోకు 70 పైసల కమీషన్‌ను త్వరలోనే చెల్లిస్తామన్నారు. పేదల నుంచి రేషన్ కార్డులను తొలగించాలనే ఉద్దేశం తమకు లేదన్నారు. అంతకుముందు బిజెఎల్‌పి నేత జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఆటోరిక్షాలు, అద్దె కార్లను నడిపిస్తున్న వారికి తెల్లరేషన్ కార్డులను తొలగించారని, సర్వే చేయకుండానే వాహనాలు ఉన్నాయనే నెపంతో కార్డులను తొలగించారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

మండలి భవనానికి వాస్తు మార్పులు?

పరిశీలించి సూచనలు చేసిన సిఎం !

మన తెలంగాణ/ హైదరాబాద్ : ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు బుధవారం శాసనమండలిని పరిశీలించారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా శాసనమండలిలోకి విచ్చేసిన సిఎం ప్రాంగణమంతా కలియతిరిగారు. రాష్ట్ర విభజన సందర్భం గా ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన మండలి భవన సముదాయాన్ని తిరిగి తెలంగాణకు ఇటీవల అప్పగించడంతో ప్రస్తు తం అదే భవనంలో మండలి సమావేశాలు జరుగుతున్నాయి. దీంతో శాసనమండలి భవన సముదాయం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోకి రావడంతో సిఎం అన్ని ఛాంబర్లను, హాల్స్‌ను తిరిగి నిశితంగా పరిశీలించారు. శాసనమండలి భవనాన్ని పూర్తిగా ఆధునీకరించడంతో పాటు వాస్తుకు అనుగుణంగా మార్పులు చేర్పులు చేయాల్సిందిగా శాసనసభ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులకు సిఎం కెసిఆర్ సూచించారు. దీంతో ముఖ్యమంత్రి భవనాన్ని పరిశీలించి వెళ్లిన వెంటనే ప్రభుత్వ వాస్తు పండితుడు సుధాకర్ తేజ శాసనమండలి చేరుకుని భవనాన్ని పరిశీలించి వెళ్లారు. ఈ భవనాన్ని ఎపి తన శాసనమండలి సమావేశాలకు వినియోగించుకున్నప్పుడు ముఖ్యమంత్రి ఛాంబర్‌గా వాడుకున్న గదినే ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి ఛాంబర్ అవసరాల కోసం ఇటీవల తీర్చిదిద్దారు. అయితే ఈ గది పట్ల ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేసి సౌకర్యాలు తగిన విధంగా లేవని పేర్కొన్నట్లు తెలిసింది. దీంతో ఆంధ్రప్రదేశ్ శాసన మండలి ఛైర్మన్ చక్రపాణి ఛాంబర్‌గా వాడుకున్న గదిని ఇప్పుడు సిఎం కెసిఆర్‌కు ఛాంబర్‌గా తీర్చిదిద్దనున్నట్లు సమాచారం. శాసనమండలికి వెళ్ళేటప్పుడు వాడిన దారిని కాకుండా తిరుగు ప్రయాణంలో మరో దారిని ఎంచుకున్నారు.

వ్యవసాయం తర్వాత పశుపోషణే ప్రాధ్యానం

మన తెలంగాణ/హైదరాబాద్: గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు సిఎం కెసిఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శాసనసభలో బుధవారం పశుసంవర్ధక శాఖ పద్దుపై జరిగిన చర్చలో మంత్రి సమాధానమిస్తూ వ్యవసాయం తర్వాత అత్యధిక జనాభా పశుపోషణ, మత్స్య సంపదపైనే ఆధారపడి జీవిస్తున్నట్లుతెలిపారు. దీన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం సుమారు 90 లక్షల కుటుంబాలు లబ్ధి పొందే విధంగా పథకాలను ప్రవేశపెట్టి అమలుచేస్తోందన్నారు. పశు సంవర్ధక శాఖలో టిఎస్‌పిఎస్‌సి ద్వారా 160 పోస్టులను భర్తీ చేస్తున్నామని, ఇప్పటికే కాంట్రాక్ట్ పద్ధతిన 105 మందిని నియమించామని వివరించారు. మీట్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రొత్స హిస్తున్నామని చెప్పారు. పశుసంవర్ధక శాఖ భవిష్యత్తులో మరిన్ని కొత్త ప్రణాళికలతో ముందుకెళ్తుందన్నారు. పశుపోషనను పెంపొందించేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రాష్ట్రంలో చేపలకు విపరీతమైన డిమాండ్ ఉన్నదన్నారు.

రైతు రాజ్యం కోసం టిఆర్‌ఎస్ కృషి

- అన్నదాత ముంగిట్లోకే విత్తనాలు, ఎరువులు
- పండించిన పంటకు ధర నిర్ణేతలు వారే



మన తెలంగాణ/ హైదరాబాద్ : టిఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు రాజ్యం కోసం కృషి చేస్తుందని టిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ రసమయి బాలకిషన్ అన్నారు. శాసన సభలో బుధవారం వ్యవసాయం, పాడి, పశు సంవర్ధక శాఖ, పౌర సరఫరాల శాఖ పద్దులపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రసమయి మాట్లాడుతూ అందులో భాగంగా విత్తనాల కోసం లైన్లలో నిలబడడం, అప్పుల కోసం ఊర్లలో షావుకార్ల ఇంటి ముందు నిలబడే పరిస్థితుల నుంచి టిఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు ముంగిళ్లోకే విత్తనాలు, ఎరువులు, పంట పెట్టుబడిని తీసుకువచ్చిందన్నారు. రైతులు పండించిన పంటలకు వారే ధర నిర్ణయించుకునే పరిస్థితి వచ్చేందుకు సిఎం కెసిఆర్ కృషి చేస్తున్నారన్నారు.

నకిలీ విత్తన సంస్థలపై చర్యలు : నకిలీ విత్తనాలను సరఫరా చేస్తున్న సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి సభ్యులు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభలో బుధవారం వ్యవసాయం, సహకార, పౌర సర ఫరాలు, పశుసంవర్ధక శాఖ పద్దులపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి రైతులతో అనుసంధానం చేసి క్షేత్ర స్థాయిలో పరిశోధనలు నిర్వహించాలన్నారు.

కౌలుదారులకు న్యాయం చేయండి : రైతుల ఆత్మహత్యలను నివారించేందుకు వారిని అన్ని విధాల ఆదుకోవాలని, కౌలు రైతులకు కూడా న్యాయం చేయాలని ఎంఐఎం ఎంఎల్‌ఎ సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రి ప్రభుత్వాన్ని కోరారు. ఒక నెల సరుకులు తీసుకోలేదని, టివీలు ఉన్నాయని తదితర కారణాలతో రేషన్ కార్డులను రద్దు చేసే చర్యలను ప్రభుత్వం విడనాడాలని, రద్దు చేసిన కార్డులను వెంటనే పునరుద్దరించాలని, రేషన్ దుకాణాలలో కేవలం బియ్యంతో పాటు 9 రకాల వస్తువులను పంపిణీ చేయాలన్నారు.

కేంద్ర ప్రభుత్వ సహాయాన్ని చెప్పండి : కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అందిస్తున్న సహాయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని బిజెపి ఎంఎల్‌ఎ చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గృహ నిర్మాణానికి, నిరంతర విద్యుత్ సరఫరా పథకానికి, నాబార్డు ద్వారా రైతుల ఆర్థిక సహాయం తదితర ఆర్థిక సహాయం గురించి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చెప్పకపోవడం విచారకరమన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా పథకాన్ని నిర్వీర్యం చేస్తూ రైతులకు రూ.5 లక్షల బీమాను ప్రవేశపెట్టిందన్నారు. రైతులకు మద్దతు ధర (ఎంఎస్‌పి) విషయంలో మార్పులు తెచ్చేందుకు, సుమారు 40 శాతం కేంద్ర ప్రభుత్వం భరించేందుకు ముందుకు వస్తున్నట్లు తెలుస్తోందన్నారు. నకిలీ విత్తనాలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాష్ట్రాన్ని విత్తన భాండాగారంగా మారుస్తామని చెప్పిన ప్రభుత్వం నాలుగేళ్లయినా ఆ పని ఎందుకు చేయలేదని రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. ఇందుకు వ్యవసాయ శాఖ మంత్రి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ రాష్ట్రంలో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని, పిడి చట్టాన్ని కూడా ప్రయోగిస్తున్నామని, నష్టపోయిన రైతులకు పరిహారాన్ని ఇప్పిస్తున్నామని, అందుకు అనుగుణంగా రాష్ట్ర చట్టాన్ని కూడా సవరించామని చెప్పారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఐ(ఎం) ఎంఎల్‌ఎ సున్నం రాజయ్య కోరారు. రాష్ట్రంలో 50 లక్షల టన్నుల ఉత్పత్తి తగ్గిందన్నారు. గిరిజన ప్రాంతాల్లో భూ గరిష్ట పరిమితితో సంబంధం లేకుండా పేదలందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

రైతు పెట్టుబడి పథకం

కౌలుదారులకు వర్తించదు

- మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి



మన తెలంగాణ/హైదరాబాద్: పంట పెట్టుబడి పథకాన్ని కేవలం పట్టాదారు రైతులకే వర్తింపచేస్తామని, కౌలు రైతులకు అమలు చేయడం సాంకేతికంగా సాధ్యం కాదని వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయబోతున్న పెట్టుబడి పథకం ప్రపంచంలో ఎక్కడా లేదని, తొలిసారి మన రాష్ట్రంలోనే అమలులోకి వస్తోందని, వ్యవసాయరంగంపై ముఖ్యమంత్రికి ఉన్న శ్రద్ధకు ఇది నిదర్శనమన్నారు. శాసనసభలో బుధవారం వ్యవసాయ, సహకార శాఖ పద్దులపై జరిగిన చర్చలో పోచారం పై విధంగా వ్యాఖ్యానించారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని, రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో కొన్ని జిల్లాలో రైతు ఆత్మహత్యలు నిలిచిపోయాయని, ఈ ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కుతుందని అన్నారు. ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకంలో కొన్ని లొసుగులున్నాయని, రైతును యూనిట్‌గా పరిగణించాలని సభ తీర్మానం చేసి పంపినా కేంద్రం ఇప్పటి వరకు నిర్ణయం తీసుకోలేదన్నారు.

వ్యవసాయంలో యాంత్రికీకరణ : భవిష్యత్తులో వ్యవసాయ కూలీల కొరత ఏర్పడే నేపథ్యంలో ముందస్తుగానే యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు సిఎం చర్యలు తీసుకుంటున్నారని, రైతులకు సబ్సిడీపై యంత్రాలను పంపిణీ చేయనున్నామని వెల్లడించారు. ప్రస్తుతం కెసిఆర్ తీసుకున్న నిర్ణయాలను గతంలో పాలించిన ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులు, పాలకులు అమలుచేసి ఉంటే రైతులు ఆత్మగౌరవంతో బతికేవారని అన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫారసుల అమలు, ఎన్నికల సమయంలో నరేంద్ర మోడి చేసిన హామీ ఇప్పటికీ అమలు కాలేదన్నారు. రైతు పరిస్థితులకు అనుగుణంగా పంటకు కనీస మద్దతు ధర నిర్ధారించాలని ప్రతిపాదించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం తమకిష్టమొచ్చినట్టుగానే ధరను నిర్ణయిస్తోందని ఆరోపించారు. గోదావరి నదిపై ఎగువ రాష్ట్రాలు వందల సంఖ్యలో ఆయకట్టు, బ్యారేజీలు నిర్మించినా నాటి పాలకులు పట్టించుకోలేదని ఆరోపించారు. సూక్ష్మ బిందు సేద్యం అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు.



బుధవారం టిఆర్ఎస్ఎల్‌పిలో నిర్వహించిన రాజ్యసభ ఎన్నికల మాక్‌పోలింగ్‌లో పాల్గొన్న ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు

సిఇసిని కలసిన కాంగ్రెస్ నేతలు

మనతెలంగాణ/న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేతలు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, సంపత్ కూమార్ లను వారి శాసనసభ్యత్వం నుండి అనైతికంగా తొలగించారని ఆరోపిస్తూ తెలంగాణ కాంగ్రెస్ నేతలు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చట్ట వ్యతిరేకంగా, రాజ్యాంగ వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని కేంద్ర ఎన్నికల సంఘానికి ఇచ్చిన ఫిర్యాదులో వారు పేర్కొన్నారు. బుధవారం కాంగ్రెస్ నేత మర్రిశశిధర్ రెడ్డి నేతృత్వంలో కేంద్ర ఎన్నికల సంఘాన్ని వారు కలి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. అనంతరం మర్రి శశిధర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఎలాంటి కారణం లేకుండా ఇద్దరు ఎమ్మెల్యేలను బహిష్కరించిన విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. అసెంబ్లీ సెక్రెటరీగా ఉన్న వ్యక్తి రిటర్నింగ్ ఆఫీసర్‌గా ఉన్నారు. అసెంబ్లీ సెక్రెటరీ ప్రభుత్వ తొత్తుగా వ్యవహరించి ఓటరు లిస్ట్ నుంచి ఇద్దరు ఎంఎల్‌ఎల పేర్లను తొలగించారని ఆరోపించారు.ఓటర్ల జాబితాల ఆ ఇద్దరు ఎమ్మెల్యేల పేర్లు చేర్చాలన్నారు.

కాంగ్రెస్ ఎంఎల్‌ఎలకు విప్ జారీ

మన తెలంగాణ/ హైదరాబాద్: రాజ్యసభ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ తరుపున గెలిచిన ఎంఎల్‌ఏలకు సిఎల్‌పి విప్ టి.రామ్మోహన్‌రెడ్డి బుధవారం విప్ జారీ చేశారు. ఇటీవల శాసనసభ సభ్యత్వం రద్దయిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎస్.ఎ.సంపత్‌కుమార్‌లతో కలిపి 19 మంది ఎంఎల్‌ఏలకు విప్ జారీ చేశారు. కాంగ్రెస్ నుండి టిఆర్ఎస్‌లో చేరిన ఏడుగురు ఎంఎల్‌ఏలను కూడా ఇందులో చేర్చారు.ఈ నెల 23న జరగనున్న రాజ్యసభ ఎన్నికలలో పాల్గొని, కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్‌కు ఓటు వేయాలని విప్‌లో పేర్కొన్నారు.

రాజ్యసభ ఎన్నికలకు టిడిపి, సిపిఐ(ఎం) దూరం

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించే రాజ్యసభ ఎన్నికలలో టిడిపి ఎంఎల్‌ఎలు పాల్గొనడం లేదని, ఓటింగ్‌కు దూరంగా ఉంటారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎల్. రమణ తెలిపారు. రాష్ట్రంలో అధికార పార్టీ టిఆర్ఎస్, ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీలకు టిడిపి రాజకీయంగా సమదూరంలో ఉంటుందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టిడిపి 15 మంది ఎంఎల్‌ఎలో సండ్ర వెంకట వీరయ్య, ఆర్.కృష్ణయ్య మాత్రమే ప్రస్తుతం ఆ పార్టీలో కొనసాగుతున్నారు. రాజ్యసభ ఎన్నికల ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నట్లు సిపిఐ(ఎం) ఎంఎల్‌ఎ సున్నం రాజయ్య తెలిపారు.



“ఎంత గొప్ప స్థానానికి వెళ్లినా సరే విద్యార్థిగానే ఉండు. అది నిన్ను మరింత ఉన్నత స్థానానికి తీసుకెళుతుంది.
– సర్వేపల్లి రాధాకృష్ణన్”

ఐసిస్ రాక్షసక్రీడకు బలి

సంపాదకీయం

‘‘ఇరాక్‌లోని మోసుల్‌ను ఆక్రమించుకున్న ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్, సిరియా’(ఐఎస్ఐఎస్) 2014 జూన్‌లో కిడ్నాప్ చేసిన 39 మంది భారత కార్మికులను చంపివేసింది, వారి భౌతిక కాయాలు దొరికాయి’’ అని విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ మంగళవారం రాజ్యసభలో చేసిన ప్రకటన దేశ ప్రజల్లో తెలియని బాధను, హతుల కుటుంబాల్లో విషాదం నింపింది. మృతుల్లో 27మంది పంజాబ్‌కు, నలుగురు హిమాచల్ ప్రదేశ్‌కు, ఆర్గురు బీహార్‌కు, ఇద్దరు పశ్చిమ బెంగాల్‌కు చెందినవారు. యుద్ధ కల్లోలంలో ఉన్న ఇరాక్‌లో తారిఖ్ నూర్ అల్–హుడా అనే నిర్మాణ కంపెనీలో వారు పనిచేస్తుండేవారు. ఐసిస్ బంధించిన 40 మంది కార్మికుల్లో ఒకరు – హర్జిత్ మాసి – తప్పించుకుని భారత్ చేరుకుని తన సహ కార్మికులు 39 మందిని తుపాకీ కాల్పులతో చంపివేశారని నాలుగేళ్ల క్రితమే చెప్పాడు. అయితే ప్రభుత్వం దాన్ని కొట్టి పారేసింది. గత నాలుగేళ్లలో కనీసం ఏడు సార్లు తమవారు సజీవంగానే ఉన్నారని ప్రభుత్వం తమను ఎందుకు నమ్మించిందని, సుష్మ ప్రకటన టెలివిజన్ ప్రసారం ద్వారా తెలుసుకుని దిగ్భ్రాంతికి గురైన ఆ 39మంది అభాగ్యుల కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. కొన్ని ప్రతిపక్ష పార్టీలు కూడా ప్రభుత్వం తప్పు సమాచారంతో పార్లమెంటును తప్పు త్రోవ పట్టించిందని ఆరోపించాయి. అయితే సుష్మాస్వరాజ్ సమర్థన సానుభూతితో అర్థం చేసుకోదగింది. ‘‘మాసీ ఒక వ్యక్తి. ఇతర 39 మంది చంపబడినట్లు అతడు చెప్పవచ్చు. కాని మేము ప్రభుత్వం, బాధ్యతతో వ్యవహరించాలి, నిర్ధారణ పూర్వకమైన రుజువు లేకుండా ఎవరినీ చనిపోయినట్లు ప్రకటించలేను. ఇవాళ ఆధారపూర్వకంగా పార్లమెంటుకు ముందుకు వచ్చాను’’ అన్నారామె.

మోసుల్ పట్టణంలో కిడ్నాప్ చేసిన 40మంది భారత కార్మికులను అక్కడికి 25 కిలోమీటర్లలోని బాదుష్ తీసుకెళ్లిన ఐసిస్ కిరాతకులు వారిని చంపి పెద్ద గోతిలో పూడ్చివేశారు. బంగ్లాదేశ్ ముస్లింనంటూ ఒకరు తప్పించుకున్నారు. ఆ కార్మికుల జాడ తెలుసుకునేందుకు భారతప్రభుత్వం నాటినుంచీ అనేక మార్గాల్లో ప్రయత్నించింది. ఇరాక్ సైన్యాలు 2017 చివరలో ఐసిస్ దిగ్బంధం నుంచి మోసుల్‌ను విముక్తి చేసిన తదుపరి గాని, ‘తప్పిపోయిన’ భారతీయుల కొరకు అన్వేషణ సాధ్యం కాలేదు. 2017 అక్టోబర్‌లో విదేశీ వ్యవహారాల సహాయమంత్రి వికెసింగ్ భారతీయుల జాడ తెలుసుకునే ప్రయత్నాలు ముమ్మరం చేసేందుకు ఇరాక్ వెళ్లారు. బాదుష్ ప్రాంతానికి వెళ్లినపుడు, సమీపంలోని దిబ్బకింద అనేక శవాలు పూడ్చిపెట్టారని స్థానికులు చెప్పారు. లోతుకు చొచ్చుకు పోగల రాడార్లతో పరీక్షించగా ఆ గోతిలో కచ్చితంగా 39 మృతదేహాలున్నాయి. ఈలోపు భారతప్రభుత్వం మృతుల కుటుంబీకుల డిఎన్ఎ శాంపిల్స్ సేకరించి పంపగా, బాగ్దాద్‌లో జరిపిన పరీక్షల్లో 38 మృతదేహాలు గుర్తించబడ్డాయి. 39వ వ్యక్తి డిఎన్ఎ అతని బంధువు డిఎన్ఎతో 70శాతం సరిపోలింది. హతుల భౌతిక అవశేషాలను భారత్‌కు తెచ్చి వారి కుటుంబాలకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఇప్పుడు జరగాల్సిందేమిటి? మృతుల కుటుంబాలకు కేంద్రప్రభుత్వం గణనీయంగా ఆర్థిక సహాయంప్రకటించటంతోపాటు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి ఆ కుటుంబాలు దుఃఖసాగరంనుంచి కోలుకుని సాధారణ జీవితం గడిపేందుకు చేయూత ఇవ్వాలి.

అధిక ఆర్జనతో కుటుంబాలను పోషించవచ్చనే భావనతో పొట్ట చేతబట్టుకుని కల్లోల పశ్చిమాసియాకు వెళ్లి బాధలనుభవిస్తున్న భారత కార్మికులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ప్రభుత్వ ఏజన్సీల ద్వారానే కార్మికులను పంపే పద్ధతి ఎంతైనా అవసరం. మలేషియాలో చిక్కుకున్న 35మంది జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ వలసకార్మికులను సుష్మా స్వరాజ్, మాల్దా కాంగ్రెస్ నాయకుడు మౌసం నూర్ చొరవతో భారత్ తీసుకు రావటం జరుగుతున్నది. అజర్‌బైజాన్‌లో చిక్కుకుపోయిన 160మంది బెంగాల్, జార్ఖండ్ వలస కార్మికుల అతీగతీ ఏమిటో తెలియదు. సౌదీ అరేబియాలో కూడా ఇటువంటి ఘటన వివరాలు తెలియాల్సి ఉంది. చేతులు కాలాక ఆకులు పట్టుకునే దానికన్నా ముందస్తు జాగ్రత్తలు మేలు.


ప్రై‘వేటు’తో బ్యాంకుల క్షాళన?!

చూపు

ఇటీవలి కాలంలో మొత్తం దేశాన్ని కుదిపేసిన కుంభకోణాల్లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పి.ఎన్.బి.)కుంభకోణం కొత్తగా చేరింది. ఈ కుంభకోణాల్లో కొన్ని వాస్తవమైనవి అయితే మరి కొన్ని ఊహాజనితమైనవి. పి.ఎన్.బి. వ్యవహారంలో రెండు అంశాలు ముందే స్పష్టం చేయాలి. మొదటిది ఈ బ్యాంకులో జరిగిన మోసాన్ని కొనసాగించడం. బ్యాంకును మోసం చేయడం అంటే ఆ బ్యాంకు ఉద్యోగులు కానీ ఇతరులు కాని నిబంధనలను ఉల్లంఘించి ఆ సంస్థకు నష్టం కలిగించడం. పి.ఎన్.బి. వ్యవహారం బ్యాంకు వాటాదార్లకు, నిర్వాహకులకు ప్రయోజనం కలిగించడానికి బ్యాంకే నియమ, నిబంధనలను ఉల్లంఘించడం లాంటిది కాదు. బ్యాంకు ఉద్యోగులు ఖాతాదార్లతో కుమ్మక్కైతే నిరర్థక ఆస్తులు పెరిగిపోవచ్చు. లేదా వ్యాపారానికి సంబంధించిన ఓ నిర్ణయం తప్పయినా నిరర్థక ఆస్తులు పెరగొచ్చు. రెండవది పి.ఎన్.బి. విషయంలో మోసం అంతా బ్యాంకులో ఉన్న వ్యవస్థలను, ప్రక్రియలను పాటించనందువల్ల జరిగిన నిర్వహణాపరమైన నష్టమే. ఇది రుణాలకు సంబంధించిన ముప్పు మాత్రమే కాదు. కలిగిన నష్టాలవల్ల వెంటనే రాజకీయ ప్రభావం పడింది కనక ఈ అంశానికి ప్రాధాన్యం ఉంది. ప్రతిపక్షం వెంటనే ఎన్.డి.ఎ. ప్రభుత్వ నిర్వాకాన్ని వేలెత్తి చూపింది. ఎన్.డి.ఎ. కు నాయకత్వం వహిస్తున్న బిజెపి పి.ఎన్.బి. కుంభకోణంలో ప్రధాన నిందితుడైన నీరవ్ మోదీకి కాంగ్రెస్ పార్టీతో సంబంధం ఉందని తీవ్ర ఆరోపణలు చేసింది. బ్యాంకు పరపతికి ముప్పు ఏర్పడితే అందులో తప్పకుండా ఉన్నతాధికారుల, రాజకీయ నాయకుల జోక్యం ఉండి తీరుతుంది. అంటే ఎవరో ‘చెప్తే’ రుణాలు ఇవ్వడం. వాణిజ్యపరంగా గిట్టుబాటు కాని వ్యవహారాల్లో ఇలా ప్రభుత్వరంగ బ్యాంకులను పురమాయించి ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు రుణాలు ఇప్పించిన సందర్భాలు ఉన్నాయి. ఇది నిర్వహణ ముప్పు కాదు. నిర్వహణ ముప్పు అయితే ఉద్యోగులకు ప్రయోజనం కలుగుతుంది. కొన్ని సందర్భాల్లో ఇతరులకు కూడా ప్రయోజనం కలగవచ్చు. కాని ఇందులో సాధారణంగా రాజకీయ జోక్యం ఉండదు. నీరవ్ మోదీకి రాజకీయ నాయకుల అండ ఎంతైనా ఉండొచ్చు. కాని పి.ఎన్.బి.లో జరిగిన నిర్వహణా లోపంలో పి.ఎన్.బి.కి రాజకీయ నిర్దేశం లేదా మద్దతు ఉందని చెప్పడానికి ఆధారం లేదు.

ఈ మోసానికి సంబంధించిన వివరాలు ఇంకా పూర్తిగా బయటపడలేదు. మీడియాలో వచ్చిన వార్తల ప్రకారం నీరవ్ మోదీకి చెందిన విదేశాల్లో పని చేసే సంస్థలకు భరోసా పత్రాలు (ఎల్.ఓ.యు.) ఇచ్చినట్టు తెలుస్తోంది. బ్యాంకులు పరస్పరం సందేశాలు పంపించుకోవడానికి స్విఫ్ట్ అనే ప్రక్రియను అనుసరిస్తాయి. పి.ఎన్.బి. వ్యవహారంలో ఒక ఉద్యోగి పై అధికారుల అనుమతి లేకుండా ఈ ఎల్.ఓ.యు.లు జారీ చేశారు. ఆ ఉద్యోగి జారీ చేసిన అనేక ఎల్.ఓ.యు.ల ఆధారంగానే విదేశీ బ్యాంకులు నీరవ్ మోదీకి రుణాలు మంజూరు చేశాయి.

సాధారణంగా ఈ భరోసా పత్రాలను స్వల్పవ్యవధి కోసం అంటే ఉదాహరణకు 90 రోజులు చెల్లుబాటులో ఉండేట్టుగా జారీ చేస్తారు. కాని సదరు ఉద్యోగి పరిమితికి మించి 365రోజుల కాలానికి భరోసా పత్రాలు జారీ చేశారు. ఇది నిబంధనలకు విరుద్ధం. ఈ వ్యవహారం దాదాపు ఏడేళ్ల పాటు కొనసాగింది. అంటే మోదీ నడిపే సంస్థలు సరైన సమయానికి రుణాలు చెల్లిస్తే తప్ప ఇతర బ్యాంకులు రుణాలు ఇవ్వవు. మరి ఇటీవలి కాలంలో మోదీ తీసుకున్న రుణాలు చెల్లించకపోయినా ఈ నిబంధనలు అమలు కాలేదా? లేదా నిబంధనలకు వ్యతిరేకంగా భరోసా పత్రాలు అందజేసిన ఉద్యోగి స్థానంలో వచ్చిన మరో ఉద్యోగి ఈ ఎల్.ఓ.యు.లను ఇవ్వడానికి నిరాకరించారా? కీలకమైన ఈ అంశం నిగ్గు తేలాల్సి ఉంది.



ఇప్పుడు ఈ విషయంలో ఏం చేయాలో స్పష్టత అవసరం. అలాగే తొందరపాటుతో ఏమీ చేయకూడదన్న విషయంలో కూడా స్పష్టత ఉండాలి. మొట్ట మొదట తేలాల్సింది ఈ ఎల్.ఓ.యు.ల ఆధారంగా తీసుకున్న రుణాల మొత్తం ఎంతో, ఆ డబ్బు వసూలు చేయడానికి కావాల్సిన ఆస్తులు నీరవ్ మోదీకి ఉన్నాయో లేదో తేల్చుకోవాలి. దీన్నిబట్టి పి.ఎన్.బి.కి జరిగిన నష్టాన్ని అంచనా వేయవచ్చు. జరిగిన నష్టం ఎంతో సత్వరం తేల్చాలి. ఎందుకంటే నష్టాన్ని గురించిన అంచనాలు చాలా ఎక్కువగా ఉన్నాయని అనుకుంటున్నందువల్ల ప్రభుత్వరంగ బ్యాంకుల వాటాల ధరలు గణనీయంగా తగ్గుతున్నాయి.

అంతర్గత భద్రతా నిబంధనలను ఎలా ఉల్లంఘించగలిగారో తేలవలసిన రెండో అంశం. పి.ఎన్.బి. వాడుతున్న స్విఫ్ట్ వ్యవస్థ ఆ బ్యాంకు సాఫ్ట్‌వేర్ కు అనుసంధానం కాలేదంటున్నారు. ఒకవేళ అలా జరిగి ఉంటే అంతర్గత ఆడిట్ లో ఈ విషయం ఎందుకు కనిపెట్టలేదో, ఈ ఆడిట్ పై మళ్లీ చేసే ఆడిట్ లో ఎందుకు బయటపడలేదో తేలాలి. రిజర్వుబ్యాంకు పర్యవేక్షణలో లోపం ఉన్నందువల్లే ఈ అవకతవకలు జరిగాయని ప్రభుత్వం వాదిస్తోంది. సాధారణంగా బ్యాంకుల్లో జరిగే అవకతవకలను బయటపెట్టడం పర్యవేక్షక వ్యవస్థలకు సంబంధించింది కాదు. సంబంధిత బ్యాంకులు అవకతవకలు జరిగాయని చెప్పిన తర్వాతే పర్యవేక్షకులు ఆ అంశాన్ని పరిశీలిస్తారు.

పి.ఎన్.బి. కుంభకోణం బయటపడ్డ తర్వాత ప్రభుత్వరంగ బ్యాంకులపై దుమ్మెత్తి పోస్తున్నారు. ప్రభుత్వరంగ బ్యాంకులపై ప్రభుత్వ పెత్తనం ఉన్నందువల్లే నియంత్రణ సవ్యంగా ఉండడం లేదని, మోసాలు జరుగుతున్నాయని నమ్మించడానికి ప్రయత్నిస్తున్నారు. బ్యాంకుల్లో లొసుగులను, నిధుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి ప్రభుత్వరంగ బ్యాంకుల మేనేజర్లకు ప్రోత్సాహకాలు లేవని కూడా చెప్తున్నారు.ఇలాంటివి జరగకుండా ఉండాలంటే ప్రైవేటీకరణ ఒక్కటే మార్గం అన్న రీతిలో మాట్లాడుతున్నారు.

అనేక సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా ప్రైవేటు బ్యాంకుల్లో భారీ మోసాలు జరిగాయన్న వాస్తవాన్ని గమనిస్తే ప్రైవేటురంగంలో మోసాలు జరగవు అన్న వాదన ఎంత హాస్యాస్పదమైందో గ్రహించవచ్చు. 1995లో నిక్ నెల్సన్ అనే ఒకే ఒక వ్యక్తి మోసానికి పాల్పడినందువల్ల బేరింగ్స్ అనే పెట్టుబడుల బ్యాంకు కుప్ప కూలింది. నియమ నిబంధనలను తుంగలో తొక్కి వ్యక్తులు ఈ ఆర్థిక సంస్థలను సర్వనాశనం చేసిన ఉదంతాలు కొల్లలుగా ఉన్నాయి.

ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రసిద్ధ బ్యాంకులు నియమ, నిబంధనలను ఉల్లంఘించి భారీ మోసాలకు అవకాశం ఇచ్చినందుకు కోట్లాది డాలర్ల జరిమానాలు చెల్లించవలసి వచ్చింది. అనేక అంతర్జాతీయ బ్యాంకుల్లో, ఆర్థిక సంస్థలలో ఇలాంటి మోసాలు లెక్కకు మిక్కిలిగానే జరిగాయి. ప్రైవేటు బ్యాంకులు నిబంధనలను ఉల్లంఘించి లాభాలు సమకూరిస్తే ఆ బ్యాంకుల మేనేజర్లకు బోలెడు లాభం చేకూరుతుంది. బ్యాంకుల్లో మోసాలు, వైఫల్యాలు వాటి యాజమాన్యం ప్రైవేటుదా, ప్రభుత్వానిదా అన్న దానితో నిమిత్తం లేదు. బ్యాంకింగ్ వ్యవస్థలో దుష్ప్రవర్తనకు ప్రైవేటీకరణే శరణ్యం అన్న వాదన కేవలం భ్రమే.

*** (ఇ.పి.డబ్ల్యు. సౌజన్యంతో)**

కాంగ్రెస్ లింగాయత్ అస్త్రం



వాహెద్
7093788843

కర్నాటకలో కాంగ్రెసు ప్రభుత్వం లింగాయత్ కులాన్ని ప్రత్యేక మతంగాను, మతపరమైన మైనారిటీలుగాను గుర్తించింది. ఇది ఒక రకంగా గుర్తింపు రాజకీయాలను నడపడమే. ఈ నిర్ణయం వెలువడిన కాసేపటికే కాల్బుర్గీ పట్టణంలో లింగాయత్ సముదాయానికి, వీరశైవ సముదాయానికి మధ్య ఘర్షణలు ప్రారంభమయ్యాయి. కర్నాటకలో అసెంబ్లీ ఎన్నికలు మరో రెండునెలల్లో జరగవలసి ఉంది. ఈ నేపథ్యం లో లింగాయత్ సముదాయం చాలాకాలంగా కోరుతున్న మాదిరిగా ప్రత్యేక మతంగా గుర్తించడమంటే కాంగ్రెసు రాజకీయంగా ప్రయోజనాలు పొందే ప్రయత్నమే. మరోవైపు లింగాయత్ సముదాయంలో ఇంతవరకు భారతీయ జనతాపార్టీకి ఓటు వేస్తున్న వారు కాంగ్రెసుకు ఓటు వేసేలా మత రాజకీయాలు నడపడమే.

భారత జనాభా లెక్కల్లో ఇంతవరకు లింగాయత్ సముదాయాన్ని హిందువులుగానే లెక్కిస్తున్నారు. కాని వీరు 12వ శతాబ్దంలో ధార్మిక గురువు బసవన్న కాలం నుంచి ప్రత్యేక సముదాయంగా గుర్తింపు పొందుతున్నారు. లింగాయత్ పెద్దల ప్రకారం బసవన్న ఒక ప్రత్యేక మతాన్ని స్థాపించారు. ఆ మతం హిందు మతానికి భిన్నమైనదే కాదు నిజానికి హిందూ మతబోధనలకు విరుద్ధమైన బోధనలున్న మతం. తమది సర్వమానవ సమానత్వం బోధించే మతమని, కుల, మత, భాషా వివక్షల్లేకుండా అందరినీ సమానంగా చూసే మతమని లింగాయత్ మేధావి యస్.ఎం.జామ్‌దార్ అన్నారు.

బసవన్న కులవ్యవస్థను తిరస్కరించిన మతబోధకుడు. అంతే కాదు వైదిక ఆచారాలను, బ్రాహ్మణీయ కట్టుబాట్లను నిరాకరించినవాడు. దక్షిణ భారతదేశం లో మధ్యయుగాల్లో భక్తి ఉద్యమాల కాలంలో బసవన్న ప్రముఖ మతగురువు. ప్రస్తుతం లింగాయత్ సముదాయం కర్నాటక, మహారాష్ట్ర, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో ఉన్నారు. చాలా సంవత్సరాలుగా తమను ప్రత్యేక మతంగా గుర్తించాలని కోరుతున్నారు. జామ్ దార్ ప్రకారం మహారాష్ట్రలోను ప్రత్యేక మతంగా గుర్తించాలన్న ఉద్యమం పెద్ద స్థాయిలో నడుస్తోంది. 2014లోనే మహారాష్ట్ర ప్రభుత్వం ఈ విషయమై కేంద్రానికి సిఫారసు చేయాలని భావించినట్లు జామ్‌దార్ చెబుతున్నారు.

లింగాయత్ సముదాయాన్ని ప్రత్యేక మతంగా గుర్తించాలన్న డిమాండ్ 1940 నుంచి ఉంది. కాని అప్పట్లో అఖిల భారత వీరశైవ మహాసభ బ్యానర్ కింద ఈ డిమాండ్ చేశారు. నిజానికి వీరశైవులు, లింగాయతులు రెండు సముదాయాలు. అవి దాదాపు ఒక్కటేనని చాలామంది అంటారు. ఈ రెండు సముదాయాల మధ్య భేదాల గురించి చర్చ కూడా చాలా నడుస్తోంది. గత కొంతకాలంగా లింగాయత్ సముదాయం ప్రత్యేకమతంగా, మైనారిటీ మతంగా గుర్తింపు కావాలని కోరడం ప్రారంభించింది. జామ్ దార్ ఈ విషయమై కొంత వివరణ కూడా ఇచ్చాడు. మూడుశాతం ఆరాధ్య బ్రాహ్మలు లింగాయతులుగా మారారని అన్నాడు. ఇలా మారిన వారు తర్వాత లింగాయత్ సముదాయంలో చీలికలు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించాడు. కులవ్యవస్థ నిమ్నోన్నతలు లింగాయత్ సముదాయంలోను తీసుకొచ్చే ప్రయత్నం చేశారని, వారినే వీరశైవులు అంటున్నారని వివరించాడు. ఇప్పుడు లింగాయతులను మైనారిటీ మతంగా తీర్మానించిన తర్వాత వీరశైవులు, తమ్ము తాము హిందువులుగా భావించేవారు, బసవతత్వాన్ని స్వీకరిస్తే లింగాయతులుగా కొనసాగవచ్చని అన్నారు.

లింగాయతులుగా మారిన తర్వాత బసవతత్వాన్ని పూర్తిగా స్వీకరించండి లేదా వీరశైవులుగానే ఉండిపోండి అంటున్నాడాయన. వీరశైవులకు, లింగాయతులకు మధ్య ఘర్షణకు దారితీసిన కారణాలు దీన్నిబట్టి అర్థమవుతాయి. లింగాయత్ సముదాయం కర్నాటకలో బలమైన సముదాయం. బిజెపికి చెందిన యద్యూరప్ప కూడా ఈ సముదాయానికి చెందిన నాయకుడే.

లింగాయత్ మతంగా ప్రజాస్వామికమైనదని, వైజ్ఞానిక జిజ్ఞాసకు అనుకూలమైనదని, ఆధునికమైనదని వాదించే ఉదారవాదులు చాలామంది ఉన్నారు. ప్రత్యేకమతంగా గుర్తించడం వల్ల హిందూమతం వల్ల సంక్రమించిన మూఢనమ్మకాలు, ఆచారాలను లింగాయత్ మతం ప్రక్షాళన చేసుకునే అవకాశం ఉందన్న వాదన కూడా ఉంది. కాని లింగాయత్ సముదాయాన్ని ప్రత్యేక మతంగా గుర్తించాలన్న డిమాండు వెనుక ఈ ఆధ్యాత్మిక, సైద్ధాంతిక కారణాల కన్నా ఎక్కువగా రాజకీయ కారణాలే ఉన్నాయనిపిస్తోంది. మైనారిటి మతంగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్న వారికి రాజకీయ పార్టీలతో సంబంధాలు కూడా కాదనలేనివి. ఇలాంటి మతరాజకీయాలు కేవలం ఆధ్యాత్మిక వికాసానికి మాత్రమే పరిమితం కావు. దీనివల్ల తలెత్తే చాలా చిక్కులుంటాయి. గ్రామీణ ప్రాంతాల్లో లింగాయతులుగాను, హిందువులుగాను ఇంతకాలం ఉంటూవచ్చిన ప్రజలు ఇప్పుడు హఠాత్తుగా శతాబ్దాల ఆచార సంప్రదాయాలను వదులుకుంటారా? ఇది ఒక ఘర్షణాత్మక వాతావరణాన్ని సృష్టించవచ్చు.

ఎన్నికలకు ముందు సిద్ధరామయ్య తీసుకున్న ఈ నిర్ణయం రాజకీయమైనదే. లింగాయత్ సముదాయం డిమాండ్‌ను ఎన్నికలకు ముందు ఆమోదించడంలోనే మత రాజకీయాలున్నాయి. బిజెపి కర్నాటకలో మతపరంగా ఓట్లను చీల్చి హిందూ ఓట్లను పొందాలని చూస్తోంది. ముఖ్యంగా కోస్తా ప్రాంతాల్లో బిజెపి పట్టుపెంచుకునే ప్రయత్నాల్లో ఉంది. జిహాదీలు కర్నాటకలో హిందూత్వ కార్యకర్తలను చంపేస్తున్నారన్న ప్రచారం ప్రారంభించింది. ఈ హంతకులకు కాంగ్రెసు ప్రభుత్వం అవసరమైన రక్షణ ఇస్తుందని ప్రచారం చేస్తోంది. 2014 నుంచి కర్నాటకలో 23 మంది ఆరెస్సెస్, హిందూ కార్యకర్తలను జిహాదీలు చంపేశారన్న ప్రచారంతో బిజెపి ఎన్నికల ప్రయోజనాలు పొందాలని చూస్తోంది. కర్నాటకలో పాప్యులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా, కర్నాటక ఫోరం ఫర్ డిగ్నిటీ సంస్థలపై ఆరోపణలు గుప్పిస్తోంది. కాని విచిత్రంగా స్క్రోల్ పత్రిక ఒక హతుని భార్య వందన మహదేవన్‌ను ఈ విషయమై ప్రశ్నించినప్పుడు తన భర్త పేరు ఈ ఆరెస్సెస్ జాబితా లో ఎలా వచ్చిందో తనకు తెలియదని, తమకు ముస్లిములతో ఎలాంటి సమస్యలు లేవని, తన భర్తను రాజకీయ ప్రత్యర్థులు చంపారని, తన భర్త బిజెపి సభ్యుడని, గ్రామ సర్పంచ్ అనీ, కాంగ్రెసు పార్టీ వాళ్ళే ఈ హత్య చేయించారని చెప్పింది. అరెస్టయిన నిందితుల పేర్లు భీం షా యాదవ్, న్యాను, గోపులు ముస్లిములు కానే కాదు. స్క్రోల్ విలేఖరి ఈ 23 మంది హతుల చిరునామాలతో ప్రతి ఊరు సందర్శించాడు. ఇందులో ఇద్దరు ఆత్మహత్యలు చేసుకున్నట్లు కుటుంబ సభ్యులే చెప్పారు. మరో ఇద్దరిని చంపింది సొంత అక్కాచెల్లెళ్ళే. రియల్ ఎస్టేట్ తగాదాలు, రాజకీయాలు, ప్రేమగొడవలు ఇలా ఎన్నో కారణాలు ప్రతి హత్య వెనుక ఉన్నాయి. కాని ఇదంతా జిహాదీల రక్తపాతం అంటూ బిజెపి ప్రజలను రెచ్చగొట్టడం కర్నాటకలో ప్రారంభించింది. బీహారులో అరారియాలో సర్ ఫరాజ్ ఆలమ్ గెలవగానే పాకిస్తాన్ జిందాబాద్ నినాదాలు వినిపించాయని వీడియో ఆడియో మిక్సర్ చేసిన దొంగ వీడియో ప్రచారంలో పెట్టారు. తర్వాత నిజాలు తెలిశాయి. ఇలా అబద్ధాలతో బిజెపి చేస్తున్న ప్రచారం ఎలాగూ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెసు ఇప్పుడు తనవైన మతరాజకీయాలు ప్రారంభించడం ఆందోళన కలిగించే అంశం.

రాష్ట్రంలో కులాల వారీగా రాజకీయ పార్టీలకు మద్దతివ్వడం కనిపిస్తుంది. కర్నాటకలో భూయాజమాన్యం ఉన్న ప్రముఖ సముదాయం లింగాయత్. వీళ్ళంతా మొన్నటి వరకు బిజెపి మద్దతుదారులు. మరో ప్రముఖ సముదాయం వొక్కలిగ. జనతాదళ్ సెక్యులర్ పార్టీకి సంప్రదాయికంగా ఓటేస్తారు. 1970 తర్వాతి నుంచి అహిందా సముదాయం కాంగ్రెసుకు మద్దతిస్తూ వస్తోంది. ఇప్పుడు లింగాయత్ ఓటు బ్యాంకుకు కాంగ్రెసు గండి కొట్టింది. అందుకే బిజెపి మతరాజకీయాలంటూ ఇప్పుడు గగ్గోలు పెడుతోంది. కాంగ్రెసు తీసుకున్న ఈ నిర్ణయం బిజెపి ఎన్నికల అవకాశాలను దెబ్బ తీస్తుందా లేక కర్నాటకలో మతరాజకీయాలను మరింత పెంచుతుందా?

లింగాయత్ సముదాయాన్ని ప్రత్యేక మతంగా గుర్తించాలంటూ నాగమోహన్ దాస్ కమిటీ సిఫారసు చేసింది. ఈ సిఫారసును ఇప్పుడు సిద్ధరామయ్య ప్రభుత్వం ఆమోదించింది. వీరశైవులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. కల్బుర్గిలో ఘర్షణలు చెలరేగాయి. కాంగ్రెసు ఓటు బ్యాంకు రాజకీయాలు నడుపుతుందంటూ బిజెపి విమర్శించింది. కర్నాటకలో బిజెపి అగ్రనాయకుడు యద్యూరప్ప లింగాయత్ సముదాయానికి చెందినవాడే. లింగాయతులు, వీరశైవులు అందరూ ఒక్కటేనని, ఈ రెండు సముదాయాలను వేరు వేరు చేయలేమంటున్నాడు. బిజెపికి చెందిన యద్యూరప్ప వైఖరిని లింగాయత్ పెద్దలు ఖండిస్తున్నారు. మాజీ ఐఏయస్ అధికారి, ప్రత్యేక మతంగా గుర్తించాలని ఉద్యమం నడుపుతున్న జామ్ దార్ ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాడు. యద్యూరప్ప వంటి నేతలు లింగాయత్ మూలాలు తెలుసుకుని మాట్లాడాలని అంటున్నాడు. మరోవైపు వీరశైవుల్లోనూ అఖిల భారత వీరశైవ మహాసభ కూడా సిద్ధరామయ్య ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించింది.

ఏదిఏమైనా లింగాయత్ సముదాయాన్ని ప్రత్యేక మైనారిటీ మతంగా గుర్తించడం వల్ల మైనారిటీ ప్రయోజనాలు ఆ సముదాయానికి లభిస్తాయా లేదా అన్నది పక్కన పెట్టినా, రాజకీయంగా కర్నాటకలో మత రాజకీయాలు ఇప్పుడు పెద్దస్థాయిలో ప్రజల మధ్య చిచ్చుపెట్టే ప్రమాదం కనబడుతోంది.

అందరికీ రక్షిత నీరు అందించడమే లక్ష్యం కావాలి



బోడ నాగేశ్వరరావు

పంచ భూతలలో ఒకటైన నీరు సమస్త జీవకోటికి ప్రాణాధారం. ప్రకృతి వనరులలో నీరు అతి ముఖ్యమైనది. నీరు లేకుండా జీవులు మనుగడ సాగించలేవు. రెండు హైడ్రోజన్, ఒక ఆక్సిజన్ పరమాణువుల సమ్మేళనమే నీరు.

భూగోళంపై మూడు వంతులు నీరు, ఒక వంతు భూమి ఉన్నా తాగడానికి ఒక శాతం మాత్రమే మంచి నీరు ఉంది. నీటి లభ్యత, డిమాండ్, కొరత దృష్ట్యా జల సమస్యపై చర్చించి చర్యలకు 2003 డిసెంబర్ నుండి ఐక్యరాజ్యసమితి అడుగులు వేసింది. సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి ప్రతి ఏటా మార్చి 22న ప్రపంచ జల దినోత్సవాన్ని జరుపుకోవాలని తీర్మానించింది.

ప్రపంచ ఆరోగ్యసంస్థ నిబంధనల ప్రకారం ప్రతి వ్యక్తికి రోజుకు 145 లీటర్లు నీటిని అందించాలి. కాని మనకు సుమారు 100 లీటర్లు నీరు అందడం లేదు. సంవత్సరంలో 100గంటలు వర్షం మన దేశంలో పడుతున్నా నీటి ఎద్దడి సమస్య వేసవిలో ఎక్కువగా ఉంది.

నీటిని ముఖ్యంగా త్రాగడానికి, సాగుకు, విద్యుత్ ఉత్పత్తికి, పరిశ్రమలకు వినియోగిస్తున్నారు. వ్యవసాయానికి 80% వరకు, పరిశ్రమలకు – 3%, విద్యుత్ ఉత్పత్తికి— 14%, గృహ అవసరాలకు 4% నీటిని వినియోగిస్తున్నారు.

నదులు, సరస్సులు, సముద్రాలలో వున్న నీరు సూర్యరశ్మికి చిన్నచిన్న నీటి తుంపరులుగా ఆవిరి రూపం దాల్చి ఆకాశంలో చిన్న నీటి బిందువులుగా ఏర్పడుతుంది. సాంద్రత పెరిగితే కుదించుకొని మేఘాలుగా ఏర్పడి తిరిగి భూమిపై వర్షం కురుస్తుంది.

మోతాదుకు మించి కాలుష్య కారకాలు, రసాయనాలు ప్లాస్టిక్ వంటివి నీటిలో చేరడం వల్ల రసాయన వ్యర్థజలాలను శుద్ధిచేయకుండా నదులలో, చెరువులలో వదలడం వల్ల జలవనరులు త్వరితగతిన కాలుష్యం బారిన పడుతున్నాయి.

నదులు, ఉపనదులు, నీటి వనరులు, నీటి నాణ్యత పరీక్షలు నిర్వహిస్తున్న కాలుష్య నియంత్రణ మండలి సర్వే ఆధారంగా గోదావరి నదీ జలాల్లో అమ్మోనియా స్థాయి పెరిగింది. నీటిలో కరిగి ఉండే ఆక్సిజన్, మూసీ నదిలో తీవ్రస్థాయిలో తగ్గింది. కృష్ణానదిలో కూడా కాలుష్య కారకాలు చేరుతున్నాయి.

హుస్సేన్ సాగర్ వంటి చెరువులు, మూసీ వంటి నదులలో వ్యర్థ జలాలు శుద్ధి చేయడానికి కోట్లు ఖర్చు అవుతున్నా, అంతే స్థాయిలో కాలుష్య కారకాలు పెరుగుతున్నాయి.

మనకు వచ్చే వ్యాధులలో 80శాతం నీటి కాలుష్యంవల్ల వస్తున్నాయి. ఒక లీటరు నీటిలో ఒక మిల్లీ గ్రాము కంటే ఫ్లోరైడ్ ఉన్నట్లయితే దంతాలు పచ్చగా మారతాయి. నల్గొండ జిల్లాలో చాలామంది ప్రజలు ఫ్లోరైడ్ వ్యాధితో బాధపడుతున్నారు. వ్యవసాయం దిగుబడి ఉండదు. కలుషిత జలాలు భూగర్భంలోకి వెళితే నీరు తీవ్ర కాలుష్యంగా మారుతుంది. కలుషితమైన నీరు ఉపయోగించడం ద్వారా చర్మవ్యాధులు వస్తాయి.

1974 నీటి కాలుష్య నియంత్రణ చట్టం ప్రకారం రాష్ట్ర, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలులను ఏర్పాటు చేశారు.

నీటి నమూనాలను సేకరించి, విశ్లేషించి మోతాదుకు మించి ఉన్న కలుషితాలు గుర్తించి, ప్రభుత్వానికి సలహాలు, సూచనలు అందించడం, కలుషిత జలాలు విడుదల చేసే పరిశ్రమలకి శిక్ష, జరిమానా విధించి మూసివేయడం జరుగుతుంది.

1977 లో వాటర్ సెస్ చట్టాన్ని ఏర్పాటు చేసి నీటి వినియోగదారుల నుంచి పన్నులు వసూలు చేస్తున్నారు.

నీటి వనరులు–సంరక్షణ జాగ్రత్తలు :

- నీటిని పొదుపుగా వినియోగించడం
- కలుషితమైన మురుగు వ్యర్థ జలాలు, వ్యర్థ పదార్థాలు, రసాయన వ్యర్థాలను రీసైక్లింగ్ చేయకుండా నేరుగా చెరువులలో, నదుల్లో, బహిరంగ ప్రదేశాల్లో, డ్రైనేజీల్లో కలపరాదు.
- వాన నీటిని ఒడిసిపట్టే ఇంకుడు గుంటల నిర్మాణం జరగాలి.
- గృహాలు, అపార్ట్‌మెంట్‌ల వద్ద మురుగు నీటిని శుద్ధి చేసే మిని సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలి.
- గ్రామాలలో ‘ఆర్‌ఒ’ విధానం ద్వారా శుద్ధిచేసిన సురక్షిత మంచినీరును అందించాలి.
- బావుల్లో, చెరువుల్లో, నదులలో కాలుష్యం నుండి రక్షించడానికి ‘నిరంతరం నిఘా’ టెక్నాలజీ ఏర్పాటు చేయాలి.
- భూగర్భ జలాలు అడుగంటి పోకుండా బోర్లను ‘వాటర్ షెడ్ విధానం’ అమలు చేయడం.
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు బదులుగా మట్టి విగ్రహాలు వినియోగించాలి.జల వనరులను కాపాడాలి.
- నీటిలో చెత్త, చెదారం, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పారవేయడం చేయరాదు.
- రసాయన వ్యర్థ జలాలు, పరిశ్రమలలో వ్యర్థాలు శుద్ధివిధానం ‘లేనియర్ కామన్ ట్రీట్‌మెంట్ ప్లాంట్’ ద్వారా శుద్ధి చేయడం.
- ఉప్పు నీటిని మంచినీరుగా మార్చే ప్రక్రియపై విస్తృత పరిశోధనలు జరగాలి.
- ప్రజలలో స్వచ్ఛంద సంస్థలు ద్వారా జలసంరక్షణ విద్యపై చైతన్య కార్యక్రమాలు అమలు చేయాలి
- రైతులు పొలాలలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి.
- మట్టి కుండలు వినియోగాన్ని ప్రోత్సహించాలి.

అఖిల





ప్రపంచ వ్యాప్తంగా ప్రతిరోజూ ప్రసూతి సంబంధమైన సమస్యలతో 800 మందికి పైగా గర్భిణులు చనిపోతున్నారు. ఇవి గాలి లెక్కలు కాదు. సాక్షాత్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్తున్న నివేదిక. అందులో ఎక్కువ శాతం మరణాలు ఇండియా, ఆఫ్రికా లాంటి అల్పాదాయ దేశాల్లోనే సంభవిస్తున్నాయి. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సరైన వైద్య సదుపాయం లేక ఎందరో గర్భిణులు పురిటి నొప్పుల కంటే ముందే ప్రాణాలు విడుస్తున్నారు. ఇప్పటికీ మన దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో గర్భం దాల్చిన మహిళ పసరు మందులతోనే సరిపుచ్చుకుంటోంది. మెటర్నల్ హెల్త్ కేర్ విషయంలో ఇండియా చాలా వెనుకబడి వుంది. మారుమూల ప్రాంతాలు, మురికివాడల్లో కూడా ఎండ్ టు ఎండ్ సొల్యూషన్ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ పని చేయడానికి ముందుకొచ్చింది కేర్ ఎన్ ఎక్స్ అనే స్టార్టప్. హెల్త్ వర్కర్ల సాయంతో గర్భవతులను పరీ క్షించి అవసరమైన చికిత్సలు, మందులు అందించ డంలో ఈ సంస్థ ఎంతగానో సాయపడుతోంది.

పేద గర్భిణులకు ప్రేమతో..

శాంతన్ పాఠక్, ఆదిత్య కులకర్ణి అనే ఇద్దరు ఇంజినీర్ల బ్రెయిన్ చైల్డ్ కేర్ ఎన్ ఎక్స్. ముంబైకి చెందిన సైన్స్ ఫర్ సొసైటీ అనే ఎన్జీవోతో కలిసి పనిచేస్తున్నప్పుడు మారుమూల గ్రామాల్లో గర్భిణులు పడుతున్న అవస్థలను కళ్లారా చూసిన వీరు చలించిపోయారు. ఎలాంటి వైద్య సదుపాయాలు లేక రెగ్యులర్ చెకప్స్, బేసిక్ మెడిసిన్ దొరక్క యాతన పడుతున్న



వాళ్ల నిస్సహాయత చూసి కరిగిపోయారు. గర్భంతో ఉండి ఎంత రిస్క్ చేస్తున్నారో చూసి ఆవేదన చెందారు. ఇలాంటి వాళ్లకోసం ఏదో ఒకటి చేయాలని అనుకున్నారు. ఆ ఆలోచనల్లోంచి పుట్టుకొచ్చిందే కేర్ ఎన్ ఎక్స్. 5 రాష్ట్రాలు, 150 గ్రామాలు, 12కు పైగా మురికివాడల్లో కేర్ ఎన్ ఎక్స్ సేవలందిస్తోంది. ఇప్పటిదాకా 6వేల మంది గర్భిణులకు కేర్ ఎన్ ఎక్స్ మెడికల్ సహాయం చేసింది. కార్పొరేట్ కంపెనీల సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమాల్లో భాగంగా గర్భిణులకు వివిధ రకాల సేవలందించడానికి సంకల్పించారు.

ముంబైకి చెందిన అర్మన్, స్వస్థ్య లాంటి లాభాపేక్ష లేని సంస్థలు కూడా ఇలాంటి మెటర్నల్ హెల్త్ కేర్ సేవలనే అందిస్తున్నాయి. కాకపోతే కేర్ ఎన్ ఎక్స్ మాదిరిగా ఇవి ఓవరాల్ చెకప్స్ చేయడం లేదు. సమస్యను గుర్తించడమే కాదు.. దానికి సొల్యూషన్ కూడా చెప్తుందీ స్టార్టప్. గైనకాలజిస్టుల నుంచి అవసరమైన వైద్యం సాయం అందిస్తుంది. సర్వీస్ మొత్తం హెల్త్ వర్కర్లే చూసుకుంటారు. మొబైల్ యాప్, వెబ్ అప్లికేషన్, మెడికల్ కిట్ ఈ మూడు వాళ్ల దగ్గరుంటాయి. దాంతో వాళ్లు ఇల్లిల్లూ తిరిగి ప్రతీ గర్భిణిని చెక్ చేస్తారు. స్మార్ట్ అల్గారిథం ద్వారా గర్భిణికి ఏ రకమైన వైద్య సాయం కావాలో వెంటనే చెప్తారు. సదరు మహిళను అందుబాటులో ఉన్న డాక్టర్ దగ్గరికి చేరవేస్తారు. పూర్తిగా టెక్నాలజీ సాయంతో పనిచేసే కేర్ ఎన్ ఎక్స్ మెటర్నల్ హెల్త్ కేర్ విషయంలో కీలక పాత్ర పోషిస్తోంది. డేటా కలెక్షన్, అనాలిసిస్, రిపోర్టింగ్ అంతా క్లౌడ్ ద్వారా చేస్తారు.

కేర్ ఎన్ ఎక్స్ రెండు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ని కూడా డెవలప్ చేసింది. అందలో ఒకటి ఐఎన్ఎస్టీ. ఇది గర్భంలో శిశువు హార్ట్ బీట్ చెక్ చేస్తుంది. ఇంకోటి యూనివర్సల్ స్ట్రిప్ రీడర్ (యూఎస్ఆర్). ఇది నిమిషాల్లో వివిధ రకాల పరీక్షలు చేస్తుంది. ఈ స్టార్టప్ పనితీరు చూసి జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఫండింగ్ చేయడానికి ముందుకు వచ్చాయి. ఐఐటీ బాంబే సెంటర్ ఫర్ సోషల్ ఇన్నోవేషన్ అండ్ ఆంట్రప్రెన్యూర్‌షిప్ వాళ్లు ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. గ్రాండ్ ఛాలెంజెస్ కెనడా, వరల్డ్ హెల్త్ పార్ట్‌నర్స్, ఐక్యారాజ్య సమితి మహిళా కమిటీ, ఇండియా, అమెరికాలోని ఇన్ఫోసిస్ ఫౌండేషన్ వాళ్లు నిధులివ్వడానికి ముందుకు వచ్చారు. కేర్ మదర్ కిట్స్ అమ్మకం ద్వారా కేర్ ఎన్ ఎక్స్ ఇప్పుడిప్పుడే రెవెన్యూ సాధిస్తోంది.

వీరు మహారాష్ట్ర, నాగాలాండ్ ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తున్నారు. ఆరోగ్య సంస్థలతో కలిసి ఒక లాంగ్ టర్మ్ విజన్ తో బలమైన టెక్నాలజీని తయారుచేసి ప్రతీ గర్భిణికి మెరుగైన వైద్యం అందించాలని లక్ష్యంగా పెట్టుకున్న కేర్ ఎన్ ఎక్స్‌కు చురుకైన పది మంది టీం ఉంది.

జయహో గ్యాంగ్ ఉమెన్!



ఒకప్పుడు రైల్వే శాఖలో రైలుపెట్టెలను క్రమబద్ధీకరించడం, వాటి నిర్వహణ, మరమ్మతులతోపాటు రైలుపట్టాల పర్యవేక్షణలో కేవలం పురుషులు మాత్రమే ఉండేవారు. అందుకే వాళ్లను గ్యాంగ్‌మెన్ అనే వారు. ఇప్పుడు ఆ విభాగంలో మహిళలు కూడా ప్రవేశించారు. మేం ఎందులోనూ తక్కువకాదంటున్నారీ గ్యాంగ్ ఉమెన్ .

ఈశాన్య రైల్వే విభాగం గువహటి మహిళా కార్మికుల బృందానికి తొలిసారిగా ఈ బాధ్యతలను అప్పగించింది. ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల ఎనిమిదో తేదీన 20మంది మహిళలకు మొట్టమొదటిసారిగా రైలుపట్టాల పరిశీలన, భద్రతా, పర్యవేక్షణ లాంటి బాధ్యతలు లభించాయి. 165ఏళ్ల చరిత్రలో ఈ విభాగంలో మగవారు మాత్రమే ఉన్నారు. అటువంటిది ఇప్పుడు మహిళలు ప్రవేశించడం హర్షించదగింది. ఇప్పుడు ఎంపికైన మహిళా కార్మికులంతా గతంలో రైల్వేశాఖలో రకరకాల విభాగాల్లో పనిచేసేవారు. నిజానికి ఇలాంటి విభాగాల్లో మహిళల సంఖ్య చాలా తక్కువ. ఇంచుమించు పదేళ్లకు పైగా అనుభవం సాధించిన ఆ మహిళలందరినీ ఒకే విభాగంలో ఉంచాలని, ఈశాన్య రైల్వే విభాగం గువహటి నిర్ణయించింది. గువహటిలోని రైలుపెట్టెల నిర్వహణా విభాగం కింద ఆరు రైల్వే లైన్లు, 1,300 రైలు పెట్టెల పర్యవేక్షణ ఉంటుంది. ఇక్కడ వెయ్యి మంది కార్మికులు పనిచేస్తుంటే, వీరిలో 200 మంది మహిళలున్నారు. ఆ మహిళల్లో ఎంపికైన 20 మందికి మూడు వారాలపాటు రైల్వేశాఖ అదనపు శిక్షణనిచ్చింది. రైలుపట్టాల పరిశీలన, భద్రతా, పర్యవేక్షణ వంటి అంశాల్లో అవగాహన కల్పించింది. ఇకపై వీరంతా వంతుల వారీగా పనిచేస్తారు. గతంలో రైలు పెట్టెలకు రంగులు వేయడం, వెల్డింగ్ వంటి చిన్నచిన్న మరమ్మతులను మాత్రమే చేసేవారు. ఇప్పుడు సాంకేతికపరంగా అభివృద్ధిని సాధించి, పురుషులతో సమానంగా పైలెట్ ప్రాజెక్టుల నిర్వహణలో భాగస్వాములయ్యారు.





రాగి పాత్రలు మెరవాలంటే..

రాగిపాత్రల వినియోగం ఈ మధ్యకాలంలో ఎక్కువగా ఉంది. నీళ్లు తాగడానికి, ఆహారపదార్థాలు వండుకోవడానికీ వీటిని ఉపయోగిస్తున్నారు. ఇవి తళతళా మెరవాలంటే ఏంచేయాలో చూద్దాం...



* సగం కోసిన నిమ్మకాయ ముక్కపై ఉప్పు వేసి రాగి పాత్రలను తోమాలి. నిమ్మరసం, ఉప్పు మిశ్రమాన్ని పాత్రల అడుగుభాగంలో అంచులకు బాగా రుద్ది అరగంట తర్వాత శుభ్రం చేస్తే పాత్రలు మెరుస్తాయి.
* నిమ్మకాయలు అందుబాటులో లేకుంటే వెనిగర్‌ను ఉపయోగించవచ్చు. అరకప్పు వెనిగర్‌తో పెద్ద చెంచా ఉప్పు వేసి బాగా కలపాలి. దీంతో రాగిపాత్రల్ని తోమాలి.



* ఏదైనా పిండి, డిటర్జెంట్ పొడిని సమపాళ్లలో తీసుకోవాలి. కొద్దిగా వెనిగర్, నిమ్మరసం, నీళ్లు పోసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని సీసాలో భద్రపరుచుకోవాలి. అవసరమైనప్పుడు దీంతో రాగిపాత్రల్ని శుభ్రం చేసుకుంటే అవి తళతళ మెరుస్తాయి.
* వంటసోడాలో కాస్త నిమ్మరసం లేదా కేవలం వంటసోడాతోనే పాత్రల్ని తోమినా సరిపోతుంది.

వేడి నుంచి ఉపశమనం పొందాలంటే..!

ఎండాకాలం వచ్చేసింది. ఉష్ణోగ్రతలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. వేడి నుంచి ఉపశమనం పొందాలంటే ఇళ్లు, ఆఫీసుల్లో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు ఉపయోగించక తప్పదు. దాంతో పాటు వాటి నిర్వహణ, కరెంటు బిల్లూ తడిసిమోపెడవుతుంది. ఇప్పడే వీటి అవసరం లేకుండా అదనపు ఖర్చులేకుండా ఇంటిని చల్లగా ఎలా ఉంచుకోవాలో తెలుసుకుందాం...



పైకప్పుపై కోటింగ్, టైల్స్: ఇండివిడ్యుయల్ ఇళ్లు, అపార్ట్‌మెంట్లలో అన్నింటికన్నా పై అంతస్తులో ఉండే ఫ్లాట్ల సీలింగ్ పైకి ఎండ నేరుగా పడుతుంది. పైకప్పు వేడెక్కి ఉన్నప్పుడు సీలింగ్ ఫ్యాన్ వినియోగించడం వల్ల ఫ్యాన్ పైకప్పు వేడిని గదిలోకి విడుదల చేసి.. వేడి మరింత పెరుగుతుంది. ఈ సమస్య నుంచి ఉపశమనం పొందాలంటే పైకప్పు పైన నేరుగా ఎండ పడే ప్రాంతంలో కూల్ సిమెంట్ కోటింగ్ లేదా రిఫ్లెక్టివ్ కోటింగ్ వేయించాలి. కూల్ సిమెంట్ కోటింగ్ అంటే ఒక రకం క్రిస్టల్స్ కలిపి ఉన్న పొడి, సాధారణ సిమెంటు మిశ్రమం. తెలుపు రంగులో ఉండే ఈ మిశ్రమం సూర్యరశ్మిని ఏమాత్రం సంగ్రహించకుండా పరావర్తనం చెందిస్తుంది. అందువల్ల పైకప్పు వేడెక్కదు. ఇంటి లోపల చల్లగా ఉంటుంది.

ఇంటి లోపలి వైపు సీలింగ్ కు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ)తో కోటింగ్ వేయిస్తే పైకప్పు వేడి ఇంట్లోకి ప్రవేశించకుండా ఉంటుంది. ఇంట్లో పైకప్పుకు కొంచెం కిందుగా థర్మాకోల్ తో ఫాల్స్ సీలింగ్ ఏర్పాటు చేసుకోవడం వల్ల కూడా ఇంట్లో చల్లదనం నెలకొంటుంది. ఆఫీసులు, చిన్న చిన్న కార్యాలయాల్లో ఇవి ఎక్కువ ఉపయుక్తంగా ఉంటాయి.

డాబా పైన నేరుగా వదిలేయకుండా.. మొజాయిక్ టైల్స్ వంటివి వేయిస్తే కూడా పైకప్పు వేడవకుండా ఉంటుంది. దీనివల్ల ఇంట్లో చల్లగా ఉంటుంది. తెర చాపలు, మ్యాట్ ల వంటివి లేకపోతే కాస్త మందమైన బెడ్ షీట్లు, పెద్ద సైజు టవల్స్ వంటివి కూడా నీటితో తడిపి తలుపులు, కిటికీల వద్ద కట్టుకోవచ్చు.

మొక్కలు పెంచాలి: ఇంటి చుట్టూ ప్రదేశం ఉంటే మొక్కలు పెంచడం వల్ల చల్లదనం నెలకొంటుంది. అపార్ట్‌మెంట్లు అయితే బాల్కనీలో కుండీలు పెట్టుకుని.. వాటిలో మొక్కలు పెంచొచ్చు. తీగ మొక్కలు పెంచడం వల్ల అవి ఎక్కువ వైశాల్యం విస్తరించి, చల్లదనాన్ని ఇవ్వగలుగుతాయి. గదిలో నేలను నీటితో కడగడం వల్ల ఆ నీరు మెల్లగా ఆవిరవుతూ గదిలో ఉష్ణోగ్రత తగ్గుతుంది. రెండు పూటలా ఇలా చేయడం వల్ల చల్లగా ఉంటుంది.

శరీరాన్ని చల్లగా ఉంచుకోండి : మనం ఇంటిని చల్లగా ఉంచుకునేందుకు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. మన శరీరం వేడిగా ఉంటే ప్రయోజనం ఉండదు. అటు ఇంటిని చల్లగా ఉంచుకునే పని చేస్తూనే.. శరీరాన్ని చల్లబరిచేందుకు చల్లటి నీళ్లు, నిమ్మరసం, జ్యూస్‌ల వంటివి తాగడం మంచిది. దీంతోపాటు రుమాలు వంటి దానికి చల్లటి నీటిలో తడిపి.. శరీరంలో రక్త ప్రసరణ చాలా ఎక్కువగా ఉండే మణికట్టు, మెడ వంటి ప్రాంతాల్లో పెట్టుకోవడం ద్వారా శరీరం చల్లబడుతుంది.

కాటన్ వస్త్రాలు ధరించాలి: ఎండాకాలంలో లేత రంగు కాటన్ వస్త్రాలు ధరించడం మేలు. అంతేగాకుండా వస్త్రాలు కొంచెం వదులుగా కూడా ఉండేలా చూసుకోవాలి. కాటన్ వస్త్రాల వల్ల గాలి బాగా ఆడి, చెమట ఆరిపోతుంది. తద్వారా శరీరం చల్లగా ఉంటుంది.

నీటిని ఎక్కువగా తాగాలి: ఎండాకాలంలో చెమట ఎక్కువగా పట్టడం వల్ల శరీరంలోని నీటి శాతం తగ్గిపోతుంది. ఇది ప్రమాదకర పర్యవసానాలకు దారితీస్తుంది. అందువల్ల నీరు ఎక్కువగా తాగాలి. తగినంత నీరు శరీరానికి అందితే.. చెమట కూడా ఎక్కువగా పట్టి శరీరం చల్లగా ఉంటుంది.

రాత్రి పడుకునేందుకు కూడా బెడ్ పై కాటన్ దుప్పట్లను, తలగడలకు కాటన్ తొడుగులకు వేయడం వల్ల చల్లటి అనుభూతి ఉంటుంది.

తలస్నానంతో చల్లదనం: బాగా వేడిగా అనిపించినప్పుడుగానీ, రాత్రి నిద్రపోయే ముందుగానీ తలస్నానం చేయడం బెటర్. దీనివల్ల శరీరంలోని వేడి తగ్గిపోయి.. ఒకటి రెండు గంటల వరకు హాయిగా ఉంటుంది. నిద్రపోయే ముందు స్నానం చేయడం వల్ల శరీరం చల్లబడడంతోపాటు నిద్ర కూడా బాగా పడుతుంది.

లింగవివక్షకు తావులేని దేశాలివి..!

మన దేశంలో లింగవివక్ష, గృహహింస, భ్రూణ హత్యలు... ఇలాంటి ఎన్నో సమస్యలు మహిళల్ని ఇంకా వేధిస్తూనే ఉన్నాయి. వారి ఎదుగుదలకు ప్రతిబంధకాలౌతున్నాయి. ప్రపంచంలో కొన్ని దేశాలు మాత్రం మహిళల్ని నెత్తిన పెట్టుకుంటున్నాయి. పురుషులతో పాటు సమానంగా చూస్తున్నాయి. అందుకు కొన్ని చట్టాలు కూడా వారికి అందుబాటులో ఉన్నాయి.



ఐస్‌ల్యాండ్: మహిళల్ని గౌరవించడంలో మొదటిస్థానం ఐస్‌ల్యాండ్‌దే. ఇంటర్‌నెట్‌లో ప్రోనోగ్రఫీని పూర్తిగా నిరోధించడంలో ఈ దేశం విజయం సాధించింది. చలనచిత్రాల విషయంలోనూ సెన్సార్ బోర్డు కచ్చితంగా పనిచేస్తుంది. మహిళల్ని అసభ్యంగా చిత్రీకరించే ఎలాంటి వీడియోకీ వెండితెరమీద తావుండదిక్కడ. పార్లమెంట్‌లోని సగం సీట్లు మహిళలకే కేటాయిస్తారు.

ఫిన్‌ల్యాండ్: ఈ దేశంలో సమానత్వ హక్కు చట్టం అమలులో ఉంది. ప్రతి విషయంలోనూ పురుషులతో సమానంగా మహిళలకీ హక్కులుంటాయి. దంపతులు ఉద్యోగస్తులైతే..పిల్లల సంరక్షణ కోసం మగవారికీ సెలవులు ఉంటాయి. కేవలం ఆడవారికే ఆ బాధ్యతను వదిలేయడం లేదు. అదేవిధంగా కళాశాల, కార్యాలయాల్లోనూ సమాన హక్కులు లభిస్తున్నాయి. వాటి కోసం పోరాడేందుకు నిత్యం అవగాహన కూడా కల్పిస్తుందీ ప్రభుత్వం.

స్వీడన్: అత్యధికంగా మాతృత్వ సెలవులు ఇస్తున్న దేశమిది. ప్రసవానంతరం 69 వారాలపాటు వేతనంతో కూడిన సెలవులు ఇస్తారిక్కడ. పైగా ప్రభుత్వరంగంలో పనిచేసేవారైతే వారి భర్తకీ ఆ సెలవులు పంపొచ్చు. అందుకే అక్కడ ఉద్యోగం చేసే మహిళల సంఖ్య 77శాతంగా ఉంది.

యూకే: మహిళల్ని బాధించే సమస్యల్లో ప్రసవ మరణాలు ఒకటి. యూకేలో ఈ శాతం స్వల్పంగా ఉంటుంది. ఎందుకంటే మహిళల ఆరోగ్యంపై ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండేలా ప్రభుత్వాధికారులు జాగ్రత్తలు తీసుకుంటారు.

ఆస్ట్రేలియా: ఈ దేశంలో అన్ని రంగాల్లోనూ మహిళలు అగ్రస్థానంలో కనిపిస్తారు. లింగవివక్ష అనే పదానికి తావు లేకపోవడమే కారణం.

రిజర్వేషన్లపై కేంద్రం లేఖలకు సమాధానం లేదా?



మన తెలంగాణ/ హైదరాబాద్ : పార్లమెంట్ లో రిజర్వేషన్లపై టిఆర్ఎస్ డ్రామాలాడుతోందని శాసన మండలి ప్రతిపక్ష నాయకులు మహ్మద్ అలీ షబ్బీర్ ఆరోపించారు. గాంధీభవన్‌లో కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్, దాసోజు శ్రవణ్, ప్యాట రమేశ్‌తో కలిసి గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లిం మైనారిటీ, ఎస్‌టి రిజర్వేషన్ లపై టిఆర్ఎస్, సిఎం కెసిఆర్ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. రిజర్వేషన్ లపై అసెంబ్లీలో చేసి పంపిన తీర్మానంపై కేంద్రం స్పందించి లేఖ రాసినా పట్టించుకోలేదని చెప్పారు. ఈ రిజర్వేషన్ లు ఎందుకు కోరుకుంటున్నారో ,కారణాలు చెప్పాలని కేంద్రం నుండి మూడు లేఖలు వచ్చాయంటూ, వాటి ప్రతులను మీడియా సమావేశంలో చూపించారు. ముస్లిం ,ఎస్‌టిలకు వారి జనాభా కంటే ఎక్కువ రిజర్వేషన్ ను ఎందుకు అడుగుతున్నారో చెప్పాలని కేంద్ర హోమ్ శాఖకు చెందిన విభాగం అడిగింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రిజర్వేషన్ లపై పార్లమెంట్ లో గొడవ చేస్తున్న టిఆర్ఎస్ ఎందుకు కేంద్రం లేఖల్లో అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేదన్నారు. ఒన్ నేషన్ ఒన్ రిజర్వేషన్ అంటున్న టిఆర్ఎస్ అదెలా సాధ్యమో చెప్పాలన్నారు. లంబాడాలు మన రాష్ట్రంలో ఎస్‌టిలని, మహారాష్ట్రలో బిసిలు, కర్నాటకలో ఎస్‌సిలని చెప్పారు.

సంచార జాతులపై జాతీయ సెమినార్

మన తెలంగాణ/ హైదరాబాద్: సంచార జాతులు, విముక్త జాతులు, పాక్షిక సంచార జాతులపై మార్చి 28, 29 తేదీల్లో రెండు రోజుల పాటు జాతీయ సెమినార్ జరగనుంది. సిద్దిపేట ప్రభుత్వ కళాశాలలో జరిగే ఈ జాతీయ సెమినార్‌కు ఆ కళాశాల ప్రిన్సిపల్ ఆధ్వర్యం వహించనున్నట్లు తెలంగాణ బిసి కమిషన్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొనింది. పై జాతులు తెలంగాణ రాష్ట్రంలో బిసి ఎ గ్రూపులో ఉన్నారు. దేశం నలుమూలల నుండి ప్రొఫెసర్లు, పరిశోధకులు సెమినార్ పత్రాలు సమర్పించనున్నట్లు వెల్లడించారు. పై సామాజికవర్గాల విద్యావంతులు, ఉద్యమకారులు, పరిశోధకులు దేశంలోని, తెలంగాణలోని విముక్త జాతులు, పాక్షిక సంచార, సంచార జాతుల జీవితం, సంస్కృతి గురించి తెలుసుకోవడానికి, పరిశోధనలను సమాజానికి అందించడానికి ఇది గొప్ప అవకాశమని బిసి కమిషన్ కార్యాలయం పేర్కొంది. ఈ సదస్సులో బిసి కమిషన్ చైర్మన్ బిఎస్ రాములు, సభ్యులు వి.కృష్ణమోహన్ రావు, జూలూరి గౌరీశంకర్ , ఆంజనేయ గౌడ్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారు.

యువతకు ఉద్యోగ కల్పనేది?

మన తెలంగాణ/హైదరాబాద్: రాజకీయ నేతలకు సిఎం కె.చంద్రశేఖర్ రావు ఉద్యోగాలు ఇస్తున్నారని, యువతకు మాత్రం ఇవ్వడం లేదని టిడిపి ఎంఎల్ఎ ఆర్.కృష్ణయ్య వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బుధవారం మీడియాతో మాట్లాడుతూ దాదాపు 1500 గ్రూప్–1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, నాలుగేళ్ళయినా అయినా ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రూప్ 3 పోస్టులు ఎనిమిది వేలు, గ్రూప్ 4 పోస్టులు 12 వేల చొప్పున ఖాళీలు ఉన్నాయని, ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు కావాలంటే ఉద్యోగాలు భర్తీ చేయడం సహేతుకం అని వ్యాఖ్యానించారు. కేంద్రంలో భారీ స్థాయిలో ఖా ళీలు ఉన్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోడికి విజ్ఞప్తి చేసిన వెంటనే రైల్వే శాఖలో పెద్ద యెత్తున నోటిఫికేషన్లు జారీ చేశారని కృష్ణయ్య గుర్తుచేశారు.

విపక్షాలను అసహ్యించుకుంటున్నారు

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రతిపక్షాల వ్యవహారశైలిని చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని టిఆర్ఎస్ ఎంఎల్ఎ ముత్తిరెడ్డి యాదిరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బుధవారం ముత్తిరెడ్డి మాట్లాడుతూ రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను ఇప్పటికే అమలుచేస్తున్నామని, వచ్చే నెల నుంచి ఎకరాకు రూ.4 వేలు పెట్టుబడి కూడా ఇవ్వనున్నామన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు మూడెకరాల భూపంపిణీ కొనసాగుతుందన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ఫలాలు ప్రజలకు అందుతుంటే ప్రతిపక్షాలకు ఏ ఒక్క పథకమూ కనపించకపోవడం దురదృష్టకరమన్నారు.

సమాన పనికి సమాన వేతనాలు



మన తెలంగాణ/హైదరాబాద్: సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనాలను చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి కార్యాలయం వద్ద ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి.యూసుఫ్,ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్‌రావు,కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బి.చంద్రయ్య, ఎఐటియుసి నగర కార్యదర్శి ఎం.నర్సింహ్మా, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.ప్రేంపావని హాజరయ్యారు. ఎం.డి యూసుఫ్ మాట్లాడుతూ చట్టాలను, జివోలను కూడా ప్రభుత్వ ఆస్పత్రులలో ఆమలుకావడం లేదన్నారు. ఉజ్జిని రత్నాకర్‌రావు మాట్లాడుతూ చట్టప్రకారం కాంట్రాక్ట్ కార్మికులకు ఇయస్ఐని అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగ, కార్మికులందరినీ తక్షణమే పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బి. చంద్రయ్య మాట్లాడుతూ ఉద్యోగులకు, కార్మికులకు ఇయస్ఐ, పిఎఫ్‌లను సక్రమంగా అమలు చేయాలని, కిందిస్థాయి గ్రేడ్‌కు కనీసం రూ.18 వేల వేతనాన్ని చెల్లిం చాలని, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఎఐటియుసి నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, భువనగిరి జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.డి.ఇమ్రాన్, యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి యం.లక్ష్మీబాయ్, కార్యదర్శి హసీనా బేగం, కిష్టమ్మ, శ్రీనివాస్, రాధమ్మ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రథయాత్రకు అనుమతిపై నేడు తీర్పు

మన తెలంగాణ/ హైదరాబాద్: తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ నుంచి హనుమాన్ జయంతి వరకు వీహెచ్‌పీ (విశ్వహిందూపరిషత్) నిర్వహించబోయే రథయాత్రకు తెలంగాణ రాష్ట్ర పోలీసులు అనుమతి ఇవ్వకపోవడాన్ని సవాల్ చేసిన కేసులో హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఇరు పక్షాల వాదనల అనంతరం తీర్పును గురువారం (22వ తేదీన) వెలువరిస్తామని న్యాయమూర్తి ఎం.సీతారామమూర్తి ప్రకటించారు. 18న ఉగాదిని పురస్కరించుకుని 31న హనుమాన్ జయంతి వరకూ తాము చేపట్టబోయే రథయాత్ర బాసర నుంచి హైదరాబాద్ తాడ్‌బడ్ హనుమాన్ ఆలయం వరకూ నిర్వహించేందుకు ఎలాంటి షరతులు విధించినా తమకు అభ్యంతరం లేదని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) తెలంగాణ కార్యదర్శి ఎం.గాల్‌రెడ్డి తరపు న్యాయవాది వాదించారు. పోలీసులు కావాలనే అనుమతి ఇవ్వడం లేదని, శాంతియుతంగా యాత్ర నిర్వహిస్తామని, అందుకు ఏమైనా షరుతులు విధించినా తమకు అభ్యంతరం లేదని వాదించారు.

జయ బాత్‌రూమ్‌లోనే స్పృహకోల్పోయారు : శశికళ

చెన్నై: బెంగళూరు విచారణ కోర్టు 2014 సెప్టెంబర్‌లో తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జె.జయలలితను దోషిగా నిర్ధారించినప్పటి నుంచి ఆమె ఆరోగ్యం క్షీణించింది. 2014 నవంబర్ నుంచి 2016 సెప్టెంబర్ వరకు 20 మంది వేర్వేరు డాక్టర్ల ద్వారా ఆమె చికిత్స తీసుకున్నారని ఆమె సన్నిహితురాలు వి.కె.శశికళ గత వారం జస్టిస్ ఆరుముగసామి కమిషన్‌కు దాఖలు చేసిన తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. శశికళ అఫిడవిట్ దాఖలు చేసిన విషయాన్ని ఆమె న్యాయవాది రాజా సెంథూర్ పాండ్యన్ ధ్రువీకరించారు. 2016 సెప్టెంబర్ 22న రాత్రి 9 గంటలకు జయలలిత బాత్‌రూమ్‌లో స్పృహకోల్పోయారని శశికళ తన అఫిడవిట్‌లో తెలిపారు. ఆమెను లేపి బెడ్‌పైకి శశికళ తీసుకెళ్లినట్లు, తర్వాత ఆమెను అపోలో ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. మరునాడు జయలలిత కాస్త కోలుకుని మాట్లాడారని కూడా అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఆసుపత్రిలో జయలలితను చూసిన మంత్రులు, పార్టీ నాయకుల పేర్లను కూడా శశికళ తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తాత్కాలిక గవర్నర్ సి.విద్యాసాగర్ రావు రెండు సార్లు జయలలితను ఆసుపత్రిలో చూశారని తెలిపారు. అద్దాల వెనుక నిలబడిన ఆయనకు జయలలిత చేతులూపి మరి విష్ చేసిందని చెప్పారు. 2016 సెప్టెంబర్ 28 నాటికి జయలలిత పరిస్థితి మరింత దిగజారింది. దాంతో మరునాడు అధికారులతో ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించినట్లు శశికళ పేర్కొన్నారు.

జూనియర్ కాలేజీలుగా 27 గురుకుల స్కూళ్లు



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలోని 27 గురుకుల పాఠశాలలను జూనియర్ కాలేజీల స్థాయికి పెంచుతూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 27 గురుకుల పాఠశాలల్లో 2018–19 విద్యాసంవత్సరం నుంచి ఎంపిసి, బైపిసి కోర్సుల్లో 40 సీట్ల చొప్పున విద్యార్థులకు అవకాశం లభించనుంది. స్థాయి పెంచిన గురుకులాల్లో 14 బాలికలు, 13 బాలుర పాఠశాలలు ఉన్నాయి. రానున్న విద్యా సంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు జరగనున్నాయి. వచ్చే సంవత్సరం నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయి. బాలుర గురుకులాల్లో బెల్లంపల్లి (మంచిర్యాల), పెద్దాపురం (జగిత్యాల), మేడారం (పెద్దపల్లి), వేలేర్ (వరంగల్ అర్బన్), బండారుపల్లి (జయశంకర్ భూపాలపల్లి), ఎంకూరు (ఖమ్మం), తుంగతుర్తి (సూర్యాపేట్), పోచంపాడ్ (నిజామాబాద్), మద్నూర్ (కామారెడ్డి), బీచుపల్లి (జోగులాంబ), తూప్రాన్ (మెదక్), లింగంపల్లి (సంగారెడ్డి), బోరబండ (హైదరాబాద్), బాలికల గురుకులాల్లో నిర్మల్ (నిర్మల్), తాటిపల్లి (జగిత్యాల), నేరెళ్ళ (సిరిసిల్ల రాజన్న), వంగర (వరంగల్ అర్బన్), నెక్కొండ (వరంగల్ రూరల్), కొండ కొండ్ల (జనగామ), బుర్గంపాడ్ (భద్రాద్రి), చౌటుప్పల్ (యాదాద్రి), పోచంపాడ్ (నిజామాబాద్), బోధన్ (నిజామాబాద్), మెదక్ (మెదక్), డిగ్వల్ (సంగారెడ్డి), బోరబండ (హైదరాబాద్), తాండూరు (వికారాబాద్) పాఠశాలలు ఉన్నాయి. పై పాఠశాలల స్థాయి పెంపు వల్ల కొత్తగా 405 పోస్టులు మంజూరు కానున్నాయి. ఇందుకోసం మరో జివోను విడుదల చేయనున్నారు.

ఆధార్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

సుప్రీంకోర్టును కోరిన కేంద్రం

న్యూఢిల్లీ: 'మీరు పౌరులను గుర్తించేందుకే అయితే ఆధార్ పథకం కింద వ్యక్తిగత సమాచారాన్ని కేంద్రీకరించడం, ఏకమొత్తంగా చేయడం దేనికి?' అంటూ కేంద్రాన్ని సుప్రీంకోర్టు బుధవారం ప్రశ్నించింది. సింగపూర్‌లో ప్రతి ఒక్కరికీ చిప్ ఆధారిత ఐడి కార్డు ఉంటుందని, అయితే అది ఆ వ్యక్తి వద్దే ఉంటుంది తప్ప ప్రభుత్వ అధికారుల వద్ద కాదని ధర్మాసనం ఉదాహరించింది. ఆధార్‌పై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్(పిపిటి) ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాలని కేంద్రం, ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనాన్ని కోరింది. భారత విశిష్ట సంఖ్య ప్రాధికార సంస్థ(యుఐడిఎఐ) సిఇఒను ఆధార్ పథకంపై ప్రెజెంటేషన్ ఇవ్వడానికి అనుమతించాలని అడిగింది. దీనికి సుప్రీం కోర్టు అంగీకరించింది. అయితే ఈ విషయంలో రాజ్యాంగ ధర్మాసనంలోని ఐదుగురు న్యాయమూర్తులతో చర్చించిన తర్వాతే ప్రెజెంటేషన్‌కు సమయం నిర్ణయిస్తామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర వెల్లడించారు. ఆధార్ చట్టబద్ధత, సమాచార గోప్యత, నిఘా తదితర అంశాలకు సంబంధించి పలు పిటిషన్లపై విచారణ జరుపుతున్న సుప్రీంకోర్టు... ప్రభుత్వాన్ని ఆధార్‌కు సంబంధించిన వివరాలు తెలియజేయాలని అడగ్గా, కేంద్రం పవర్ ప్రెజెంటేషన్ ద్వారా తెలియజేస్తామని, అలా అయితే సాంకేతిక అంశాలు చక్కగా అర్థమవుతాయని కోర్టుకు తెలిపింది. యుఐడిఎఐ సిఇఒ అజయ్ భూషణ్ పాండేను ప్రెజెంటేషన్ ఇచ్చేందుకు అనుమతించాలని కేంద్రం తరఫున వాదించిన అటార్నీ జనరల్ కె.కె. వేణుగోపాల్ కోరారు. అలా అయితే ఆధార్‌కు సంబంధించిన సాంకేతిక అంశాలను మరింత స్పష్టంగా వివరించేందుకు వీలుంటుందని చెప్పారు. పాండే కంప్యూటర్ సైన్స్‌లో పిహెచ్‌డి చేశారు. ఆధార్ విషయంలో కోర్టుకు, పిటిషనర్లకు ఉన్న సందేహాలు ఆయన తీర్చుతారన్నారు. బ్యాంకు ఖాతాలు, మొబైల్ నంబర్లు ఆధార్‌తో అనుసంధానం చేసే గడవును ఇటీవల సుప్రీంకోర్టు నిరవధికంగా పొడిగించిన విషయం తెలిసిందే. ఈ విషయంపై కోర్టు తుది తీర్పు చెప్పే వరకు ఆధార్‌తో అనుసంధానానికి ఇబ్బందులు లేవని వెల్లడించింది.

ద్రవిడుల చరిత్ర 4500 ఏళ్ల పురాతనం

- ప్రధాన భాషలు కన్నడ, మలయాళం, తమిళం, తెలుగు
- ద్రవిడ భాషలు 80 రకాలు



బెర్లిన్: ద్రవిడ జాతీయులు 80 రకాల భాషలు మాట్లాడతారని, వారు దక్షిణ, మధ్య భారతంలో దాదాపు 22 కోట్ల మంది ఉంటారని, వారిది 4500 ఏళ్ల పురాతన చరిత్ర అని ఓ అధ్యయనంలో వెల్లడయింది. జర్మనీలోని మానవ జాతి చరిత్రకు సంబంధించిన మాక్స్ ప్లాంక్ సంస్థ , డెహ్రాడూన్‌లోని వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియాకు చెందిన పరిశోధకులు ఈ అధ్యయనాన్ని చేశారు. అధ్యయనంలో కనుగొన్న విషయాలను 'రాయల్ సొసైటీ ఓపెన్ సైన్స్' జర్నల్‌లో ప్రచురించారు. పశ్చిమాన అఫ్ఘానిస్థాన్, తూర్పున బంగ్లాదేశ్ నుంచి దక్షిణాసియా వరకున్న ప్రాంతంలో ద్రవిడ, ఇండోయూరోపియన్, సైనోటిబెటన్ సహా ఆరు పెద్ద భాషాజాతులవారు నివసిస్తుంటారు. ద్రవిడుల ప్రధాన భాషల్లో కన్నడ, మలయాళం, తమిళ్, తెలుగు ఉన్నాయి.
ఇవి దశాబ్దాలుగా తమవైన సాహిత్య సాంప్రదాయాలు కలిగి ఉన్నాయి. అయితే తమిళ భాష చాలా వికసించిందని, సంస్కృతంతోపాటు తమిళం ప్రాచీన భాష అని పరిశోధకులు తెలిపారు. అయితే సంస్కృతంలా కాక తమిళం ఆధునిక రూపంలో కూడా శాసనాలు, కవితలు, ఆధ్యాత్మిక గ్రంథాలు, పాటలను కలిగి ఉందన్నారు. నేటికన్నా గతంలోనే ద్రవిడ భాషలు పాశ్చాత్య దేశాల్లో బాగా విస్తరించి ఉంటాయని అభిప్రాయపడ్డారు. ద్రవిడుల చరిత్ర, సబ్‌గ్రూపింగ్ తెలుసుకునేందుకు పరిశోధకులు అడ్వాన్స్‌డ్ స్టాటిస్టికల్ పద్ధతులను ఉపయోగించారు.

ప్రవేశ పరీక్ష ఫీజుల్లో రాయితీ ఏదీ?

మనతెలంగాణ/హైదరాబాద్ : జెఇఇ మెయిన్, అడ్వాన్స్‌డ్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల ఫీజుల్లో బాలికలకు, వికలాంగులకు రాయితీ ఇస్తున్నట్లుగానే రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ ఉమ్మడి ప్రవేశ పరీక్షలకు కూడా ఫీజులో రాయితీ ఇవ్వాలన్న డిమాండ్ ముందుకొస్తోంది. ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబిఎ, ఎంసిఎ, ఉపాధ్యాయ విద్య, న్యాయ విద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో జనరల్ కేటగిరీ అభ్యర్థుల్లో బాల బాలికలకు, వికలాంగులకు ఒకే రకమైన ఫీజు విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని, ఐఐటి, ఎన్ఐటి వంటి ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి ఇంజనీరింగ్ విద్యా సంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే జెఇఇ మెయిన్, అడ్వాన్స్‌డ్ పరీక్షలకే బాలికలకు, వికలాంగులకు 50 శాతం ఫీజు రాయితీ లభిస్తోందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గుర్తుచేస్తున్నారు.

జెఇఇలో 50 శాతం రాయితీ :
ప్రస్తుతం జెఇఇ మెయిన్ ప్రవేశ పరీక్షకు రెండు పేపర్లకు కలిపి రూ. 1,800 ఫీజు ఉండగా, ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగులకు, బాలికలకు మాత్రం కేవలం రూ.500 ఫీజును మాత్రమే నిర్ణయించింది. జెఇఇ అడ్వాన్స్‌డ్‌కు జనరల్ అభ్యర్థులకు రూ. 2,600 ఫీజు ఉండగా, ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగులకు, బాలికలకు రూ.1,300గా ఫీజు అమలవుతోంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ప్రవేశ పరీక్షల ఫీజులో వికలాంగులకు, బాలికలకు ఎలాంటి ఫీజు రాయితీ లేకపోవడంతో ఎంసెట్ పరీక్షకు జనరల్ అభ్యర్థులకు రూ.800, ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.400గా నిర్ణయించింది. ఐసెట్‌కు రూ.650 ఫీజు ఉండగా, ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.450గా ఉంది. బాలికా విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి పలు సందర్భాల్లో వ్యాఖ్యానించినందున వికలాంగులతో కలిపి ప్రవేశ పరీక్షల ఫీజుల్లో రాయితీ కల్పించాలని విజ్ఞప్తులు వస్తున్నాయి.

సిర్పూర్‌కు గ్రీన్‌సిగ్నల్

(మొదటిపేజీ తరువాయి)

తీసుకునేందుకు జెకె పేపర్ మిల్లు యాజమాన్యం అంగీకారం తెలిపింది. కాగా జెకె పేపర్ మిల్లు యాజమాన్యంతో కేబినెట్ మంత్రులకు మధ్య ఇప్పటికి పలు సార్లు చర్చలు జరగగా జెకె పేపర్ మిల్లు విధించిన పలు షరతులను తెలంగాణ ప్రభుత్వం అంగీకరించింది. మెగా ప్రాజెక్టుల కింద ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందించాలని కోరగా ప్రభుత్వం అన్ని విధాల రాయితీలు కల్పిస్తుందంటూ పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్‌రంజన్ అందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈనెల 14న జెకె మిల్లు యాజమాన్య ప్రతినిధులకు క్యాబినెట్ మంత్రులకు మరోసారి చర్చలు జరగగా పూర్తి స్థాయిలో అంగీకారం తెలిపారు. జెకె పేపర్స్ మిల్స్ యాజమాన్యానికి పెట్టుబడిలో 20 శాతం సబ్సిడీ అనగా రూ.50 కోట్లు చెల్లించేందుకు నీలగిరి, సుబాబుల్ చెట్లను 10 సంవత్సరాల పాటు ప్రభుత్వ అటవీశాఖ సరఫరా చేయాలని, సింగరేణి యాజమాన్యం నిర్వహించే బొగ్గు యాక్షన్‌లలో ప్రాధాన్యతను ఇవ్వాలని,100 శాతం స్టాంపు డ్యూటీ తగ్గించాలని, 100 శాతం ఎస్‌జి ఎస్‌టి పదేళ్ల పాటు రియంబర్స్‌మెంట్ ఇవ్వాలని, ముడి సరుకులు కాపర్, మ్యాప్‌లితో ప్రభుత్వమే సమకూర్చాలని, విద్యుత్ శాఖ మూడు సంవత్సరాల పాటు యూనిట్‌కు రూ.3 తీసుకోవాలని, లిక్విడేషన్ అనంతరం కార్మికులకు, ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను ప్రభుత్వమే చెల్లించాలని, బ్యాంకుల బకాయిలను ప్రభుత్వమే చూసుకోవాలని, అదే విధంగా సిర్పూర్ పేపర్ మిల్లు రెండు నెలల్లో తెరవడానికి అన్ని రకాల లైసెన్సులు, అనుమతులు ప్రభుత్వమే చూసుకోవాలని జెకె పేపర్‌మిల్స్ యాజమాన్యం పేర్కొనగా తెలంగాణ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. కాగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొట్టమొదటి సారిగా మూతపడిన సిర్పూర్ పేపర్ మిల్లును తెలిరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం కార్మికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

అప్పుపై అర్థంలేని విమర్శ

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 82 లక్షల కోట్ల మేరకు అప్పు చేసిందని, ఇందులో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేసిన అప్పు రూ. 24 లక్షల కోట్లు అని వివరించారు. బడ్జెట్‌లో మూడవ వంతు కేవలం అప్పుల చెల్లింపులకే వెచ్చించాల్సి వస్తోందని అన్నారు. ఇంత హెచ్చు మొత్తంలో చేసిన అప్పును 'వృథా' అని భావించగలమా అని ప్రశ్నించారు. మూడు దశాబ్దాల కింద మన దేశ స్థూల జాతీయ ఉత్పత్తి కంటే చైనా ఉత్పత్తి తక్కువని, కానీ ఈ 30 ఏళ్ళ కాలంలో చైనా చాలా ప్రగతి సాధించిందని, ఇప్పుడు దాని జిడిపిలో మన దేశ జిడిపి కేవలం నాల్గవ వంతు మాత్రమేనని సిఎం వివరించారు. ఏ రాష్ట్రంలో నిధులు ఉంటే ఆ రాష్ట్రంలో ప్రగతి ఆశాజనకంగా ఉంటుందని అన్నారు. నిజానికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలను చూసి నీతి ఆయోగ్ ప్రశంసించడమే కాకుండా ప్రోత్సహించే తీరులో, సాయం చేసే తీరులో మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలకు రూ. 24,205 కోట్లను సాయంగా ఇవ్వాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖకు సిఫారసు చేసిందని, కానీ ఇప్పటివరకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా రూ.24 ఇవ్వలేదని అన్నారు. తమ ప్రభుత్వం ఏనాడూ వ్యక్తిగత ప్రయోజనాల కోసం కేంద్రం దగ్గరకు వెళ్ళలేదని, కేవలం రాష్ట్ర అవసరాల కోసమే ప్రయత్నాలు చేశామని తెలిపారు. నిధుల కోసం కేంద్రం చుట్టూ ఎన్నోసార్లు ప్రదక్షిణలు చేశామని, నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని ఉత్సాహపరిచే మాటలు విని సంతోషపడ్డామని, దేశం బాగుపడుతుందని తాను చాలా పొంగిపోయానని, కానీ ఆచరణ ఆ దిశగా లేకపోవడం బాధ కలిగించిందన్నారు. కేంద్రం నుంచి ఆశించిన సాయం అందనప్పుడు అప్పు చేయడంలో తప్పేముందని కెసిఆర్ ప్రశ్నించారు. అప్పులు చేయడాన్ని మాత్రమే ప్రస్తావిస్తూ అభివృద్ధిని చూడడానికి నిరాకరిస్తూ ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళ్ళే విధంగా ప్రతిపక్ష సభ్యులు వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని స్పష్టం చేశారు. దేశంలో 70 వేల టిఎంసిల నీరు ఉందని, ప్రతీ ఎకరానికి సాగునీరు అందించే వీలు ఉందని, అంతటి పుష్కలమైన నీరు ఉన్నా అనేక రాష్ట్రాలు నీటి వాటా కోసం కొట్లాడుకోవాల్సి వస్తోందన్నారు. సాగునీటి కోసం 70 ఏళ్ళుగా కొట్లాటలు జరుగుతూనే ఉన్నాయని, కోర్టుల్లో ట్రిబ్యునళ్ళలో ఏళ్ళ తరబడి విచారణలు జరుగుతూనే ఉన్నాయని, ఇప్పటికీ సరైన విధానం మాత్రం రాలేదన్నారు. దేశం మొత్తం మీద 40 కోట్ల ఎకరాలకు సరిపోయేంత నీరు ఉన్నా వినియోగంలోకి రాకపోవడంతో వ్యవసాయ రంగం ఇబ్బందులు పడుతోందని ఆయన గుర్తుచేశారు.

వ్యూహాత్మక రహదారులు

(మొదటిపేజీ తరువాయి)

ఏడాది మరి కొన్నింటిని ప్రారంభిస్తామని చెప్పారు. నగరంలో 1202 బస్‌షెల్టర్లను నిర్మిస్తున్నామని తెలిపారు. వీటిని నాలుగు గ్రేడులుగా విభజించి ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రేడ్ –1 బస్‌షెల్టర్‌లో ఏసి, డస్ట్ బిన్లు, టాయ్‌లెట్లు, చార్జింగ్ సౌకర్యాలు, ఏటిఎం, కాఫీ సెంటర్, సిసిటివి వంటి ఆధునిక సౌకర్యాలు ఉంటాయన్నారు. 'మెర్సర్' అనే స్వచ్ఛంద సంస్థ ప్రతి ఏటా దేశంలోని బెస్ట్ లివింగ్ సిటీలను ఎంపిక చేస్తుందన్నారు. మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉన్నవాటిని ఎంపిక చేస్తుందని, గడిచిన మూడేళ్లుగా ప్రతీసారి దేశంలో నెంబర్ వన్ సిటీగా హైదరాబాద్ ఎంపిక కాగా తాజాగా నాలుగో ఏడాది హైదరాబాదే ఎంపికైందన్నారు.

డిజిపి పేరు చెప్పి భూటోపీ!

(మొదటిపేజీ తరువాయి)

చిత్తమయ్య, ఆగమయ్య, రామయ్య, లక్ష్మమ్మ, పారిజాత తదితరులు తెలిపిన వివరాల ప్రకారం. యాద్గార్‌పల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 210, 209, 213, 214, 243, 244లో 15.20 ఎకరాల పట్టా భూమి ఉందని అట్టి భూమిలో తమ తాతల కాలం నుంచి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని రైతులు తెలిపారు. కాగా గత 19వ తేదీన సచివాలయ ఉద్యోగిగా చెప్పుకుంటున్న నల్లగొండకు చెందిన శ్రీనివాస్‌రెడ్డితో పాటు వెంకట్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, సుధీర్‌లు భారతమ్మ నుంచి తాము ఆరు ఎకరాల భూమి కొనుగోలు చేశామంటూ తమ పట్టాభూమిని కబ్జాచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పచ్చటి పొలాలను మట్టితో చదును చేశారని అడ్డుకునే ప్రయత్నం చేసిన తమపై దౌర్జన్యానికి దిగారని వాపోయారు. తాము డిజిపి డీజీపీ అనుచరులమని ఎవరితో చెప్పుకుంటారో చెప్పుకొండంటూ బెరింపులకు పాల్పడుతున్నారని, మహిళలని కూడా చూడాకుండా దుర్భషలాడుతున్నారని అన్నారు. తమపై అక్రమంగా కేసులు పెట్టిన పోలీసులు గత కొన్ని రోజులుగా నరకం చూపుతున్నారని కన్నీరు పెట్టుకున్నారు. తమ పట్టా భూములు ఉన్న సర్వే నంబర్లలో భారతమ్మ అనే మహిళకు ఎలాంటి భూములు లేవని, తప్పుడు సర్వే నంబర్లతో తమ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెప్పారు. భూములను నమ్ముకొని జీవనం సాగిస్తున్న తాము కబ్జాదారులతో తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ యంవి రెడ్డిని కలిసిన రైతులు వినతి పత్రం అందజేసి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై కీసర సీఐ సురేందర్ గౌడ్ వివరణ కోరగా పోలీసులపై ఆరోపణలను ఖండించారు. భారతమ్మ అనే మహిళ ఫిర్యాదు మేరకు కాటేపల్లి బాల్‌రెడ్డి తదితరులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామని తెలిపారు. భూముల కబ్జా విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

ఒక్క బొట్టూ వదలం

(మొదటిపేజీ తరువాయి)

వరకు 270 కి.మీ మేరకు గోదావరి నది ఏడాది పొడవునా సజీవంగా పారుతుందని, ప్రభుత్వం రీ ఇంజనీరింగ్ చేయడం వల్లనే కాళేశ్వరం ప్రాజెక్టుకు సత్వరమే అనుమతులు లభించాయన్నారు. 2007–14 వరకు కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రాణహిత–చేవెళ్లకు ఎలాంటి అనుమతులు సాధించలేక పోయిందని హరీశ్‌రావు విమర్శించారు. భవిష్యత్తులో దేశానికి అన్నం పెట్టే భాండాగారంగా తెలంగాణ మారబోతున్నట్లు చెప్పారు. ప్రాజెక్టులను కట్టడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిందన్నారు. రైతుల ఆత్మహత్యలను నివారించాలని, ప్రతి నియోజకవర్గానికి సాగునీరు ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామన్నారు. ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధికోసం అనవసర ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 37 లక్షల 9 వేల ఎకరాలకు సాగునీరు, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు అందించనున్నట్లు తెలిపారు. పంటల ఉత్పత్తిలో కృష్ణా, గోదావరి జిల్లాలు ఇకపైన ఆంధ్రప్రదేశ్‌లోని కోనసీమను తలపిస్తాయని అన్నారు. వందేళ్ల తర్వాత కూడా సిఎం కెసిఆర్‌ను , టిఆర్ఎస్‌ను గుర్తుపెట్టుకునే విధంగా సాగునీటిరంగంలో పనులు సాగుతున్నట్లు హరీష్‌రావు తెలియజేశారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం గడచిన ఆరు నెలల్లో 2 కోట్లకు పైగా సిమెంట్ బస్తాలను వినియోగించామని, పనులు మూడు షిఫ్ట్‌లలో వేగంగా జరుగుతున్నాయని, ఇప్పటివరకు 60% మేరకు కాళేశ్వరం నిర్మాణ పనులు పూర్తయినట్లు వెల్లడించారు. స్వయంగా తాను రాత్రింబవళ్లు సైట్‌లో ఉండి పనులను తనిఖీ చేస్తున్నానని, సిఎం కెసిఆర్ ప్రగతిభవన్ నుండి ప్రతిరోజూ లైవ్ టెలికాస్ట్ ద్వారా కాళేశ్వరం పనులను పర్యవేక్షిస్తూ అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తున్నారన్నారు. కాంగ్రెస్ హయాంలో తెలంగాణకు సాగునీరందించాలనే లక్ష్యంతో కాకుండా మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరుతో కాంట్రాక్టర్ల జేబులు నింపారని, తాము అధికారంలోకి వచ్చాక ఈపిసి, మొబిలైజేషన్ అడ్వాన్స్‌ల విధానాన్ని రద్దు చేశామన్నారు.

కాళేశ్వరానికి జాతీయ హోదా కోసం బిజెపి సహకరించాలి

రాష్ట్ర విభజన నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చినట్లుగానే కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం తెలంగాణ బిజెపి నేతలు సహకరించాలని మంత్రి హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. రీ డిజైన్ చేసిన ప్రాజెక్టుల్లో ఖమ్మం జిల్లాకు చెందిన సీతారామ, భక్త రామదాసు ప్రాజెక్టులు ఉన్నాయన్నారు. 2001లో పనులు ప్రారంభించిన దేవాదుల పనులు 2014 నాటికి కూడా పూర్తి కాలేదన్నారు.

ఇన్ సర్వీస్ కోటా రద్దును వెంటనే ఉపసంహరించుకోవాలి

మన తెలంగాణ/హైదరాబాద్(గోషామహల్) : పీజీ సీట్ల భర్తీలో ఇన్ సర్వీస్ కోటాను రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టిజిడిఎ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఇన్ సర్వీస్ కోటాను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభు త్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా బుధవారం కోఠిలోని వైద్యభవన్‌లో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పల్లం ప్రవీణ్, సెక్రటరీ జనరల్ డాక్టర్ బి.రమేష్‌ల నేతృత్వంలో అత్యవసర కార్యవర్గ సమావేశం జరిగింగి. సంఘం ప్రతినిధులు ఇన్ సర్వీస్ కోటా రద్దుపై సుదీర్ఘంగా చర్చించిన అనంతరం కోఠిలోని డిఎంఇ కార్యాలయం ఎదుట కాళోజీ వర్సిటీ వీసీ కరుణాకర్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు కాళోజీ వీసీ డౌన్ డౌన్...వీసీ కరుణాకర్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలని నినాదాలు చేశారు. టిజిడిఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పల్లం ప్రవీణ్, సెక్రటరీ జనరల్ డాక్టర్ బి రమేష్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇన్ సర్వీస్ కోటాను ఎత్తివేస్తూ జారీ చేసిన 21, 22 జీవోలను వెంటనే ఉపసంహరించుకుని, ఇన్ సర్వీస్ కోటాను పునరుద్ధరించాలన్నారు.



కెసిఆర్ పాలనలో తెలంగాణ సస్యశ్యామలం : మందుల సామేలు

మన తెలంగాణ / శాలిగౌరారం : తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి కెసిఆర్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాతే రాష్ట్ర సస్యశ్యామలంగా మారిందని తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ మందుల సామేలు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కోటి ఎకరాలకు సాగు నీరందించడమే లక్ష్యంగా పని చేస్తూ వేలాది కోట్ల నిధులు వెచ్చించి ప్రాజెక్టులను పూర్తి చేస్తుందన్నారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ ఓ రైతుగా ఆలోచించి 24గంటల విద్యుత్‌ను సరఫరా చేస్తుండటంతో పాటు రైతు లక్ష్మి అనే పథకం కింద వ్యవసాయ పెట్టుబడుల కోసం ఏప్రిల్ 24నుంచి ఎకరాకు రూ.4వేల చొప్పున సంవత్సరానికి రూ.8వేలు అందించనుందన్నారు. పేదింటి ఆడబిడ్డల వివాహం కోసం ప్రవేశపెట్టిన షాధీముబారక్, కళ్యాణ లక్ష్మి పథకం కింద ఇస్తున్న రూ.75,116లను ఇటీవల రూ.1,00,116లకు పెంచి ఆడబిడ్డల వివాహానికి మరింత చేయూతనందిస్తున్నారని పేర్కొన్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కేసీఆర్ కిట్టు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి అనేక సంక్షేమ పథకాలకు దేశంలోని అన్ని రాష్ట్రాలకు తెలంగాణ రాష్ట్రం ఆదర్శప్రాయంగా నిలుస్తుందన్నారు. 2019లోనూ టిఆర్ఎస్‌దే విజయమని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉస్మానియా సిబ్బంది ఆందోళన

- కొత్త భవనం కోసం ఔట్ పేషంట్ వైద్యసేవలు నిలిపివేత
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో ఊపిరి పీల్చుకున్న రోగులు

మన తెలంగాణ/ హైదరాబాద్/గోషామహల్: పాత భవనం స్థానంలో కొత్త భవన నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఉస్మానియా ఆసుపత్రి వైద్య సిబ్బంది చేపడుతున్న ఆందోళన రోజురోజుకూ ఉధృతంగా మారుతోంది. ఉస్మానియా మెడికల్ జెఎసి ఆధ్వర్యంలో రెండు నెలలుగా ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వం స్పందించక పోవడంతో వైద్య సిబ్బంది తమ ఆందోళనలను ఉధృతం చేశారు. బుధవారం ఉదయం ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది కొద్దిసేపు ఓపీ వైద్యసేవలను నిలిపివేసి, ఓపీ బ్లాక్ భవనం గేటు బయట రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం కొత్త భవనం నిర్మాణం కోసం పనులు చేసేందుకు సిద్ధమే అని అర్థం వచ్చే విధం గా పలుగు, పార, గంపలు చేత పట్టుకున్నారు. పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పష్టమైన ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉస్మానియా మెడికల్ జెఎ సి ఛైర్మన్ డాక్టర్ ఆర్ పాండునాయక్ ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతూ ఉస్మానియా పాత భవనం శిథిలావస్తకు చేరినా పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం బాద్యతా రాహిత్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. నిజాం కాలంలో నిర్మించిన ఉస్మానియా ఆసుపత్రి పాత భవనం శిథిలావస్థకు చేరి ప్రమాద భరితంగా మారిందన్నారు. గతంలో టిఎస్ఎంఎస్ఐడిసి ఇంజనీర్లు భవనం పటిష్టతపై పరీక్షలు నిర్వహించి పాత భవనంలో వైద్యసేవలు నిర్వహించడం ప్రమాదమని హెచ్చరించడంతో పాటు ఆసుపత్రి మొదటి, రెండో అంతస్తుల్లో ఎరుపు రంగు పెయింట్‌తో యుజెడ్



(అన్ సేఫ్ జోన్) అని గోడలపై రాశారని ఆయన గుర్తు చేశారు. ఈ విషయం ప్రభుత్వానికి తెలిసినా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం చేయడమే ప్రజారోగ్యంపై ప్రభుత్వానికి గల చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. తరచుగా పైకప్పు నుంచి పెచ్చులు ఊడి పడుతుండటంతో పాత భవనంలో చికిత్సలు పొందుతున్న రోగులకు వైద్యసేవలు అందించాలంటే హడలిపోతున్నారని, గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రతినిత్యం భయాందోళనల మధ్య రోగులకు వైద్యసేవలు అందించాల్సిన దుస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యేలోపు కొత్త భవన నిర్మాణంపై ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని ప క్షంలో ఓపీ వైద్యసేవలతో పాటు సాధారణ, అత్యవసర వైద్యసేవలను పూర్తిగా స్థంభింపజేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా మెడికల్ జెఎ సి ప్రతినిధులు డాక్టర్ రాంసింగ్, డాక్టర్ శేఖర్, శ్యామ్‌సుందర్, గడ్డం భాస్కర్, బి రవిగౌడ్, కె రాములు, బాబూరావు, శివకుమార్, బలరామ్, ఎ శ్రీనివాస్, మోహ న్ చవాన్, గొల్లపల్లి అనిల్‌కుమార్, హేమలత, జయమ్మలతో పాటు పెద్ద సంఖ్యలో వైద్య సిబ్బంది, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

యధావిధిగా వైద్య సేవలు..

కొత్త భవనం కోసం జెఎసి ఆధ్వర్యంలో కొద్దిసేపు ఓపీ వైద్యసేవలను నిలిపేయడంతో రోగులకు వైద్యసేవల్లో ఎలాంటి అంతరాయం కలుగకుండా ఆసుపత్రి వర్గాలు ప్రత్యామ్యామ ఏర్పాట్లు చేపట్టాయి. బుధవారం నుంచి ఓపీ సేవలను బహిష్కరిస్తామని జెఎసి ముందుగానే ప్రకటించడంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి నాగేందర్ రోగులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆసుపత్రి ఆర్ఎంఓలు ఓపీ విభాగంలో రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఓపీ విభాగంలో దాదాపుగా అన్ని విభాగాధిపతులు అందుబాటులో ఉండటంతో వైద్యసేవలు యధావిధిగా కొనసాగాయి.



పాలిటెక్నిక్ విద్యార్థులు సందడి

మన తెలంగాణ / ఆర్మూర్(నిజామాబాద్ జిల్లా) : ఆర్మూర్ మండలంలోని అంకాపూర్ గ్రామాన్ని విత్తన సాంకేతిక పరిజ్ఞాన పాలిటెక్నిక్ (రూద్రుర్) విద్యార్థులు బుధవారం సందర్శించారు. వీరికి గురడిరెడ్డి కాపు సంఘం కార్యదర్శి కె.కె. భాజన్న గ్రామాభివృద్ధిని, కూరగాయల పంటలను వేసే విధానం, ఎరువుల వాడక విధానాన్ని వివరించారు. మొక్కజొన్న, ఎర్రజొన్న, పసుపు, పండించి, ఉడికించే విధానా న్ని ఆర బెట్టి పాలిష్ చేసే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నిజామాబాద్ జిల్లా రూద్రుర్ కు చెందిన 200 విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ శైలా, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మన తెలంగాణ/ మోత్కూరు (యాదాద్రి జిల్లా) : అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం సాయంత్రం యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోత్కూరు మండలంలోని కొండాపురం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొండాపురం గ్రామానికి చెందిన బీసు కిష్టయ్య(60) తాను సాగు చేసిన నిమ్మ తోట, వరి పంటలను కాపాడుకునేందుకు తనకు ఉన్న వ్యవసాయ భూమి 8 ఎకరాల్లో మూడు బావులు, ఐదు బోర్లు తవ్వకం జరిపినా సరిపడా నీరు రాలేదు. దీంతో పంటలు చేతికందక చేసిన అప్పులు తీర్చలేక మనస్థాపానికి గురైన కిష్టయ్య ఐదు రోజుల క్రితం వ్యవసాయ బావి వద్ద గుళికల మందు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుంటుంబ సభ్యులు హుటాహుటిన సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తనువు చాలించాడు. కిష్టయ్య రూ. 8లక్షల వరకు అప్పులు చేశాడని కుటుంబ సభ్యులు చెప్పుతున్నారు.

వడదెబ్బతో మత్స్యకారుడు మృతి

మనతెలంగాణ/ కాల్వశ్రీరాంపూర్: పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని వెన్నంపల్లి గ్రామానికి చెందిన కలవేన సదయ్య (42) మంగళవారం చేపలు పట్టడానికి వెళ్లి వడదెబ్బతో అస్వస్థతకు గురై మృతి చెందాడు. గ్రామస్థులు,పోలీసుల వివరాల ప్రకారం కలవేన సదయ్య ఉదయం గ్రామశివారులో గల నల్ల చెరువుకు చేపలు పట్టడానికి వెళ్లాడు. వడ దెబ్బకు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా వారు వైద్యం చేయకపోవడంతో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జల్లెడ మిషన్‌లో పడి కూలీ మృతి

మనతెలంగాణ/ మిర్యాలగూడ : జల్లెడ మిషన్‌లో పడి మహిళా కూలీ మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం అవంతీపురంలోని సూర్యతేజ రైస్‌మిల్లులో తవుడు, పొట్టు వేరు చేసేందుకు జల్లెడ పట్టేందుకు కూలీకి వెళ్లిన ఆలగడపనివాసి కుర్ర నర్సమ్మ(35) ప్రమాదవశాత్తు జల్లెడ మిషన్‌లో పడటంతో తల, మొండెం వేరయ్యాయి. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, బంధువులు అక్కడికి చేరుకొని ఆందోళన చేశారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి సంఘటనాస్థలాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం తరపున కుటుంబానికి పరిహారం అందించాలని కోరారు.

ఉరి వేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

మన తెలంగాణ/ మెదక్(రామాయంపేట) : ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయితానేమోనని మనస్తాపం చెందిన ఓ విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం రాయిలాపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబీకుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన రొడ్డ లక్ష్మ ణ్ పెద్ద కూతురు శివాణి(16)పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదివింది. ఇటీవల ఇంటర్ పరీక్షలు రాసింది. పరీక్షా ఫలితాల్లో తాను ఫెయిల్ అవుతానన్న బెంగతో మనస్తాం చెందిన ఆమె ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుంది. మృతురాలి చెల్లెలు పాఠశాల నుంచి వచ్చి పిలిచినప్పటికీ ఎంతకు పలక లేదు. దీంతో ఆమె అమ్మ వద్దకు సమాచారం అందించింది. ఇంటి వద్దకు చేరుకుని గడియను తొలగించి లోపలికి వెళ్లి చూడగా దులానికి ఉరివేసుకుని ఉంది. కిందకు దించి చూడగా అప్పటికే ఆమె మృతి చెందింది. విషయం తెలుసుకున్న పేట ఎస్ఐ మహేందర్ అక్కడికి చేరుకుని వివరాలు అడిగి తెల్సుకున్నారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం పేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బోరు కోసం అన్నదమ్ముల గొడవ

అన్న చేతిలో తమ్ముడు దారుణ హత్యం

మన తెలంగాణ/ తానూర్: పొలానికి నీరు పెట్టే విషయమంలో గొడవ జరిగి అన్న తమ్ముడిని చంపిన సంఘటన నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని జౌలా(కె)గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ముథోల్ సిఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం జౌలా(కె) గ్రామానికి చెందిన ఇఫ్తైకర్ గంగాధర్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కొడుకు ఇఫ్తైకర్ దత్తు, చిన్న కొడుకు ఇఫ్తైకర్ శంకర్(34) ఉన్నారు. మృతుడి తండ్రి గంగాధర్‌కు 26 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇద్దరు కొడుకులకు 10 ఎకరాల చొప్పున వ్యవసాయ భూమి పంచి ఇచ్చాడు. తండ్రి గంగాధర్ 6 ఎకరాల భూమి ఉంచుకొని వ్యవసాయం సాగు చేస్తున్నాడు. సంవత్సరం కింద గంగాధర్ తనకు ఉన్న ఆరు ఎకరాల వ్యవసాయ పొలంలో బోరు వెయ్యగా మూడు ఇంచుల నీరు పండింది. అన్నదమ్ములు ఇద్దరు కలిసి వారానికి ఒకరు నీరు తమ పంట పొలాలకు పారపోసుకొని పంట సాగు చేసుకోమని తండ్రి తెలుపగా శంకర్ తన పొలంలో పదిహేను రోజుల నుంచి వేరుశెనగ పంటకు నీరు పారవేస్తున్నాడు. దీంతో ఈ విషయంపై మంగళవారం రాత్రి ఇద్దరు అన్నదమ్ముల మధ్య వాగ్వాదం జరిగింది. శంకర్‌ను దత్తు కర్రతో కొట్టడంతో రక్తస్రావమై స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు గమనించి 108లో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యుల సలహా మేరకు నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో శంకర్ మృతిచెందాడు. మృతుడికి భార్య రూప, ఒక సంవత్సరం కొడుకు నరేష్ ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాజన్న తెలిపాడు.

మాదిగ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్

- ఉపకులాలకు ఎమ్మార్వో ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాలి
- సమరభేరిలో గద్దర్, వంగపల్లి డిమాండ్



మన తెలంగాణ / హైదరాబాద్/ ముషీరాబాద్: మాదిగ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, ఉప కులాలకు ఆర్డీవో ద్వారా కాకుండా ఎమ్మార్వో ద్వారా కుల ధృవీకరణ పత్రాలను ఇవ్వాలని ఉపకులాల సమరభేరిలో ప్రజా గాయకుడు గద్దర్, ఎమ్మార్పీఎస్ (టిఎస్) రాష్ట్ర అధ్యక్షుడు యాతాకుల భాస్కర్, వర్కింగ్ ప్రసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ మాదిగలు డిమాండ్ చేశారు. ఎస్సీ ఉప కులా ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (టిఎస్)ల సంయుక్తాధ్వర్యంలో హైదరాబాద్ సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో మాదిగ, ఉప కులాల సమరభేరి జరిగింది. ఈ భేరికి ప్రజా గాయకుడు గద్దర్, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు యాతాకుల భాస్కర్ మాదిగ, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులనగానే మాల, మాదిగలు గురుకొస్తున్నారని, కాని ఉపకులాలకు మాత్రం ఆఫలాలు అందడం లేదన్నారు. సంచార జీవితాలు గడుపుతూ అభివృద్ధికి నోచుకోకుండా ఉన్న ఎస్సీ ఉప కులాలకు కుల ధ్రువీకరణ పత్రాలు ఆర్డీవో ద్వారా కాకుండా ఎమ్ఆర్ఓ ద్వారా ఇప్పించాలన్నారు. అలాగే డప్పు, చెప్పు వృత్తులకు, ఉపకులాల కళాకారులకు రూ.2000 పెన్షన్ సదుపాయం కల్పించాలన్నా రు. ఎస్సీ 59 ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ 1000 కోట్లతో ఏర్పాటు చేయాలని, బైండ్ల వారిని గ్రామదేవతల ఆలయాలలో పూజారులుగా నియమించాలని, డబుల్ బెడ్ రూంతో పాటు 3 ఎకరాల భూమి మంజూరు చేయాలని, ఎస్సీ ఉపకులాలకు జిల్లాకో గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని, ఎబిసిడి వర్గీకరణకు అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్ళాలని డిమాండ్ చేశారు. ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తే ఆ కులాల అభ్యున్నతికి కావలసిన అంశాలను కేసీఆర్ తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ ఉపకులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు తమటం వీరేశం, ఎస్సీ ఉపకులాల ఐక్య వేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ ఏర్పుల భాస్కర్ బైండ్లలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఉప కులాల ఐక్య వేదిక జాతీయ అధ్యక్షులు చింతల మల్లిఖార్జున్, ఎస్సీ ఉప కులాల ఐక్య వేదిక అధ్యక్షులు టంటం వీరేశం, వర్కింగ్ ప్రసిడెంట్ ఏర్పుల భాస్కర్, ఎమ్మార్పీఎస్ నాయకులు మేడిపాపయ్య, బేడ బుడగ జంగ హక్కుల దండు వ్యవస్థాపక అధ్యక్షులు తూర్పాటి హనుమంతు, బాణాల మంగేష్ డక్కలి, ఏర్పుల యాదయ్య, నాగిల్ల కిష్టయ్య, మిర్యాల మనోహర్, పొట్టపెంజర రమేష్ మాదిగ, బైండ్ల మల్లేష్, వెంకటేష్, మురళి తదితరులతో పాటు పెద్ద ఎత్తున ఉపకులాల ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప కులాలకు చెందిన కళాకారులు బాగోతం, బుర్ర కథ తదితర కళారూపాలను ప్రదర్శించారు.



తెలంగాణ తాగునీటి పథకం

దేశానికే ఆదర్శం

కేరళ మీడియా ప్రతినిధి బృందం

మన తెలంగాణ/ గజ్వేల్ : కేవలం ఏడు మాసాలలో ప్రాజెక్ట్ నిర్మించి ఇంటింటికి త్రాగు నీరు అందించడం గర్వించదగిన విషయమని కేరళ మీడియా ప్రతినిధి బృందం తెలంగాణ ప్రభుత్వాన్ని కొనియడారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని కొండపాక మిషన్ భగీరథ హెడ్ పంపింగ్ విధానాన్ని పరిశీలించిన కేరళ మీడియా 54 మంది బృందం సభ్యులు అక్కడి నుంచి నేరుగా గజ్వేల్ మండల పరిధిలోని కోమటిబండ మిషన్ భగీరథ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కేరళ మీడియా బృందానికి ఇరిగేషన్ ఈఈ రాజయ్య మిషన్ భగీరథ ప్రత్యేకతను వివరిస్తూ 14వేల జిఎల్‌బిఆర్ సామర్థ్యం కలిగిన గ్రావిటీ సంప్‌హౌజ్ నుంచి దుబ్బాక, సిద్దిపపేట, గజ్వేల్ నియోజకవర్గాలలోని లక్షా 70వేల కుటుంబాలకు 2400 కిలో మీటర్ల పైప్‌లైన్ ద్వారా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కేరళ బృందం సభ్యులు మాట్లాడుతూ కేవలం ఏడు మాసాలలో ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేసి లక్షా 70 వేల కుటుంబాలకు నల్లాల ద్వారా ఇంటింటికి తాగునీరు అందించడం గర్వించదగిన విషయమని, తెలంగాణలో చేపట్టిన సాగు, త్రాగు నీటి పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. అనంతరం అక్కడి నుంచి హైదరాబాద్ సిటీకి బయలుదేరి వెళ్లారు.

అదుపు తప్పి వ్యవసాయ బావిలో పడ్డ కారు

- తాత, మనువడు మృతి
- గాయాలతో బయటపడిన తల్లి, కుమార్తె

మన తెలంగాణ/ హుజూరాబాద్ టౌన్ : సెలవుల మీద పుట్టింటికి వెళ్లి సరదాగా గడుపుదామనుకుని బయల్దేరిన.. ఆ కుటుంబాన్ని వ్యవసాయ బావి పొట్టనపెట్టుకుంది. కారు అదుపు తప్పి వ్యవసాయ బావిలో పడటంతో తాత, మనువడు మృతి చెందగా, తల్లి, కుమార్తె క్షేమంగా బయటపడిన సంఘటన కరీంనగర్ జిల్లా, హుజూరాబాద్ మండలంలోని సింగాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.... వరంగల్ జిల్లా గణేష్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఎదురుకట్ల వరుణ్‌కు శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన భవానీతో ఏడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి వివాన్(6), సాన్వి(3)లు ఉన్నారు. ఈ క్రమంలోనే ఒంటిపూట బడులు కావడంతో సరదాగా గడిపేందుకు కారులో వరుణ్ తండ్రి ఎదురుకట్ల సుధాకర్‌తో కలిసి బయల్దేరారు. ఈ క్రమంలోనే సింగాపూర్ శివారులోకి కారు వెళ్లగానే ముందటి టైరు పగిలిపోవడంతో కారు అదుపు తప్పి వ్యవసాయ బావిలో పడింది. ఈ సంఘటనలో ఎదురుకట్ల సుధాకర్(56), ఎదురుకట్ల వివాన్(6)లు అక్కడికక్కడే మృతి చెందగా తల్లి భవానీ, కుమార్తె సాన్విలు ప్రాణాలతో బయటపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే కారులో ఉన్న తల్లి, బిడ్డలను రక్షించిన అనంతరం మృతదేహాలను వెలికి తీశారు. విషయం తెలుసుకున్న ఏసీపీ కృపాకర్, సీఐలు రవికుమార్, వివి. రమణమూర్తిలు సంఘటన స్థలానికి చేరుకొని మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. చికిత్స నిమిత్తం వరంగల్ ఆసుపత్రికి తరలించారు.



‘బొడ్డుపల్లి’ హత్య కేసులో ఐదుగురికి బెయిల్ రద్దు

మన తెలంగాణ/ నల్లగొండ ప్రతినిధి : మున్సిపల్ చైర్పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మి భర్త శ్రీనివాస్ హత్య కేసులో మరో మలుపు చోటు చేసుకుంది. హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొని అరెస్టు అయిన వెంటనే బెయిల్‌పై విడుదలైన ఐదుగురు ముద్దాయిలకు బెయిల్ రద్దు చేస్తూ బుధవారం నల్లగొండ ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేసింది. హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎ6 దామెర సతీశ్, ఎ7 మాం ద్ర మహేశ్, ఎ8 మిట్టపల్లి సాయి, ఎ9 మెరుగు గోపి, ఎ10 మాతంగి మోహన్‌ల బెయిల్‌ను రద్దు చేయాలని నల్లగొండ టూటౌన్ పోలీసులు కోర్టులో పిటీషన్‌ను దాఖలు చేశారు. ఈ పిటీషన్‌పై వాదనలు, ప్రతివాదనలు విన్న న్యాయమూర్తి ఈ తీర్పునిచ్చారు. వారంలోగా నల్లగొండ కోర్టులో లొంగిపోవలసిందిగా వారిని ఆదేశించారు.

గుప్పెడు బాధతో పరీక్ష రాసిన కూతురు



మనతెలంగాణ/ చందుర్తి (సిరిసిల్ల జిల్లా): కన్నతల్లి గుండెపోటుతో మృతిచెందగా, గుప్పెడు బాధతో పదో తరగతి పరీక్ష వ్రాసింది. సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని ఎన్గల్ గ్రామంలోని గసికంటి శిరీష అనే పదోతరగతి విద్యార్థిని తల్లి గసికంటి సత్తెవ్వ(42) అనే మహి ళ మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందింది. బుధవారం పరీక్ష ఉండటంతో శిరీష గుండెనిండా దుఖాన్ని దిగమింగుకొని పరీక్షకు హాజరైంది. శిరీషను చూ సిన తోటి విద్యార్థులు, పలువురు కంటతడి పెట్టుకున్నారు.

బొలెరో, లారీ ఢీకొని ఇద్దరు మృతి

మన తెలంగాణ/ ఇబ్రహీంపట్నం: బొలెరో వ్యాన్ అదుపు తప్పి కంటైనర్ లారీని ఢీ కొట్టడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికి అక్కడే మృతి చెందిన సంఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసులు తెలిపిన ప్రకారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుమ్మలూర్ గ్రామానికి చెందిన గడ్డమోడి శ్రీశైలం(47) బోలెరోలో గజ్వేల్ నుంచి తుమ్మలూర్‌కు అవుటర్ రింగ్ రోడ్డపై వెళ్తుండగా అదుపు తప్పి శంషాబాద్ నుంచి పెద్దఅంబర్‌పేట్ వైపు వెళ్తున్న కంటైనర్ లారీని వండర్ల బొంగ్లూర్ అవుటర్ దగ్గర ఢీకొట్టడంతో శ్రీశైలంతో పాటు మహారాష్ట్రకు చెందిన కెబ్రా(35) అ క్కడికి అక్కడే మృతి చెందినట్లు తెలిపారు. వీళ్ళు ఇద్దరు రంగారెడ్డి జిల్లా అమనగల్లు గ్రామంలో సిపి ప్రైవేట్ కంపెనీలో కోడి పిల్లలను అన్‌లోడ్ చేసి తిరిగి వెళ్తుతుండగా సంఘటన జరిగినట్లు తెలిపారు. సమాచారం మేరకు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకోని రోడ్డు ప్రమాగానికి గల కారణాలు పరిశీలించి మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ సివిల్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.ఈ ప్రమాదంలో కంటైనర్ లారీ డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేట్ అసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకోని దర్యాప్తు జరుపుతున్నట్లు సిఐ గోవిందా రెడ్డి తెలిపారు.



వైఎస్ఆర్ పాత్రలో మమ్ముట్టి

భలే మంచి రోజు, ఆనందో బ్రహ్మ వంటి సూపర్ హిట్ సినిమాలను ప్రేక్షకులకు అందించిన 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మించనున్న చిత్రం 'యాత్ర'. ఈ చిత్రానికి 'ఆనందో బ్రహ్మ' ఫేమ్ మహి వి.రాఘవ్ దర్శకత్వం వహించనున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి బయోపిక్‌గా తెరకెక్కనున్న ఈ చిత్ర కథను మహి వి.రాఘవ్ స్వయంగా రాసుకొని రూపొందించనున్నాడు. ఈ చిత్రంలో వైఎస్ఆర్ పాత్రను మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి పోషించనుండడం విశేషం. ఈ సందర్భంగా నిర్మాత విజయ్ చిల్లా మాట్లాడుతూ యాత్ర చిత్రం కోసం దర్శకుడు మహి సిద్ధం చేసిన కథ నచ్చడంతోనే ఈ సినిమాను నిర్మించేందుకు సన్నాహాలు మొదలుపెట్టామని తెలిపారు. తమ సినిమాలో వైఎస్ఆర్ పాత్రలో నటించడానికి మమ్ముట్టి అంగీకరించడడంతో ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. వైఎస్ఆర్ జీవితంలో జరిగిన కొన్ని సంఘటనల ఆధారంగా భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించేందుకు ప్లాన్ చేస్తున్నామని తెలిపారు.



పవర్‌ఫుల్ స్టైలిష్ లుక్


గోపీచంద్

ఆంధ్రుడు, యజ్ఞం, లక్ష్యం, శౌర్యం, లౌక్యం వంటి సూపర్‌డూపర్ చిత్రాలతో మెప్పించిన గోపీచంద్ కథానాయకుడిగా శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్న చిత్రం 'పంతం'. 'ఫర్ ఎ కాస్' అనేది ఉపశీర్షిక. బలుపు, పవర్, జై లవకుశ వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలకు స్క్రీన్‌ప్లే అందించిన కె.చక్రవర్తి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. గోపీచంద్ నటిస్తున్న 25వ చిత్రమిది కావడం విశేషం. ఈ సినిమా ఫస్ట్ లుక్ విడుదలైంది. ఈ సందర్భంగా నిర్మాత కె.కె.రాధామోహన్ మాట్లాడుతూ ''మా సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌లో గోపీచంద్ 25వ సినిమా 'పంతం'ను చేయడం హ్యాపీగా ఉంది. 60 శాతం సినిమా చిత్రీకరణను పూర్తిచేశాం. మంచి సందేశంతో పాటు కమర్షియల్ హంగులతో సినిమాను దర్శకుడు చక్రవర్తి చక్కగా తెరకెక్కిస్తున్నారు. హీరో గోపీచంద్ క్యారెక్టర్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. ఇప్పటివరకు కనపడని స్టైలిష్ లుక్‌తో ఆయన కనపడతారు. సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశాం. అలాగే మెహరీన్ చాలా మంచి పాత్రలో కనపడతారు. గోపీసుందర్ సంగీతం, ప్రసాద్ మూరెళ్ల సినిమాటోగ్రఫీ సినిమాకు పెద్ద ఎసెట్ అవుతాయి. ఈ వేసవిలో సినిమాను విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం''అని అన్నారు. పృథ్వీ, జయప్రకాష్ రెడ్డి తదితరులు ముఖ్య పాత్రల్లో నటించనున్న ఈ చిత్రానికి డైలాగ్స్: రమేష్ రెడ్డి, ఆర్ట్: ఎ.ఎస్.ప్రకాష్, స్క్రీన్‌ప్లే: కె.చక్రవర్తి, బాబీ, కో డైరెక్టర్: బెల్లంకొండ సత్యంబాబు.


రవికిషన్, కల్యాణ్‌రామ్, కాజల్, అల్లరి నరేష్, ఉపేంద్ర మాధవ్, కిరణ్ రెడ్డి, భరత్ చౌదరి తదితరులు

దర్శకుల హీరో కల్యాణ్‌రామ్

నందమూరి కల్యాణ్‌రామ్, కాజల్ అగర్వాల్ హీరో హీరోయిన్లుగా ఉపేంద్ర మాధవ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎంఎల్‌ఎ'. టి.జి.విశ్వప్రసాద్ సమర్పణలో బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌లపై కిరణ్ రెడ్డి, భరత్ చౌదరి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో నందమూరి కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ ''కథను నమ్ముకుని సినిమాలు తీసే నిర్మాతలంటే నాకు ఎంతో ఇష్టం. అటువంటి వారిలో ఈ నిర్మాతలు ముందుంటారు. ఈ సినిమాలో దర్శకుడు ఉపేంద్ర నన్ను కొత్తగా చూపించాడు. కొత్త దర్శకుడిని గైడ్ చేయాల్సిన బాధ్యత సినిమాటోగ్రాఫర్‌ది. దర్శకుడు, సినిమాటోగ్రాఫర్‌ది భార్య భర్తల సంబంధం. నేను కలిసి పనిచేసిన కెమెరామెన్‌లలో బెస్ట్ ప్రసాద్ మూరెళ్ల. రవికిషన్ నాకు దేవుడిచ్చిన అన్నయ్యలాగా దొరికారు. ఆయన భోజ్‌పురిలో సూపర్‌స్టార్. 500 సినిమాలు చేసిన ఆయన ఇంకా ఏదో నేర్చుకోవాలని ప్రయత్నిస్తుంటారు. ఆయనను చూసి ఇన్‌స్పైర్ అయ్యాను. ఇక కాజల్ అగర్వాల్‌తో నేను చేసిన రెండో సినిమా ఇది. నా హృదయానికి దగ్గరైన సినిమా ఇది. తప్పకుండా ప్రేక్షకులు అందరికీ నచ్చుతుంది''అని అన్నారు. అల్లరి నరేశ్ మాట్లాడుతూ ''కల్యాణ్‌కి 'ఎంఎల్‌ఎ' బ్లాక్‌బస్టర్ హిట్ అవుతుంది. కొత్త దర్శకుడు అయినప్పటికీ ఉపేంద్ర ఈ సినిమాను అద్భుతంగా తెరకెక్కించాడు. మణిశర్మ పాటలు ఎంతో బావున్నాయి''అని తెలిపారు. వంశీ పైడిపల్లి మాట్లాడుతూ ''నేను, ఉపేంద్ర కలిసి పనిచేశాం. తను మంచి టైమింగ్ ఉన్న డైరెక్టర్. కాజల్ చిత్ర పరిశ్రమలో 12 ఏళ్ల ప్రయాణాన్ని పూర్తిచేసుకుంది. తను ఇంకా మరిన్ని మంచి సినిమాల్లో నటించాలి. మంచి లక్షణాలున్న అబ్బాయికి కల్యాణ్‌రామ్ మంచి ఉదాహరణ. ఆయన భవిష్యత్‌లో గొప్ప సినిమాలు చేయాలి''అని చెప్పారు. దర్శకుడు ఉపేంద్ర మాట్లాడుతూ ''దర్శకుల హీరో కల్యాణ్‌రామ్. ఏమీ తినకుండా ఆయన 16 గంటల పాటు ఉండేవారు. దర్శకుడిగా నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. మణిశర్మ మంచి మ్యూజిక్‌నిచ్చారు''అని పేర్కొన్నారు. నిర్మాత కిరణ్ రెడ్డి మాట్లాడుతూ ''నేనే రాజు నేనే మంత్రి సినిమా చేస్తున్న సమయంలో దర్శకుడు ఉపేంద్ర నాకు ఈ కథ చెప్పారు. థ్రిల్లింగ్‌గా కథను కళ్లకు కట్టినట్లు చెప్పడం జరిగింది. కథ విన్న కల్యాణ్‌రామ్ ఈ సినిమా చేయడానికి అంగీకరించారు. కాజల్ వంటి లక్కీ హీరోయిన్‌తో మరోసారి చేసిన సినిమా ఇది. శుక్రవారం ఈ సినిమా విడుదలకానుంది''అని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మానందం, డి.సురేశ్‌బాబు, జెమిని కిరణ్, శ్రీనువైట్ల, టి.జి.విశ్వప్రసాద్, వి.ఎన్.ఆదిత్య, ఎం.ఎల్.కుమార్ చౌదరి, ఎన్.శంకర్, కోన వెంకట్, రవికిషన్, పృథ్వీ, రామజోగయ్యశాస్త్రి, కాసర్ల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్


రామ్‌కుమార్, నిరూప్ భండారి, అవంతిక శెట్టి, సతీష్ శాస్త్రి

నిరూప్ భండారి, అవంతిక శెట్టి జంటగా అనూప్ భండారి దర్శకత్వంలో జాలీ హిట్స్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించిన చిత్రం 'రాజరథం'. అంజు వల్లభనేని, విష్ణు దకప్పదారి, సతీష్ శాస్త్రి, అజయ్ రెడ్డి గొల్లపల్లి నిర్మాతలు. ఈ చిత్రం శుక్రవారం విడుదలకానుంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిరూప్ భండారి మాట్లాడుతూ ''ఈ సినిమా కోసం తెలుగు నేర్చుకున్నాను. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'రాజరథం'. సినిమాలో అభి అనే మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థిగా కనపడతాను. రానాను అడగగానే ఈ సినిమాకు వాయిస్ ఓవర్ అందించారు. అలాగే ఆర్య ఈ సినిమాలో ముఖ్యమైన పాత్రలో నటించారు. నిర్మాతలు అందించిన సహకారంతో మంచి సినిమా చేశాం. శుక్రవారం మా సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది''అని అన్నారు. సతీష్ శాస్త్రి మాట్లాడుతూ ''యుఎస్‌లో ఎన్నో విజయవంతమైన సినిమాలను డిస్ట్రిబ్యూట్ చేసిన మా జాలీ హిట్స్ సంస్థ నిర్మాణ రంగంలోకి వచ్చింది. అనూప్ భండారి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో హీరో నిరూప్ భండారి అద్భుతంగా నటించారు. సినిమా మేకింగ్‌లో ఎక్కడా రాజీపడలేదు. పూర్తి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. అజనీశ్ లోక్‌నాథ్ ఈ సినిమాకు మంచి నేపథ్య సంగీతాన్ని అందించారు''అని తెలిపారు. రామ్‌కుమార్ మాట్లాడుతూ ''యుఎస్‌కు చెందిన ఈ నిర్మాతలు మంచి సినిమాలు చేయాలని వచ్చారు. 'రంగితరంగ' సినిమాతో తానేంటో నిరూపించుకున్న నిరూప్ భండారి హీరోగా అవంతిక శెట్టి హీరోయిన్‌గా చేసిన 'రాజరథం' శుక్రవారం విడుదలకానుంది. ఇలాంటి సినిమాలను ఆదరిస్తే మరిన్ని కొత్త కాన్సెప్ట్ సినిమాలు వస్తాయి. పాటలకు మంచి స్పందన వచ్చింది. రెండేళ్ల పాటు యూనిట్ ఎంతో కష్టపడి చేసిన చిత్రమిది. సినిమా నిర్మాణం కోసం రూ.22 కోట్లు ఖర్చుపెట్టారు''అని పేర్కొన్నారు. హీరోయిన్ అవంతిక శెట్టి మాట్లాడుతూ ''హీరోయిన్‌గా నాకు మంచి పేరును తీసుకువచ్చే చిత్రమిది. ఈ చిత్రం మంచి విజయం సాధిస్తుందన్న నమ్మకముంది'' అని అన్నారు.


శేఖర్ కమ్ముల

మంచి సందేశాన్నిచ్చే నీది నాది ఒకే కథ

శ్రీవిష్ణు హీరోగా వేణు ఊడుగుల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'నీది నాది ఒకే కథ'. అరాన్ మీడియా వర్క్స్, శ్రీ వైష్ణవి క్రియేషన్స్ బ్యానర్‌లపై ప్రశాంతి, కృష్ణ విజయ్, అట్లూరి నారాయణరావు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం శుక్రవారం విడుదలకానుంది. ఈ చిత్రం గురించి ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ ''ఇది మనందరి కథలా ఉంది. చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది ఫిలిం. దర్శకుడికి ఇది తొలి సినిమా అయినప్పటికీ ముఖ్యమైన సబ్జెక్ట్‌ను ఎంతో పరిణతితో చాలా అందంగా చెప్పినందుకు హ్యాట్సాఫ్. నేటి చదువుల గురించి చక్కగా చెప్పిన చిత్రమిది. నేటి పోటీ ప్రపంచంలో పిల్లలు తల్లిదండ్రుల అంచనాల మేరకు చదువుల్లో రాణించేందుకు తీవ్రమైన వత్తిడికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులకు మంచి సందేశాన్నిచ్చే విధంగా దర్శకుడు సినిమాను తెరకెక్కించాడు. శ్రీవిష్ణు చక్కటి నటనతో ఆకట్టుకుంటాడు. రాయలసీమ యాసలో అతను డైలాగ్స్ ప్రేక్షకులను అలరిస్తాయి. తండ్రీ కొడుకుల మధ్య అనుబంధాన్ని సినిమాలో చక్కగా చూపించారు. నేటి సమాజానికి ఈ సినిమా ఎంతో అవసరం. ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది''అని తెలిపారు.

దీపిక ఖాతాలో మరో రికార్డు

ఇండియన్ సిల్వర్‌స్క్రీన్ టాప్ బ్యూటీగా దీపికా పదుకునే తిరుగులేని క్రేజ్‌ను సంపాదించుకుంది. ఇటీవల 'పద్మావత్' సినిమా సక్సెస్‌తో ఆమె కు ఎంతో పాపులారిటీ వచ్చింది. అదేవిధంగా దేశంలోనే అత్యధికంగా పారితోషికం తీసుకుంటున్న స్టార్ హీరోయిన్‌గా ఈ బాలీవుడ్ బ్యూటీ నిలిచింది. ఇక అత్యధిక ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్స్‌తో 'మోస్ట్ ఫాలోడ్ అకౌంట్' రికార్డును దీపికా పదుకునే తన ఖాతాలో వేసుకుంది. ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో 22.4 మిలియన్ల మందికి పైగా అభిమానులు ఆమెను ఫాలో అవుతున్నారు. అందుకే ఆమెను ఈ అవార్డు వరించింది. అభిమానుల ఆదరాభిమానాలతోనే తనకు ఈ అవార్డు దక్కిందని చెప్పిన దీపిక ఇకముందు కూడా ఇదే జోరును కొనసాగిస్తానని పేర్కొంది. దీపిక తర్వాత ఇన్‌స్టాగ్రామ్‌లో 22 మిలియన్ల మంది ఫాలోవర్స్‌తో ప్రియాంక చోప్రా రెండవ స్థానంలో నిలిచింది. యంగ్ బ్యూటీ అలియాభట్‌కు 20.8 మిలియన్ల ఫాలోవర్స్, శ్రద్ధాకపూర్‌కు 20 మిలియన్ల మంది ఫాలోవర్స్ ఉండడం విశేషం.


రాశిఖన్నా


దీపికా పదుకునే

రాశీఖన్నాకు బంపర్ ఆఫర్

రాశీఖన్నా కెరీర్‌ను 'తొలిప్రేమ'కు ముందు... 'తొలిప్రేమ'కు తర్వాత అని విభజించి చూడాలేమో. ఈ సినిమా ముందు వరకు ఆమెను కమర్షియల్ సినిమాల్లో గ్లామర్ క్యారెక్టర్లు చేసే సగటు కథానాయికగానే చూసేవాళ్లు ప్రేక్షకులు. అయితే 'తొలిప్రేమ' సినిమాతో తాను మంచి నటినని నిరూపించింది రాశీ. ఈ సినిమా తర్వాత ఆమెకు మంచి అవకాశాలు వస్తున్నాయి. తాజాగా ఆమెకు తమిళంలో ఓ పెద్ద సినిమాలో ఛాన్స్ వచ్చింది. ఎన్‌టిఆర్ కెరీర్‌లో ఓ మైలురాయిలా నిలిచిన 'టెంపర్'ను తమిళంలో విశాల్ కథానాయకుడిగా రీమేక్ చేయబోతున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో రాశీఖన్నా కథానాయికగా ఎంపికైంది. మహేశ్‌బాబు 'స్పైడర్' సినిమాకు మురుగదాస్ దగ్గర కో డైరెక్టర్‌గా పనిచేసిన వెంకట్ మోహన్ అనే కొత్త దర్శకుడు ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నాడు. విశాల్ సొంత బ్యానర్, లైట్ హౌజ్ మూవీ మేకర్స్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మించనున్నాయి. రాశీ ఇప్పటికే తమిళంలో మూడు సినిమాల్లో నటిస్తుండడం విశేషం. అధర్వ, సిద్ధార్థ్, జయం రవిల సరసన ఆమె కథానాయికగా సినిమాలు చేస్తోంది. తెలుగులో ఆమె కొత్తగా రెండు సినిమాలకు సంతకం చేసినట్లు సమాచారం.

యధార్థ సంఘటన ఆధారంగా..


భాను, బి.సుధాకర్ రెడ్డి, డి.రామకృష్ణ తదితరులు

సుధాకర్ ఇంపెక్స్ ఇండియా ప్రై.లి. బోన్ క్రాఫ్ట్ క్రియేషన్స్ పతాకంపై డి.నరసింహ సమర్పించిన చిత్రం 'మర్లపులి'. సువర్ణసందేశ్ ప్రత్యేక పాత్రలో అర్చన ప్రధాన పాత్రలో నటించారు. డి.రామకృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని బి.సుధాకర్ రెడ్డి, బి.భవాని శంకర్, ఖమ్మం శ్రీనివాస్ కలిసి నిర్మించారు. ఈ చిత్రం శుక్రవారం విడుదలకానుంది. ఈ చిత్ర గీతాలను హీరోయిన్ భాను చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతల్లో ఒకరైన బి.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ''1983 సంవత్సరంలో జరిగిన యధార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కించిన చిత్రమిది. దర్శకుడు రామకృష్ణ చాలా బాగా తెరకెక్కించారు. సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్ చిత్రమిది. ఈ చిత్రానికి నేనే మ్యూజిక్ అందించాను. పాటలు అందరి ఆదరణ పొందుతాయని ఆశిస్తున్నాను. సినిమా ఘన విజయం సాధిస్తుందన్న నమ్మకముంది''అని అన్నారు. దర్శకుడు రామకృష్ణ మాట్లాడుతూ ''13 రోజుల్లో షూటింగ్ పూర్తిచేశాము. సరసాపూర్ అడవుల్లో షూటింగ్ చేశాము. నిర్మాత డి.సుధాకర్ రెడ్డి అద్భుతమైన మ్యూజిక్‌తో పాటు చిత్రానికి కావలసిన అన్ని సౌకర్యాలను కల్పించారు. మంచి కథ, యదార్థ గాథ కనుక సినిమా తప్పకుండా విజయం సాధిస్తుంది''అని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీనాథ్, దేవరాజ్, శిరీష, ప్రశాంత్ కార్తీక్, అనిత ఆలపాటి, విజయ్, శివకార్తీక్, రమణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పోసాని, తాగుబోతు రమేష్, చమ్మక్‌చంద్ర తదితరులు ముఖ్య తారాగణంగా నటించిన ఈ చిత్రానికి కెమెరా: ఎం.మురళీకృష్ణ, సంగీతం: బి.ఎస్.రెడ్డి.



చమురు ధరలు పైపైకి..

న్యూఢిల్లీ: చమురు ధరలు మూడు వారాల గరిష్టానికి చేరాయి. అంచనాలకు విరుద్ధంగా అమెరికా ఇంధన నిల్వలు తగ్గడంతో ఒక్కసారిగా చమురు ధరలు పెరిగాయి. మంగళవారం మధ్యాహ్నం యూఎస్ మార్కెట్లో నైమెక్స్ చమురు బ్యారల్ 2.2 శాతం పెరిగి 63.48 డాలర్లకు చేరింది. ఇదే బాటలో లండన్ మార్కెట్లో బ్రెంట్ చమురు బ్యారల్ 2 శాతం ఎగసి 67 డాలర్లను అధిగమించింది. నైమెక్స్ 0.2 శాతం బలపడి 63.70 డాలర్లను చేరగా, బ్రెంట్ బ్యారల్ అదే స్థాయిలో పుంజుకుని 67.60 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. మార్చి 16తో ముగిసిన వారంలో చమురు నిల్వలు 2.74 మిలియన్ బ్యారల్లమేర తగ్గినట్లు మంగళవారం అమెరికా ఇంధన శాఖ వెల్లడించింది. వాస్తవానికి 2.55 మిలియన్ బ్యారల్లమేర నిల్వలు పెరగనున్నట్లు విశ్లేషకులు అంచనా వేశారు. దీంతో 5 మిలియన్ బ్యారల్ల మేర అంచనాలు తలకిందులు కావడంతో చమురు ధరలకు రెక్కలొచ్చినట్లు నిపుణులు పేర్కొంటున్నారు. మరోవైపు ఇరాన్‌కు తగిన గుణపాఠం చెబుతామంటూ సౌదీ అరేబియా ప్రకటించడం, వెనిజులాలో చమురు ఉత్పత్తి గత నెలలో 1.54 మిలియన్ బ్యారల్లమేర తగ్గడం వంటి అంశాలతో చమురు ధరల మంట మొదలైంది.

ఫ్లిప్‌కార్ట్‌లో జియోఫై జెఎంఆర్ 815



న్యూఢిల్లీ: రిలయన్స్ జియో సరికొత్త హాట్‌స్పాట్‌ను తీసుకొచ్చింది. 'జియోఫై జెఎంఆర్ 815' 4జి ఎల్‌టిఇ హాట్‌స్పాట్ పేరిట విడుదల చేసిన ఈ డివైస్ ధర రూ.999గా కంపెనీ నిర్ణయించింది. ఇది 150 ఎంబిపిఎస్ స్పీడ్‌తో డౌన్‌లోడ్ వేగంగా మరింతగా ఉంటుంది. అప్‌లోడ్ 50 ఎంబిపిఎస్ వరకూ ఉంటుందని సంస్థ వెల్లడించింది. ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌లో ఈ డివైజ్ లభ్యం కానుంది. అలాగే రిలయన్స్‌కు చెందిన డిజిటల్ స్టోర్స్‌లో ఇది అందుబాటులో లేదు. ఫ్లిప్‌కార్ట్ ద్వారా మాత్రమే ఈ జియోఫైని సంస్థ విక్రయిస్తోంది. గత ఏడాది విడుదల చేసిన జియోఫైతో పోలిస్తే ఈ మోడల్‌లో చాలా మార్పులను తీసుకొచ్చారు. దీంతోపాటు అనేక ఆఫర్లను జియో అందిస్తోంది. యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డు ద్వారా కొనుగోలు చేసే వారికి 5 శాతం డిస్కౌంట్, 10 రోజుల రీప్లేస్‌మెంట్ పాలసీతో పాటు ఏడాది వారెంటీని అందిస్తోంది. మేకిన్ ఇండియాలో భాగంగా ఈ డివైస్‌ను భారత్‌లోనే తయారు చేశారు. ఈ డివైజ్‌తో 32 మంది వైఫైకి కనెక్ట్ చేసుకునే సామర్థ్యం ఉంది. వీరందరూ తమ స్మార్ట్‌ఫోన్లలోని జియో 4జి వాయిస్ యాప్ ద్వారా హెచ్‌డి వీడియో, వాయిస్ కాల్స్ కూడా చేసుకోవచ్చు. ఇందులోని మెమెరీ కార్డు స్లాట్‌ను ఉపయోగించి స్టోరేజీ 64జిబి వరకు పెంచుకునే అవకాశముంది.

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	33136.18	139.42	0.42%
నిఫ్టీ	10155.25	30.90	0.31%



కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్




బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	28990	31005.35	0.03%
ముంబై	29790	31860.96	–0.57%
ఢిల్లీ	29550	31604.28	0.17%
కోల్‌కతా	29690	31754.01	0%
కేరళ	28150	30106.95	0%
బెంగళూరు	28400	30374.33	0.35%
హైదరాబాద్	28990	31005.35	0.17%
గల్ఫ్	1393.85	1490.75	0.02%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	41100.00	41300.00	–0.48
ముంబై	41100.00	41300.00	–0.48
ఢిల్లీ	41100.00	41300.00	–0.48
కోల్‌కతా	41100.00	41300.00	–0.48
హైదరాబాద్	41100.00	41300.00	–0.48



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	330	విశాఖపట్నం	325
వరంగల్	332	చిత్తూరు	363
విజయవాడ	317	చెన్నై	370
గోదావరి	317	బెంగళూరు	365

ట్రావెల్, టూరిజంలో 2.59 కోట్ల ఉద్యోగాల సృష్టి

- 2017లో పెరిగిన రెండు రంగాల మార్కెట్
- జిడిపిలో ఈ రంగాల వాటా రూ.14,110 కోట్లు
- కెపిఎంజి, ఫిక్కీ సంయుక్త సర్వేలో వెల్లడి





న్యూఢిల్లీ: గత ఏడాదిలో ట్రావెల్, పర్యాటక రంగాలు 2.59 కోట్ల ఉద్యోగాలను సృష్టించాయని, ఈ రెండు రంగాలు జిడిపి(స్థూల దేశీయోత్పత్తి)కి దాదాపు రూ.14,110 కోట్లు అందించాయని కెపిఎంజి, ఫిక్కీలు సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో తేలింది. 'ఎక్స్‌పిడిషన్ 3.0: ట్రావెల్ అండ్ హాస్పిటాలిటీ గాన్ డిజిటల్' పేరిట ఈ నివేదికను విడుదల చేశాయి. మొబైల్ అప్లికేషన్లు, బిగ్ డేటా, ఎఐ, విఆర్, ఎఆర్‌లు పర్యాటక పరిశ్రమ భవిష్యత్‌ను మార్చివేశాయి. నివేదిక ప్రకారం, అంతర్జాతీయ డిజిటల్ ట్రావెల్ సేల్స్‌లో భారత్‌కు 3.7 శాతం వాటా అంచనా వేయగా, ఆసియా– పసిఫిక్(అపాక్) రీజియన్‌లో అతిపెద్ద మార్కెట్ దిశగా అడుగులు వేస్తోంది. భారత్‌లో కెపిఎంజి వద్ద ట్రాన్స్‌పోర్ట్, లీజర్, స్పోర్ట్స్ హెడ్ జైదీప్ ఘోష్ మాట్లాడుతూ, పర్యాటకంలో డిజిటల్ విప్లవం మొదలైందని, సాంకేతిక పరిజ్ఞానంలో మార్పులు కొత్త ఆవిష్కరణలకు నాంది పలుకుతున్నాయని అన్నారు. కార్పొరేట్, వినియోగదారుల ప్రయాణ సరిహద్దులు ఇప్పటికే కనిపించకుండా పోయాయి. పర్యాటకంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. డిజిటల్ బిజినెస్ సృష్టితో భవిష్యత్ ప్రయాణం కొత్త ఆకృతిని సంతరించుకుందని ఆయన తెలిపారు. నివేదిక ప్రకారం, స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్ పెరగడం పర్యాటక రంగానికి అత్యంత అనుకూలంగా మారింది. దీంతో పర్యాటకుల సంఖ్య మరింతగా పెరుగుతోంది. గత ఏడాదిలో 34 శాతం మంది యువ పర్యాటకులు ఒక్క రోజు రూ.6 వేలు, అంతకు మించి ఖర్చు చేస్తున్నారు. 22 శాతం మంది 55 ఏళ్లకు పైబడినవారితో పోలిస్తే వీరి సంఖ్య పెరిగింది. విశ్రాంతి పర్యాటకం 95 శాతానికి చేరింది. దేశంలో అతిపెద్ద ఉద్యోగ సృష్టికర్తలుగా ట్రావెల్, టూరిజం రంగాలు ఉన్నాయని, ప్రత్యక్షంగానే ఈ రంగాలు 2.59 కోట్ల ఉద్యోగాలు అందించాయని కెపిఎంజి, ఫిక్కీ నివేదికలు తెలిపాయి. దేశీయ ఆర్థిక వ్యవస్థలో ట్రావెల్, టూరిజం కీలక రంగాలుగా ఉన్నాయని, విదేశీ పర్యాటకుల తాకిడి ఏడాది ఏడాదికి 15.6 శాతం స్థిరమైన వృద్ధి రేటు నమోదు చేశాయని సర్వేలు తెలిపాయి. ఆన్‌లైన్ ట్రావెల్ బుకింగ్ సేల్స్ 2017 నుంచి 2021 నాటికి 14.8 శాతం పెరగనుందని నివేదికలు అంచనా. 2019 నాటికి ప్రపంచంలో ఆరవ అతిపెద్ద బిజినెస్ ట్రావెల్ మార్గెట్‌గా భారత్ నిలువనుందని పేర్కొన్నాయి.



నాలుగు నెలల కనిష్ఠానికి రూపాయి

ఫెడ్ సమీక్షకు ముందు డాలర్‌పై క్షీణించిన భారత్ కరెన్సీ విలువ

న్యూఢిల్లీ: ఫెడరల్ రిజర్వు పాలసీ నిర్ణయం వెలువడనున్న నేపథ్యంలో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ క్షీణించింది. బుధవారం నాలుగు నెలల కనిష్ఠానికి రూపాయి విలువ పడిపోయి 65.21గా నమోదైంది. 2017 నవంబర్ 16 నాటికి స్థాయికి రూపాయి విలువ పడిపోయింది. డాలర్‌పై రూపాయి విలువ 65.23గా ప్రారంభమై.. ఓ దశలో 65.19 వద్ద గరిష్ట స్థాయిని, అదే సమయంలో 65.23 వద్ద కనిష్ట స్థాయిని నమోదుచేసుకుంది. అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను పెంచనుందనే అంచనాలు రూపాయి పతనానికి కారణమయ్యాయి. రెండు రోజుల ఫెడ్ రిజర్వు సమావేశం మంగళవారం ప్రారంభమవగా.. బుధవారం రాత్రి వడ్డీ రేట్లపై ప్రకటన ఉంటుంది. ఈ ఏడాది మరో రెండుసార్లు ఫెడరల్ రిజర్వు తన వడ్డీరేట్లను పెంచనున్నట్లు ఇప్పటికే సంకేతాలు ఇచ్చింది. కొత్త చైర్మన్ పావెల్ అధ్యక్షతన ఫెడ్ కమిటీ కనీసం పావు శాతం వడ్డీ రేటును పెంచే అవకాశముందని సమాచారం. దీంతో ఫెడ్ ఫండ్స్ రేటు 1.5– 1.75 శాతానికి చేరనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. పదేళ్ల బాండ్ ఈల్డ్ 7.6 శాతంతో పోలిస్తే 7.5 శాతం వద్ద ముగిసింది. బాండ్ ఈల్డ్, ధరల కదలికలు వ్యతిరేక దిశలో ఉన్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూపాయి 2 శాతం పతనమైంది. విదేశీ ఇన్వెస్టర్లు ఈక్విటీలో కొనుగోళ్లు 1.60 బిలియన్ డాలర్లు, డెబిట్ మార్కెట్‌లో 310.80 మిలియన్లు విక్రయాలు చేపట్టారు. మరోవైపు దేశీయ స్టాక్‌మార్కెట్లు ఇందుకు విరుద్ధంగా లాభాల్లో పయనిస్తున్నాయి. వరుసగా రెండో రోజు స్టాక్ మార్కెట్లు లాభాలను నమోదు చేశాయి. టెలికామ్, ఫైనాన్షియల్, ఆయిల్, బ్యాంక్, ఆటో స్టాక్స్ ర్యాలీ బాటలో పయనించడంతో సూచీలు ఇదే దారిలో వెళ్లాయి. ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే ప్రాధాన్యత ఇవ్వడం కూడా మార్కెట్లు ముందుకు సాగేందుకు దోహదం చేసింది. ఆఖరికి సెన్సెక్స్ 139 పాయింట్లు లాభపడి 33,136 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ కూడా లాభాల దిశలో ఉంది.

టెలికామ్, బ్యాంక్ స్టాక్స్‌లో ర్యాలీ

రెండో రోజు లాభాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

ముంబై: వరుసగా రెండో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు లాభాలను నమోదు చేశాయి. టెలికామ్, ఫైనాన్షియల్, ఆయిల్, బ్యాంక్, ఆటో స్టాక్స్‌లో ర్యాలీ నేపథ్యంలో సూచీలు జోష్‌ను చూపాయి. వడ్డీ రేట్ల పెంపుపై ఫెడరల్ రిజర్వ్ నిర్ణయం వెలువడనుండడంతో అంతర్జాతీయంగా మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ మార్కెట్లు లాభాల దిశగా పయనించాయి. ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే ప్రాధాన్యత ఇవ్వడంతో మార్కెట్లు ఆద్యంతమూ సానుకూలంగా ట్రేడయ్యాయి. ఆఖరికి సెన్సెక్స్ 139 పాయింట్లు లాభపడి 33,136 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 31 పాయింట్లు పుంజుకుని 10,155 పాయింట్ల వద్ద ముగిసింది. ఇన్వెస్టర్లు ఫెడ్ నిర్ణయాలపై దృష్టి పెట్టారు. రెండు రోజులపాటు జరిగే అమెరికా ఫెడ్ పాలసీ సమీక్ష నిర్ణయాలు బుధవారం వెలువడనున్నాయి. కొత్త చైర్మన్ పావెల్ అధ్యక్షతన ఫెడ్ కమిటీ కనీసం పావు శాతం వడ్డీ రేటును పెంచే అవకాశముందని అంచనా వేస్తున్నారు. దీంతో ఫెడ్ ఫండ్స్ రేటు 1.51.75 శాతానికి చేరనున్నట్లు నిపుణులు భావిస్తున్నారు. ఎన్ఎస్ఇలో ఫార్మా, మెటల్, మీడియా నష్టపోయాయి. మరోవైపు రియల్టీ 0.8 శాతం లాభపడింది. మరోవైపు బ్లూచిప్స్‌లో ఎయిర్‌టెల్ 4.3 శాతం పెరగ్గా, బజాజ్ ఫైనాన్స్, ఎన్‌టిపిసి, ఐబి హౌసింగ్, బిపిసిఎల్, ఎల్ అండ్ టి, హెచ్‌డిఎఫ్‌సి, అల్ట్రాటెక్, ఒఎన్‌జిసి, ఇండస్‌ఇండ్ 2.51 శాతం వరకు పుంజుకున్నాయి. నగదు విభాగంలో మంగళవారం ఎఫ్‌పిఐ(విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు) రూ.344 కోట్లను ఇన్వెస్ట్ చేశారు. దేశీ ఫండ్స్(డిఐఐలు) కూడా రూ. 731 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేశాయి.



రూ.200 కోట్లు డిపాజిట్ చేయండి

జైప్రకాశ్ అసోసియేట్స్‌కు సుప్రీం కోర్టు ఆదేశాలు



న్యూఢిల్లీ: కష్టాల్లో కూరుకుపోయిన రియల్టీ సంస్థ జెప్రకాశ్ అసోసియేట్ రెండు వాయిదాల్లో రూ.200 కోట్లు డిపాజిట్ చేయాలని బుధవారం సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా ఆధ్వర్యంలోని ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేయగా.. మే 10 నాటికి ఈ డిపాజిట్ చేయాలని గడువు విధించింది. గృహనిర్మాణ ప్రాజెక్టులో ఫ్లాట్ల కొనుగోలుకు డబ్బులు చెల్లించిన వారికి ఇళ్లు కట్టించనందున వారికి తిరిగి చెల్లించాల్సిందిగా న్యాయస్థానం ఆదేశించింది. రెండు దఫాలుగా ఈ రూ.200కోట్లు చెల్లించాల్సిందిగా సూచించింది. రియల్ ఎస్టేట్ కంపెనీ ఏప్రిల్ 6 నాటికి రూ.100 కోట్లు, మిగతా మే 10 నాటికి చెల్లించాలని కోర్టు ఆదేశించింది. అలాగే ఇప్పటి వరకు ఎంతమంది ఇళ్ల కొనుగోలుదారులు నిధులు వాపసు కోరుతున్నారనే దానికి సంబంధించిన పూర్తి జాబితాను అందజేయాల్సిందిగా జెపి అసోసియేట్‌కు కోర్టు సూచించింది. ఈ కేసు తదుపరి విచారణను ఏప్రిల్ 16కు వాయిదా వేసింది. జేపీ ఇన్‌ఫ్రా ప్రాజెక్టు కింద ఇళ్లను కట్టిస్తామని చెప్పి సరైన సమయానికి వాటిని అప్పగించకపోవడంతో కొనుగోలుదారులు తాము చెల్లించిన డబ్బులను తిరిగి ఇవ్వాలని కోరుతూ కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం జెఎఎల్(జై ప్రకాశ్ అసోసియేట్ లిమిటెడ్)ను రూ.2000కోట్లు జమ చేయాలని సుప్రీంకోర్టు గతంలో ఆదేశించింది. అనంతరం విడతలుగా ఈ మొత్తాన్ని జమ చేసేందుకు కంపెనీ అంగీకరించింది. మరోవైపు మొత్తం 31 వేల కొనుగోలుదార్లలో 8 శాతం మంది మాత్రమే నిధులు వాపసు కోరుతున్నారని కోర్టుకు తెలియజేసింది.

సూచీలు మరింత పతనమవుతాయ్

10 వేల దిగువకు నిఫ్టీ: నిపుణులు

ముంబై: స్టాక్‌మార్కెట్ సూచీలు 10 శాతం మేర పతనమయ్యాయి. బడ్జెట్ సమావేశాల తర్వాత ఫిబ్రవరిలో ప్రారంభమైన బేర్స్ పట్టు మార్కెట్లపై క్రమంగా బిగుసుకుంటూ వస్తోంది. జనవరిలో సూచీలు ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరగా, ఇప్పుడు పతనమవుతూ వస్తున్నాయి. దేశీయ, అంతర్జాతీయ పరిణామాలు మార్కెట్లను ప్రభావితం చేస్తున్నాయి. ప్రధానంగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం మరింతగా మార్కెట్లను కృంగదీస్తోంది. ప్రతికూల ప్రకంపనలు ఇప్పట్లో ఆగవని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రాబోయే ఎన్నికలు, అంతర్జాతీయ పరిణామాలు, దేశీయ సూచీలను కుంగదీస్తున్నాయని షేర్‌ఖాన్ అభిప్రాయపడింది. ఈ దిద్దుబాటు 9800 పాయింట్ల వరకు కొనసాగవచ్చని తెలిపింది. 10 వేల పాయింట్లకు దిగువన మరింత లోతైన పతనం ఉంటుందని, స్మాల్, మిడ్‌క్యాప్ విభాగాల్లో ఆచితూచి వ్యవహరించాలని రెలిగేర్ బ్రోకరేజ్ సూచించింది.

గూగుల్‌ను అధిగమించిన అమెజాన్ స్టాక్



న్యూయార్క్: ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్.. సెర్చ్ ఇంజిన్ దిగ్గజం గూగుల్ పేరెంట్ కంపెనీ ఆల్ఫాబెట్‌ను అధిగమించింది. గూగుల్ బీట్ చేసిన ఈ కంపెనీ అమెరికా లిస్టెడ్ కంపెనీల్లో రెండో అత్యంత విలువైన కంపెనీగా నిలిచింది. అమెజాన్ షేర్లు 2.69 శాతం పెరగడంతో ఈ కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ 768 బిలియన్ డాలర్లకు పెరిగింది. అదే సమయంలో ఆల్ఫాబెట్ షేర్లు 0.39 శాతం నష్టపోయాయి. దీంతో ఆల్ఫాబెట్ గూగుల్ మార్కెట్ క్యాపిటలైజేషన్ 762 బిలియన్ డాలర్లుగా నమోదైంది. అమెజాన్, ఆల్ఫాబెట్ గూగుల్‌ను బీట్ చేయడం ఇదే తొలిసారి. గత ఏడాదిగా అమెజాన్ స్టాక్ 81 శాతం పెరిగింది. తన కంప్యూటింగ్ ఆపరేషన్లను క్లౌడ్‌లోకి మార్చడంతో, ఈ కంపెనీ వేగంగా రెవెన్యూ వృద్ధిని నమోదు చేసింది.

అమెజాన్ వెబ్ సర్వీసులు కూడా మార్కెట్‌లో ఆధిపత్య స్థానంలో ఉన్నాయి. అయితే ప్రపంచంలో అత్యంత విలువైన లిస్టెడ్ కంపెనీగా 889 బిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో ఆపిల్ మొదటి స్థానంలో ఉంది. కాగా ఇటీవల అమెజాన్ అధినేత బెజోస్ అత్యంత సంపన్నుడిగా మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌ను మించిపోయిన విషయం తెలిసిందే.

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం %
భారతి ఎయిర్‌టెల్	420.15	402.20	418.20	400.40	17.80	4.45
బజాజ్ ఫైనాన్స్	1,712.00	1,665.50	1,704.55	1,657.30	47.25	2.85
ఎన్‌టిపిసి	170.85	165.65	170.35	166.40	3.95	2.37
అల్ట్రాటెక్ సిమెంట్	4,054.00	3,958.45	3,999.20	3,936.80	62.40	1.59
ఇండియాబుల్స్	1,244.00	1,204.05	1,216.40	1,198.30	18.10	1.51
బిపిసిఎల్	434.50	424.75	430.65	424.90	5.75	1.35
లార్సెన్	1,313.60	1,295.00	1,309.35	1,293.50	15.85	1.23
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు	1,863.20	1,843.30	1,858.90	1,839.50	19.40	1.05
యాక్సిస్ బ్యాంకు	532.50	522.50	526.30	521.10	5.20	1.00
హెచ్‌డిఎఫ్‌సి	1,830.40	1,803.60	1,817.85	1,800.05	17.80	0.99

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం %
టాటాస్టీల్	601.70	580.50	582.25	593.00	10.75	1.81
అదానీ పోర్ట్స్	373.75	362.30	363.70	370.00	6.30	1.70
బోస్క్	17,974.00	17,551.00	17,585.65	17,876.75	291.10	1.63
టాటామోటార్స్	342.25	332.25	333.85	338.80	4.95	1.46
హీరో మోటోకార్ప్	3,529.95	3,455.55	3,463.60	3,513.80	50.20	1.43
జీ ఎంటర్‌టైన్	579.80	564.75	566.85	575.10	8.25	1.43
భారతి ఇన్‌ఫ్రాటెల్	345.80	336.30	337.15	341.90	4.75	1.39
ఐచర్ మోటార్స్	28,489.00	27,830.00	27,980.85	28,360.45	379.60	1.34
అరబిందో ఫార్మా	576.75	560.00	564.20	571.60	7.40	1.29
హిందాల్కో	219.85	213.30	214.70	217.30	2.60	1.20

రాజా, కనిమొళికి ఢిల్లీ హైకోర్టు నోటీసులు



న్యూఢిల్లీ: 2జి స్పెక్ట్రం కేసులో మాజీ టెలికామ్ మంత్రి ఎ.రాజా, డిఎంకె ఎంపి కనిమొళి, మరి 17 మంది ఇతరులు నిర్దోషులంటూ ఇటీవల సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు చెప్పడాన్ని సవాలు చేస్తూ ఇడి మార్చి 19న, సిబిఐ మంగళవారం ఢిల్లీ హైకోర్టుకు వెళ్లాయి. దాంతో మే 25న జరగనున్న తదుపరి విచారణ తేదీకల్లా ప్రతిస్పందనలు దాఖలు చేయాలని ఢిల్లీ హైకోర్టు రాజా, కనిమొళి తదితరులకు నోటీసులు జారీ చేసింది. ఇడి తన అభియోగపత్రంలో స్వాన్ టెలికామ్ ప్రై.లి.(ఎస్‌టిపి ఎల్) రూ. 200 కోట్లను డిఎంకె నడిపించే కళైజర్ టివికి ఇచ్చిందని ఆరోపించింది. కాగా 2జి స్పెక్ట్రం లైసెన్సుల కేటాయింపులో ఖజానాకు రూ. 30,984 కోట్ల నష్టం వాటిల్లిందని, తర్వాత ఆ కేటాయింపులను సుప్రీంకోర్టు 2012 ఫిబ్రవరి 2న కొట్టేసిందని సిబిఐ ఆరోపించింది. ఈ కేసుకు సంబంధించి గతేడాది డిసెంబరులో సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం అనూహ్య తీర్పు వెల్లడించింది. ఈ కేసులో రాజా, కనిమొళితో పాటు నిందితులందరినీ నిర్దోషులుగా ప్రకటించింది. నిందితులపై నమోదైన ఆరోపణలను రుజువు చేయడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని న్యాయస్థానం ఆ సందర్భంగా వ్యాఖ్యానించింది. దీంతో ఈ కేసు నుంచి వారంతా బయటపడ్డారు.

కాంగ్రెస్‌కు ఫేస్‌బుక్ బురద?

కేంబ్రిడ్జ్ అనలిటికాతో సంబంధాలున్నాయని
బిజెపి ఆరోపణ, ఫేస్‌బుక్‌కూ హెచ్చరికలు
కొట్టిపారేసిన కాంగ్రెస్


రవిశంకర్ ప్రసాద్



న్యూఢిల్లీ : సోషల్ మీడియా దిగ్గజం ఫేస్‌బుక్‌పై ఆరోపణలు ఉధృతమవుతున్నాయి. ఫేస్‌బుక్ యూజర్ల డేటాను దొంగిలించిన కేంబ్రిడ్జ్ అనలిటికాతో కాంగ్రెస్‌కు కూడా లింకులున్నాయని బిజెపి ఆక్షేపించింది. ఈ విషయమై తాము కఠిన చర్యలు తీసుకోవడానికైనా సిద్ధమేనని బిజెపి అధికార ప్రతినిధి, కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ హెచ్చరించారు. సమాచారాన్ని దొంగిలించి కాంగ్రెస్ పార్టీ తన ప్రయోజనాల కోసం వాడుకుందని, ఎన్నికల్లో గెలువడానికి డేటాను తారుమారు చేసిందని విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్, పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సోషల్ మీడియా మేనేజ్‌మెంట్‌లో ఆ డేటా సంస్థ పాత్రను రవి శంకర్ ప్రసాద్ ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలిచేందుకు ఫేస్‌బుక్ యూజర్ల డేటాను దొంగతనం చేయడం, తారుమారు చేయడం వంటి వాటికి కాంగ్రెస్ పార్టీ పాల్పడుతోందన్నారు. 'డేటాను దొంగిలించడం లేదా తారుమారు చేసి గెలవడంపైనే కాంగ్రెస్ పార్టీ ఆధారపడుతుందా? అలా అయితే రాహుల్ గాంధీ గెలుపొందితే అందులో కేంబ్రిడ్జ్ అనలిటికా పాత్ర ఏమిటి? ఎంత మంది భారతీయుల సమాచారాన్ని కేంబ్రిడ్జ్ అనాలిటికా సిఇఒకు కాంగ్రెస్ ఇచ్చిందో చెప్పాలి' అని రవిశంకర్ ప్రసాద్ డిమాండ్ చేశారు. అదే సమయంలో 'ఫేస్‌బుక్'కు మంత్రి ప్రసాద్ హెచ్చరికలు జారీ చేశారు. అవాంఛనీయ పద్ధతుల్లో దేశ ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా పత్రికా స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛకు ప్రభుత్వం ఎప్పటికీ మద్దతు ఇస్తుందని అన్నారు. దేశంలో 20 కోట్ల మంది ఫేస్‌బుక్‌ను ఉపయోగిస్తున్నారని ఆయన చెప్పారు. అమెరికా బయట దానికి ఉన్న అతిపెద్ద మార్కెట్ ఇండియానేనని వివరించారు. డేటా ఉల్లంఘన జరిగినట్లు ఏమాత్రం వెలుగుచూసినా ఐటి చట్టం కింద అధికారాన్ని ఉపయోగించి కఠిన చర్యలు చేపట్టగలమని ఫేస్‌బుక్ సిఇఒ జుకర్‌బర్గ్‌ను ఆయన హెచ్చరించారు. 2016లో అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో ఫేస్‌బుక్ యూజర్ల డేటాను కేంబ్రిడ్జ్ అనలిటికా చోరీ చేసినట్టు అమెరికా, బ్రిటన్ మీడియాలో కథనాలు వచ్చాయి. ట్రంప్ ఎన్నికల ప్రచారం కోసం పనిచేసిన ఈ కన్సల్టెన్సీకి ఫేస్‌బుక్ వినియోగదారుల వివరాలు ఎలా లభించాయన్న అంశంపై ఫేస్‌బుక్ సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్ వివాదంలో చిక్కుకున్నారు. దీనిపై వివరణ ఇవ్వాల్సిందిగా అమెరికా, ఐరోపా విచారణ సంస్థలు ఆదేశాలు జారీచేశాయి.

కాంగ్రెస్ నేతల ఖండన...

కేంబ్రిడ్జ్ అనలిటాకు, కాంగ్రెస్ పార్టీకి సంబంధాలున్నాయన్న ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ ఖండించింది. అనలిటికాతో కాంగ్రెస్‌కు సంబంధాలున్నా ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అధినేత దివ్య స్పందన ట్వీట్ చేశారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణదీప్ సుర్జేవాలా మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కేంబ్రిడ్జ్ అనలిటికా సంస్థ సేవలను ఎన్నడూ ఉపయోగించుకోలేదన్నారు. ఆ సంస్థతో తమకు సంబంధాలు ఉన్నాయని బిజెపి తప్పుడు ఎజెండాతో ఆరోపణలు చేస్తోందన్నారు. ఆ పార్టీ నేత, కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ పచ్చి అబద్ధాలు చెప్తున్నారని విమర్శించారు. కేంబ్రిడ్జ్ అనలిటికా వెబ్‌సైట్‌ను చూస్తే 2010లో బిజెపి, జెడియు పార్టీలు ఆ సంస్థ సేవలను వినియోగించుకున్నట్లు వెల్లడవుతోందని సుర్జేవాలా అన్నారు. ఆ సంస్థకు చెందిన భారతీయ భాగస్వామి ఒవ్లీన్ బిజినెస్ ఇంటెలిజెన్స్‌ను బిజెపి మిత్ర పక్ష పార్టీ ఎంపి కుమారుడు నడుపుతున్నారన్నారు. ఈ కంపెనీ సేవలను 2009లో రాజ్‌నాథ్ సింగ్ ఉపయోగించుకున్నారని పేర్కొన్నారు.


బుధవారం కర్నాటకలోని చిక్ మంగళూరులో శృంగేరీమఠం పీఠాధిపతి జగద్గురు శంకరాచార్యులను కలిసిన రాహుల్

కేంబ్రిడ్జి అనలిటికా సిఇఒ సస్పెండ్



లండన్: ఫేస్‌బుక్ డేటా కుంభకోణంలో కేంబ్రిడ్జ్ అనలిటికా కేంద్ర బిందువుగా మారింది. ఉల్లంఘన కారణంగా సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్ నుంచి శాసనకర్తలు జవాబులు కోరిన నేపథ్యంలో బ్రిటన్‌లోని కేంబ్రిడ్జ్ అనలిటికా సంస్థ తన చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సిఇఒ) అలెగ్జాండర్ నిక్స్‌ను సస్పెండ్ చేసింది. 'ఆయన సస్పెన్షన్ ఎంత తీవ్ర విషయమో వెల్లడిస్తోంది' అని కంపెనీ తన ప్రకటనలో పేర్కొంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఫేస్‌బుక్‌లోని 5కోట్ల మంది డేటాను దుర్వినియోగం చేసిందన్న ఆరోపణను అనలిటికా సంస్థ ఖండించింది. అయినప్పటికీ వివాదం చిలికిచిలికి కుంభకోణంలా రూపాంతరం చెందింది.

'ఫేస్‌బుక్'కు టాటా చెప్పాల్సిన సమయం: ఫేస్‌బుక్ సొంతమైన వాట్సాప్ సహ వ్యవస్థాపకుడు బ్రియాన్ ఆక్టాన్ సంచలనాత్మక ట్వీట్ చేశారు. ఇక ఫేస్‌బుక్‌కు టాటా చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది(ఇట్స్ టైం.. డిలిట్ ఫేస్‌బుక్) అంటూ తన ఫాలోయర్స్‌ను ఉద్దేశించి బ్రియాన్ ట్విట్ చేశారు. రూ.5 కోట్ల వినియోగదారుల డేటాను విక్రయించిందన్నఆరోపణలతో ఫేస్‌బుక్ సతమతమవుతున్న నేపథ్యంలో తాజా ట్వీట్ ప్రకంపనలు రేపుతోంది. అంతేకాదు బ్రియాన్ ట్వీట్‌తో ట్విటర్‌లో డిలిట్ ఫేస్‌బుక్ హ్యాష్‌ట్యాగ్‌కు భారీ మద్దతు లభిస్తోంది. ఆయనకు దాదాపు 21వేల మంది ట్విటర్ ఫాలోవర్స్ ఉన్నారు. 2014లోసుమారు 19 బిలియన్ డాలర్లతో వాట్సాప్‌ను ఫేస్‌బుక్ సొంతం చేసుకుంది.

తమిళనాట మరో నీరవ్

● కనిష్క్ గోల్డ్ రూ.824కోట్ల కుంభకోణం! ● డైరెక్టర్లు భూపేశ్ కుమార్, భార్య నీతాపై ఫిర్యాదు





చెన్నై: మరో ఆభరణాల సంస్థ అవినీతి బట్టబయలైంది. ఎస్‌బిఐ సహా 14 బ్యాంకులకు కనిష్క్ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ సుమారు రూ.824.15కోట్ల మేర ఎగవేసింది. దీనిపై సిబిఐకి ఎస్‌బిఐ ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. నీరవ్ మోడీ, లలిత్ మోడీ, అగర్వాల్ తదితరుల కుంభకోణాలకు సంబంధించిన వ్యవహారంపై దేశవ్యాప్తంగా దుమారం చెలరేగుతుండగా తాజాగా తమిళనాడు కేంద్రంగా కనిష్క్ బ్యాంకులకు పెట్టిన కుచ్చుటోపీ బాగోతం బయటికి వచ్చింది. చెన్నైలోని కనిష్క్ గోల్డ్ డైరెక్టర్లు భూపేష్ కుమార్, ఆయన భార్య నీతా జైన్‌పై సిబిఐకి ఎస్‌బిఐ ఫిర్యాదు చేసింది. ఎస్‌బిఐతో పాటు 14 కన్సార్టియం బ్యాంకుల వద్ద నుంచి కనిష్క్ జ్యూయలరీ దాదాపు రూ.800కోట్లకు పైగా రుణాలు తీసుకొని ఎగ్గొట్టింది. రాత్రికి రాత్రే వాళ్లు దుకాణాలన్నింటినీ మూసివేసి, రికార్డులను కూడా మాయం చేసినట్లు ఎస్‌బిఐ తన ఫిర్యాదులో పేర్కొంది. రుణం మొత్తానికి వడ్డీ కలిపితే అది కాస్తా రూ.1000కోట్ల మేర ఉంటుందని తెలుస్తోంది. గతేడాది నవంబరులో ఎస్‌బిఐ కనిష్క్ జ్యూయలరీ యజమానిని రుణ ఎగవేతదారుడిగా ప్రకటించింది. రుణాలు వసూలు చేసేందుకు బ్యాంకులు ప్రయత్నిస్తుండగా అసలు వాళ్ల ఆచూకీ తెలియడం లేదు. భూపేష్, నీతా జైన్‌లు మారిషస్ పారిపోయి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. దీనిపై సిబిఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. గతేడాది ఏప్రిల్ నుంచి 'కనిష్క్' రుణాలు తీసుకున్న 14 బ్యాంకులకు డబ్బులు కట్టడం నిలిపివేసింది. ఇదేంటని ప్రశ్నించేందుకు బ్యాంకు అధికారులు ఆయా దుకాణాల వద్దకు వెళ్లగా అవన్నీ మూసేసి కనిపించాయి. ఎస్‌బిఐ రూ.215కోట్లు, పంజాబ్ నేషనల్ బ్యాంకు రూ.115కోట్లు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.50కోట్లు, సిండికేట్ బ్యాంకు రూ.50కోట్లు, బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.45కోట్లు, ఐడిబిఐ, యూకో, తమిళనాడ్ మర్కంటైల్ బ్యాంక్, ఆంధ్రాబ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్‌డిఎఫ్‌సి, ఐసిఐసిఐ, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్పొరేషన్ బ్యాంక్‌లు కోట్ల మేర కనిష్క్‌కు రుణాలు ఇచ్చాయి.

సరిహద్దుల్లో హోరాహోరీ

ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు ఉగ్రవాదులు హతం, మరో ఐదుగురు జవాన్ల వీరమరణం



శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌కు చెందిన సరిహద్దు కుప్వారా జిల్లాలోని దట్టమైన అడవిలో బుధవారం ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు ఐదుగురు సైనిక జవానులు మరణించారని అధికారులు చెప్పారు. ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు తీవ్రవాదులు కూడా హతమయ్యారన్నారు. మంగళవారం నుంచి ఈ ఎన్‌కౌంటర్ కొనసాగుతున్నది. కుప్వారా జిల్లా ప్రధానకేంద్రానికి 12 కిమీ. దూరంలో ఉన్న అరంపోరా అడవుల్లో ఈ ఎదురుకాల్పులు మంగళవారం మొదలయ్యాయి. అయితే చనిపోయిన సైనికులెంత మందనేది అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఈ ఎన్‌కౌంటరు నిఘా లోపాలను ఎత్తి చూపింది. తీవ్రవాదుల గ్రూపు శామ్‌సబరి పర్వత శ్రేణువులలోని 8కిమీ. మేర రెండు కొండలను దాటుకుని మరీ చొరబడింది. వారు కుప్వారా వైపుకు కదులుతుండగా పోలీసు సిబ్బంది గుర్తించింది. మసీదులో దాక్కున తీవ్రవాదులు ఎన్‌కౌంటర్ మొదలు కావడంతో అడవుల వైపుకు పరుగులు తీశారు. కానీ వారిలో ఐదుగురిని భద్రతా సిబ్బంది మట్టుబెట్టింది. మిగిలి ఉన్న తీవ్రవాదులు ఎత్తు ప్రదేశంలో తమను తాము కవర్ చేసుకుంటూ కాల్పులు జరుపుతున్నారు. అయితే భద్రతా బలగాలు వారి సమీపానికి సాగుతున్నారు.

అవిశ్వాసం అటకెక్కినట్లే..!

లోక్ సభలో కొనసాగిన టిఆర్‌ఎస్, అన్నాడిఎంకె నిరసన

అవిశ్వాసంపై చర్చకు రెడీ : కేంద్ర మంత్రి అనంతకుమార్

మన తెలంగాణ/న్యూఢిల్లీ: లోక్‌సభలో బుధవారం కూడా మళ్లీ అదే సీన్ పునరావృతమైంది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న తీరు ఏమాత్రం మారడం లేదు. ఇరుసభల్లోనూ వాయిదాల పర్వం కొనసాగుతోంది. బుధవారం లోక్ సభ, రాజ్యసభలు ప్రారంభమైన క్షణాల్లోనే వాయిదా పడ్డాయి. లోక్‌సభ ఉదయం 11గంటలకు ప్రారంభం అయిన తరువాత కనీసం ఐదు నిమిషాలు కూడా జరగకుండానే మధ్యాహ్నం 12గంటల వరకు వాయిదా పడింది. రిజర్వేషన్ల అంశంపై టిఆర్ఎస్, కావేరి అంశంపై అన్నాడిఎంకె ఎంపిలు వెల్‌లోకి వస్తూ ప్రశ్నోత్తరాల సమయంలో, అదే విధంగా జీరో అవర్‌లో కూడా నిరసన తెలుపుతున్నారు. మధ్యాహ్నం 12గంటలకు లోక్ సభ తిరిగి ప్రారంభం కాగానే స్పీకర్ అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నోటీసులను చదువుతున్న సమయంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత కుమార్ బుధవారం లోక్‌సభలో కీలక ప్రకటన చేశారు. విశ్వాస పరీక్షను ఎదుర్కోవడానికి మోడీ సర్కార్ సిద్ధంగా ఉందని, ఓటింగ్‌లోనూ నెగ్గుతామని, అయితే చర్చ జరగాలంటేమాత్రం సభ ఆర్డర్‌లో ఉండి తీరాల్సిందేనని మంత్రి అన్నారు. 'సభ్యులంతా మీమీ స్థానాల్లో కూర్చుంటే ఎలాంటి చర్చనైనా చేపట్టొచ్చు. అవిశ్వాసం తీర్మానంలో మేమే గెలుస్తాం. సభ సజావుగా జరిగేలా అందరూ సహకరించాలని స్పీకర్ ద్వారా కోరుతున్నాను'' అని అనంతకుమార్ పేర్కొన్నారు. అనంతరం సభ్యులు ఆందోళన విరమించి చర్చకు సహకరించాలని స్పీకర్ సుమిత్రా మహాజన్ కోరారు. అయినా అన్నాడిఎంకె, టిఆర్ఎస్ సభ్యులు వెనక్కి తగ్గలేదు. దీంతో నిరసనల మధ్య అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నోటీసులపై నిర్ణయం తీసుకోలేనంటూ స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను గురువారానికి వాయిదా వేశారు. మరో వైపు స్పీకర్ అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నోటీసులను సభలో ప్రస్తావిస్తున్న సందర్భంగా కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీల ఎంపిలు, తృణమూల్ కాంగ్రెస్, ఎన్సీపి, టిడిపి, వైఎస్సార్ పార్టీల ఎంపిలు దాదాపు 70మంది వరకు చేతులు పైకెత్తి తాము అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇస్తున్నామని, తమను స్పీకర్ గమనించాలని వారు కోరినా ప్రయోజనం లేకపోయింది. అంతకముందు పార్లమెంటు ఆవరణలో తెలుగు దేశం పార్టీకి చెందిన ఎంపిలు , వైఎస్సార్ పార్టీకి చెందిన ఎంపిలు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వారు నినాదాలు చేశారు. అనంతరం టిడిపి ఎంపి కేశినేని నాని మాట్లాడుతూ బిజెపికి సభ నడపడం ఇష్టం లేదని అన్నారు. ఇప్పటికి కేంద్ర ప్రభుత్వం ఏర్పడి 45 నెలలు పూర్తికావస్తుంటే నేటికీ చాలా సమస్యలను పెండింగ్‌లో పెట్టారన్నారు. దీనిపై చర్చ చేపట్టడం మోడీకి కానీ.. బిజెపికి కానీ ఇష్టం లేదన్నారు. మొదటి నుంచి సభను ఆర్డర్‌లో పెట్టాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉందన్నారు. కావాలని స్టేజ్ మేనేజ్‌మెంట్ చేసి చర్చ రానీయకుండా చేస్తున్నారని కేశినేని నాని ఆరోపించారు. చిత్తూరు ఎంపి శివప్రసాద్ సత్య హరిశ్చంద్రుడి గెటప్‌లో పార్లమెంట్‌కు హాజరయ్యారు. టిఆర్ఎస్, ఎఐఎడిఎంకె ఎంపిల ఆందోళలనను తప్పుపట్టలేం. ఎందుకంటే సభ ఆర్డర్‌లో లేనప్పుడు కూడా ప్రభుత్వం ఆర్థిక బిల్లులను ఆమోదించుకుంది. అవిశ్వాసంపై మాత్రం ద్వంద్వ విధానాన్ని అవలంబిస్తోంది.



స్పీకర్ సుమిత్రతో టిఆర్‌ఎస్ ఎంపిల భేటీ

దాదాపు 13 రోజుల నుంచి రిజర్వేషన్‌ల పెంపు మీద హక్కు రాష్ట్రాలకే ఉండాలని నిరసన తెలుపుతున్నా కేంద్రం నుంచి ఎలాంటి స్పందన రావడం లేదని టిఆర్‌ఎస్ ఎంపిలు ఆరోపించారు. బుధవారం లోక్ సభ సమావేశం కాగానే స్పీకర్ పోడియం వద్దకు చేరుకొని నినాదాలు ఇస్తూ ఆందోళన నిర్వహించారు. అనంతరం వారు లోక్ సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ తో సమావేశం అయ్యారు. రిజర్వేషన్ల అంశంపై కేంద్ర ప్రభుత్వంతో ప్రకటన చేయించాలని కోరారు. స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు. తిరిగి మధ్యాహ్నం 12గంటలకు సభ ప్రారంభం కాగానే మరోమారు వెల్‌లోకి దూసుకు వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపిలు బూర నర్సయ్య గౌడ్, సీతారాం నాయక్‌లు మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ దేవాలయం లాంటిదని, మేము డిమాండ్ చేస్తున్న వాటిపై స్పందించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని నర్సయ్య గౌడ్ అన్నారు. అనంతరం ఎంపి సీతారాం నాయక్ మాట్లాడుతూ బిజెపి ఒక వ్యూహం పెట్టుకుంది లోక్ సభను 11 గంటల నుండి 12 గంటలకు, తర్వాత సభను వాయిదా వేస్తుందని అన్నారు. మీ ప్రయోజనాల కోసం మమ్మల్ని ఎందుకు బలి చేస్తున్నారని కేంద్రాన్ని ప్రశ్నించారు. మాది కొత్తగా ఏర్పడిన రాష్ట్రం. మా రాష్ట్రం కొరకు మేము పోరాడుతున్నాం. మేము ఆంధ్ర మిత్రులకు అన్యాయం చేయడం లేదన్నారు. సభ కార్యక్రమాలకు మా పార్టీ నేతలే అడ్డ తగులుతున్నారని కేంద్రం భావిస్తే దమ్ముంటే సస్పెండ్ చేయండి చూద్దాం అంటూ సవాల్ విసిరారు.

బిజెపి నేత ఇంటిపై బాంబు దాడి

కోయంబత్తూరు: తమిళనాడులోని కోయంబత్తూర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు నందకుమార్ ఇంటిపై దుండగులు బాంబులు విసిరారు. ఈ ఘటనలో ఎవరు గాయపడలేదని పోలీసులు తెలిపారు. ఇంటి ముందు పార్క్ చేసిన కారు ధ్వంసమైంది. నందకుమార్ ఇంట్లో నిద్రిస్తుండగా బుధవారం తెల్లవారు జామున 3 గంటలకు ఘటన జరిగింది.పుదుకొట్టైలో పెరియార్ విగ్రహం ధ్వంసం చేసిన తర్వాత రోజు ఘటన చోటు చేసుకుంది. దుండగుల ఆచూకీ తెలుసుకునేందుకు సిసి కెమెరాలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీగా పోలీసులను మోహరించారు. అయోధ్యలో రామాలయం నిర్మాణానికి విహెచ్‌పి చేపట్టిన 'రామ్ రామరాజ్య రథ యాత్ర' మంగళవారం తిరునల్వేలికి చేరుకుంది. పెరియార్ విగ్రహం ధ్వంసానికి వ్యతిరేకంగా లేదా విహెచ్‌పి రథయాత్రకు వ్యతిరేకంగా దుండగులు ఈ ఘాతుకానికి పాల్పడి ఉండొచ్చని పోలీసులు తెలిపారు.

టైమ్ జోన్లపై నిర్ణయం తీసుకోలేదు

న్యూఢిల్లీ: దేశంలో వేర్వేరు టైమ్ జోన్ల ఏర్పాటుకు సంబంధించి ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని ప్రభుత్వం తెలిపింది. దేశంలో ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాలకు సంబంధించి రెండు టైమ్ జోన్ల ఏర్పాటుపై బుధవారం లోక్‌సభలో ఎంపి వరుణ్ గాంధీ అడిగిన ప్రశ్నకు శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి హర్షవర్ధన్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 2002లో ప్రభుత్వం నియమించిన అత్యున్నత కమిటీ రెండు టైమ్ జోన్ల ఏర్పాటుకు సిఫార్సు చేయలేదని తెలిపారు. ఈ ప్రక్రియ ఎంతో సంక్లిష్టతతో కూడుకొని ఉందన్నారు. ప్రపంచంలో అనేక దేశాలు వివిధ కారణాలతో ఆర్థిక, ఉత్పాదకత దృష్ట్యా బహుళ టైమ్ జోన్లు ఏర్పాటు చేసుకున్నాయి. అమెరికాలో ఏడు, రష్యాలో 11 టైమ్ జోన్లు ఉండగా, చైనా, భారత్‌లో ఒక్కో టైమ్ జోన్ మాత్రమే ఉంది. దీని వల్ల తూర్పు, ఈశాన్య భారతదేశం వెనుకబడిపోతోందన్న వాదనలున్నాయి.

బిజెపితో జతకట్టం : పళనిస్వామి




చెన్నై : బిజెపి కూటమితో ఎఐఎడిఎంకె జతకట్టబోదని, ఎలాంటి మద్దతును ఇవ్వబోదని ఆ పార్టీ నేత, తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి రాష్ట్ర అసెంబ్లీకి వెల్లడించారు. కావేరీ మేనేజ్‌మెంట్ బోర్డును తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ ఆ దిశగా ఒత్తిడి చేయకుండా బిజెపి నేతృత్వంలోని కేంద్రంపై ఎఐఎడిఎంకె మెతక వైఖరిని అవలంబిస్తుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న నేపథ్యంలో పళని స్వామి పై విధంగా వ్యాఖ్యానించారు. తాము బిజెపి కూటమిలో చేరబోమని, ఎలాంటి మద్దతునూ ప్రకటించబోమని బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీలో సిఎం వివరణ ఇచ్చారు.

తుది అంకానికి నక్సలిజం : రమణ్‌సింగ్

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజం తుది అంకానికి చేరుకుందని సిఎం రమణ్ సింగ్ బుధవారం స్పష్టం చేశారు. తీవ్ర నిరాశలో కూరుకుపోయిన మావోయిస్టులు రాష్ట్రంలో చెదురుమదురు దాడులకు పాల్పడుతున్నారన్నారు. అయితే ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ దాడులు తగ్గుముఖం పట్టాయని సిఎం తెలిపారు. వాళ్ల పాతి పెట్టిన శక్తివంతమైన పేలుడు పదార్థాలను కనుక్కోవడమే కష్టతరంగా మారిందన్నారు. రాష్ట్రంలో ఒకటి, రెండు నక్సల్స్ దాడులు జరగవచ్చని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలను చూసి తీవ్ర నిరాశకు గురయ్యే దాడులు జరుపుతున్నారని రమణ్ సింగ్ మీడియాకు వెల్లడించారు. కాగా, ఐఇడి పేలుడులో 9 మంది జవాన్లు మృత్యువాత పడిన వారం రోజుల తరువాత రమణ్‌సింగ్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. తమ ప్రభుత్వం నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి పనులను చేపడుతుందన్నారు. ఐదేళ్ల క్రితం సుక్మా, బీజాపూర్, దంతేవాడలోని కొన్ని ప్రాంతాల్లోకి వెళ్లేందుకు కష్టతరంగా ఉండేదని, కాని ఇప్పుడు ఆ ప్రాంతాలకు బైక్‌లు, కార్లలో వెళ్లవచ్చునన్నారు.

కాంగ్రెస్ యుపి చీఫ్ రాజీనామా



లక్నో : కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ పిలుపు మేరకు పార్టీలోని వయోధిక నాయకులు రాజీనామాలు చేస్తున్నారు. గోవా పిసిసి అధ్యక్షుడు శాంతారామ్ నాయక్ పదవికి రాజీనామా చేసిన ఒక్కరోజు తర్వాత అంటే బుధవారం నాడు ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజ్ బబ్బర్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో మాజీ కేంద్ర మంత్రి జితిన్ ప్రసాదను నియమించనున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ మాజీ ఎంపి రాజేశ్ మిశ్ర, మాజీ ఎంఎల్‌ఎ లలితేశ్‌పతి త్రిపాఠితోపాటు పలువురి పేర్లు చర్చకు వచ్చినప్పటికీ జితిన్ ప్రసాద పేరు ముందు వరుసలో ఉన్నట్లు సమాచారం. అయితే రాజ్‌బబ్బర్ రాజీనామాను కాంగ్రెస్ అధిష్ఠానం ఇంకా ఆమోదించలేదు.

ఇంటి వద్దకే డీజిల్, పెట్రోల్!

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద చమురు కంపెనీ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఒసి) డీజిల్‌ను ఇంటి వద్దకే తెచ్చే సదుపాయాన్ని తీసుకొచ్చింది. ఈ విషయాన్ని కంపెనీ ఛైర్మన్ సంజీవ్ సింగ్ వెల్లడించారు. 'డోర్ డెలివరీ కింద డీజిల్ తీసుకొచ్చే విధానాన్ని తొలిసారి ప్రయోగాత్మకంగా పుణెలో ప్రారంభించాం. ప్రజల నుంచి మంచి స్పందన వస్తే మరిన్ని నగరాలకు విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నాం. మూడు నెలల పాటు ఈ ప్రాజెక్టును ప్రయోగాత్మకంగా చేపడతాం. పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్ నుంచి క్లియరెన్స్ పొంది ఇంటికే డీజిల్ వచ్చే సదుపాయాన్ని తీసుకొచ్చిన తొలి కంపెనీ మాదే' అని సింగ్ పేర్కొన్నారు. త్వరలోనే పెట్రోల్ కూడా ఇంటి వద్దకే తీసుకొచ్చే సదుపాయాన్ని తీసుకొస్తామని ఆయన తెలిపారు. డీజిల్ వినియోగం ఎక్కువగా ఉండే ప్రాంతాలైన షాపింగ్ మాల్స్, ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలు, అత్యధికంగా డీజిల్ వినియోగం చేసే సంస్థల అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ సదుపాయాన్ని తీసుకొచ్చామన్నారు.





మొక్కజొన్న అమ్మకాలకు మళ్లీ టెండర్లు!

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలోని రైతుల దగ్గర మద్దతు ధరకు సేకరించిన మొక్కజొన్నను విక్రయించేందుకు మార్క్‌ఫెడ్‌కు కష్టాలు, నష్టాలు తప్పడంలేదు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో 183 కొనుగోలు కేంద్రాల ద్వారా క్వింటా రూ. 1425కు మొత్తంగా 30.59 లక్షల క్వింటాళ్ల మొక్కజొన్నను రాష్ట్ర ప్రభుత్వం సేకరించి గోదాముల్లో నిల్వ ఉంచింది. వాటిని మార్క్‌ఫెడ్ సంస్థ ప్రధాన కార్యాలయం అధికారులు అమ్మకానికి పెట్టి గత 20 రోజుల క్రితం ఇ–టెండర్లను ఆహ్వానించారు. రైతులకు చెల్లించిన మద్దతుధరతో పోలిస్తే క్వింటా ధర రూ.145 తగ్గించి రూ. 1280గా నిర్ణయించి టెండర్లు పిలిచారు. అయితే ఏ ఒక్క కంపెనీ, వ్యాపారి కూడా బిడ్డింగ్‌లో పాల్గొనలేదు. కొంతమంది బిడ్డింగ్ వేసిప్పటికీ క్వింటాకు రూ. 1100, రూ.1150 మాత్రమే కోట్ చేశారు. బహిరంగ మార్కెట్‌లో మొక్కజొన్న విక్రయాల ధర తక్కువగా ఉండటంతో ఈ పరిస్థితి తలెత్తిందని అధికారులు అభిప్రాయపడ్డారు. మార్క్‌ఫెడ్ ఉన్నతస్థాయి అధికారులు కొంతమంది వ్యాపారులు, కంపెనీలతో లాలూచీ పడి ఇంకా తక్కువ ధరకు బిడ్లు వేసి విక్రయాలు జరపాలని చూస్తున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. గురువారం నుంచి మళ్ళీ టెండర్లను పిలవాలని మార్క్‌ఫెడ్ నిర్ణయించింది. ఈసారి కూడా ముందుగా నిర్ణయించిన రూ.1280 ధరకే విక్రయాలు జరపనున్నట్లు పేర్కొంది.

ఏప్రిల్ 2 నుంచి హెచ్–1బి దరఖాస్తులు

● ప్రీమియం ప్రాసెసింగ్ తాత్కాలికంగా రద్దు




వాషింగ్టన్ : ఏప్రిల్ 2 నుంచి హెచ్–1బి దరఖాస్తులను అమెరికాఆమోదిస్తుంది.అయితే వర్క్ వీసా వంటి ప్రీమియం ప్రక్రియలను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఫెడరల్ సంస్థ తెలిపింది. వర్క్ వీసా అన్నది భారతీయ ఐటి నిపుణులకు చాలా ముఖ్యం.2019 ఆర్థిక సంవత్సరానికి హెచ్–1బి దరఖాస్తుల దాఖలు 2018 అక్టోబరు 1 నుంచి ఆరంభం కానున్నదని యుఎస్ సిటిజెన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్(యుఎస్‌సిఐఎస్) పేర్కొంది. 2019 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రీమియం ప్రాసెసింగ్ రద్దు చేస్తున్నట్లు తెలిపింది. భారతీయ ఐటీ నిపుణులు ఎక్కువగా ఈ వీసాల ద్వారా అమెరికా వెళ్తుంటారు. హెచ్–1బి వీసాలతో అమెరికాలోని కంపెనీలు భారత్, చైనాలాంటి దేశాల నుంచి టెక్నాలజీ నిపుణులను వేల సంఖ్యలో నియమించుకుంటున్నాయి. హెచ్–1బి తాజా దరఖాస్తులు 2019 ఆర్థిక సంవత్సరం కోసం తీసుకుంటున్నారు. 2019 సంవత్సరానికి ప్రీమియం ప్రాసెసింగ్ రద్దు చేస్తున్నామని, అయితే ఈ ఏడాదికి సంబంధించి 2018 సెప్టెంబరు 10 వరకు ప్రీమియం ప్రాసెసింగ్‌ను కొనసాగించనున్నట్లు తెలిపింది.ఈ ప్రీమియం ప్రాసెసింగ్‌కు సంబంధించి ఎలాంటి మార్పులు చేర్పులు ఉన్నా ప్రజలకు సమాచారం ఇస్తామని యూఎస్‌సిఐఎస్ స్ప ష్టంచేసింది. హెచ్–1బి వీసా దరఖాస్తుల పరిశీలన సమ యం తగ్గించేందుకే తాత్కాలికంగా ప్రీమియం ప్రాసెసింగ్‌ను నిలిపేస్తున్నామని వెల్లడించింది. గత కొన్నేళ్లుగా ప్రీమియం ప్రాసెసింగ్ దరఖాస్తులు ఎక్కువగా వస్తుండడంతో సాధారణ దరఖాస్తులు సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉండిపోతున్నాయని, వాటి పరిశీలన సమయం తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొం ది. ఏటా 65వేల హెచ్–1బి వీసాలు జారీ చేస్తారు. యూఎస్‌సిఐఎస్ వివరాల ప్రకారం 2007 నుంచి 2017 సంవత్సరాల మధ్య హెచ్–1బి వీసాల కోసం భారతీయులు అత్యధికంగా 22 లక్షల దరఖాస్తులు దాఖలు చేశారు.3లక్షలకు పైగా దరఖాస్తులతో చైనా తర్వాతి స్థానంలో ఉంది. సంవత్సరానికి హెచ్–1బి వీసాల పరిమితిని 65,000మేరకు కాంగ్రెస్(అమెరికా పార్లమెంట్) నిర్ణయించింది. మొదటి 20,000 దరఖాస్తులను అమెరికా మాస్టర్స్ డిగ్రీ లేక అంతకన్నా ఎక్కువ అర్హతలున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎన్‌ఓసిపై కేంద్ర నిర్ణయం భేష్

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న ఔషధాలు, వైద్య పరికరాలను ఇతర దేశాలకు ఎగుమతి చేసుకునేందుకు మరింత వీలు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల మంత్రి కెటిఆర్ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న ఔషధాల ఎగుమతులకు నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసి)తో నిమిత్తం లేకుండా ఎగుమతి చేసేందుకు అనుమతిస్తూ కేంద్ర వైద్యారోగ్య మంత్రిత్వశాఖహెల్త్ నిర్ణయం తీసుకుంది. దీనికి హర్షం వ్యక్తం చేసిన కెటిఆర్ దేశీయ ఔషధ పరిశ్రమకు ఈ చర్య ఎంతగానో దోహదపడుతుందన్నారు.

రేపు 'ఛలో అసెంబ్లీ' : బిజెపి



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఈనెల 23న రాష్ట్ర కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో 'ఛలో అసెంబ్లీ'ని నిర్వహించనున్నట్లు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మ ణ్ తెలిపారు. రైతు సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో లక్ష్మ ణ్ మాట్లాడుతూ దుబ్బాక ప్రాంతంలోని దుబ్బలపల్లి చర్లాపూర్, బల్వంతపూర్, రాజక్కపేటలో దాదాపు 1600 మందికిపైగా రైతులకు బ్యాంకులు నోటీసులు జారీ చేశాయని, సకాలంలో రుణాలు చెల్లించకపోతే చర్యలు తీసుకుంటామని ఆ నోటీసుల్లో హెచ్చరించారని లక్ష్మ ణ్ గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత చర్యలు, తప్పుడు విధానాలతో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. రైతాంగ సమస్యలను ప్రస్తావిస్తే సిఎం నుంచి స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా రాజకీయంగా ఎదురుదాడి వస్తోందన్నారు. ఈ సమావేశంలో బిజెపి నేతలు జి. ప్రేమేందర్ రెడ్డి, రఘునందన్‌రావు, ఆకుల విజయ, వి.సుధాకర్‌శర్మ పాల్గొన్నారు.

మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

మన తెలంగాణ / హైదరాబాద్ : రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్‌ఆర్‌బి), గ్రూప్–డి ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న మైనారిటీ అభ్యర్థులకు మైనారిటీ స్టడీ సర్కిల్స్ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్ఏ షుకూర్ తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే డివిజన్ పరిధిలోని 6,523 గ్రూప్–డి పోస్టులకు రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆయన వెల్లడించారు. అర్హత ఉండి శిక్షణ తీసుకునేందుకు ఆసక్తి గల అభ్యర్థులు మార్చి 23 నుంచి ఏప్రిల్ 5 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 9 నుంచి హైదరాబాద్‌లోని తెలంగాణ మైనారిటీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పదో తరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆర్‌ఆర్‌బి పోస్టు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన ఎక్‌నాలెడ్జ్‌మెంట్ జిరాక్స్ కాపీలను అందజేయాలని, ఇతర వివరాలకు 040–23236113 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

ముగిసిన హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్‌ల నామినేషన్ల పర్వం

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ ఎన్నికలకు బుధవారంనాడు నామినేషన్ల పర్వం ముగిసింది. తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి వినోద్ రెడ్డి, పొన్నం అశోక్ గౌడ్, దామోదర్ రెడ్డి, శంకర్‌లు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ అసోసియేషన్ ఉపాధ్యక్ష పదవికి సాధియా బేగం, డి.ఎల్.పాండు, ముంతాజ్ పాషా, హరిప్రీత్. కార్యదర్శి పదవికి భాగ్యశ్రీ, అనంత చారి, సుదర్శన్, రవీందర్, జనార్ధన్ గౌడ్, కోమటిరెడ్డి వెంకటరమణా రెడ్డి నామినేషన్లు వేశారు. ఇక ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి సత్యప్రసాద్, ఎం.ఎస్.ప్రసాద్, రామన్న దొర, జాగర్లమూడి కోటేశ్వరప్ప నామినేషన్లు దాఖలు చేశారు. అదేవిధంగా ఈ అసోసియేషన్ ఉపాధ్యక్ష పదవికి డా.మన్మథరావు, సుభాన్, కె.సీతారామ్... కార్యదర్శి పదవికి సురేష్ రెడ్డి, జె.ఎన్.యు.ప్రసాద్, సీతారామన్, ఎం.ఆర్.కె.చక్రవర్తి, వై.బాలాజీ నామినేషన్లు వేయడం జరిగింది. అయితే తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 29న జరుగనుండగా 3,728 మంది న్యాయవాదులు ఓటర్లుగా ఉన్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ ఎన్నికలు ఏప్రిల్ 4న జరుగనుండగా 1,728 న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ప్రభుత్వోద్యోగులుగా ఆర్‌టిసి కార్మికులు

మన తెలంగాణ/ హైదరాబాద్ : తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన ఆర్‌టిసి కార్మికులను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వారికి వేతన సవరణ చేపట్టి, జీతాలను పెంచాలని ప్రభుత్వాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ (ఇయు) దీక్ష శిబిరాన్ని చాడ వెంకట్‌రెడ్డి సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వస్తువులను జిఎస్‌టి పరిధిలోనికి తీసుకొచ్చిన ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌ను ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. డీజిల్‌ను జిఎస్‌టి పరిధిలోకి తీసుకొస్తే ఆర్‌టిసికి దాదాపు రూ.600 కోట్ల ఆదా అవుతుందన్నారు. డీజిల్‌పై పెరుగుతున్న ధరలను ప్రభుత్వమే భరించాలన్నారు. ఉద్యమాలను అణచివేస్తే అవి టిఆర్‌ఎస్‌ను నామరూపాలు లేకుండా చేస్తాయని హెచ్చరించారు. ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు టి.నరసింహన్ మాట్లాడుతూ ప్రైవేటు బస్సుల అక్రమ రవాణను పూర్తిగా అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. యూనియన్ నాయకులు ఎం. వెంకటిగౌడ్, సి.హెచ్.నర్సయ్య, డి. గోపాల్ ఆధ్వర్యంలో జరిగిన దీక్షా కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ఎస్.బాబు, ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఇ.వెం కన్న,రాష్ట్ర సహాయ కార్యదర్శి వి.కె.స్వామి, వి.ఎస్.రావు, నల్లగొండ డివిజన్ సెక్రెటరీ టి. పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు .



మయన్మార్ అధ్యక్షుడు హితిన్ రాజీనామా



యాంగన్: మయన్మార్ అధ్యక్షుడు యు హితిన్ క్యా(72) తన పదవికి బుధవారం రాజీనామా చేశారు. మయన్మార్‌కు చెందిన ప్రముఖ నాయకురాలు, మానవ హక్కుల నేత ఆంగ్‌సాన్ సూకీకి ఆయన అత్యంత సన్నిహితుడు. హితిన్ రాజీనామా చేసినట్లు అధ్యక్షుడి కార్యాలయం ప్రకటించింది. వారం రోజుల్లో మయన్మార్ కొత్త అధ్యక్షుడిని ఎన్నుకుంటారని అధ్యక్షుడి కార్యాలయానికి చెందిన అధికారిక ఫేస్‌బుక్ ఖాతాలో పోస్ట్ చేశారు.'నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ పార్టీ'కి చెందిన ఆయన రెండేళ్ల కంటే తక్కువ సమయమే పదవిలో ఉన్నారు. రాజ్యాంగం ప్రకారం కొత్త అధ్యక్షుడ ఎన్నికయ్యే వరకు ఉపాధ్యక్షు డు మైయింట్ స్వే తాత్కాలి క అధ్యక్షుడిగా పనిచేయనున్నారు. హితిన్ క్యా ప్ర ముఖ కవి కుమారుడు. ఆయ న లండన్ యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ ఇనిస్టిట్యూట్‌లో 1971 నుంచి 1972 వరకు చదువుకున్నారు.అంతేకాక ఆయన యూనివర్సిటీ అధ్యాపకుడిగా, ఆర్థిక, జాతీయ ప్రణాళిక, విదేశాంగ వ్యవహారాలు వంటి వివిధ మంత్రిత్వ శాఖల్లోని అనేక పదవుల్లో పనిచేశారు.అధ్యక్ష కార్యాలయం హితిన్ ఎందు కు రాజీనామా చేశారన్న వివరాలు వెల్లడించలేదు.అయితే విశ్రాంతి తీసుకోవడం కోసం పదవి నుంచి తప్పుకున్నట్లు పేర్కొంది.ఆయన రాజీనా మా చేయబోతున్నారని గత ఏడాది నుంచి వార్త లు వస్తున్నాయి. కానీ వాటిని పార్టీ ఖండిస్తూ వచ్చింది. కాగా బుధవారం ఆయన తన రాజీనామాను సమర్పించారు.గతంలో ఆయన పలుమార్లు అనారోగ్య కారణాలతో విదేశాల్లో చికి త్స చేయించుకున్నారు. ఇటీవల జనవరిలో కూడా సింగపూర్‌లో చికిత్స పొందారు. మయన్మార్ లో రోహింగ్యాలపై జరిగిన దాష్టికాన్ని ఖండించనందుకు అంతర్జాతీయ సమాజం ఆంగ్‌సాన్ సూకీపై ఒత్తిడి తెచ్చినప్పుడు, ఆమె ప్రతిష్ట దెబ్బతింటున్నప్పుడు ఆమెకు కొండంత అండగా హతిన్ క్యా నిలబడ్డారు.ఆగస్టులో పోలీస్ పోస్టులపై రోహిం గ్యా తీవ్రవాదులు దాడులు చేసిన తర్వాత మయన్మార్ సైనికులువారిపై విరుచుకుపడ్డారు. దాంతో దాదాపు 7లక్షల మంది రోహింగ్యాలు మయన్మార్ వదిలి వేర్వేరు దేశాలకు పారిపోయారు. సూకికి మద్దతుగామాట్లాడుతున్న వారు ఆమె ప్రభుత్వం చేతులను మిలిటరీ కట్టేసిందని అంటున్నారు.

కాబూల్‌లో ఆత్మాహుతి దాడి

32 మంది మృతి



కాబూల్: అఫ్ఘనిస్థాన్‌లో ఉగ్రవాదులు బీభత్సం సృష్టించారు. బుధవారం కాబూల్ యూనివర్సిటీ ముందు జరిగిన ఆత్మాహుతి దాడిలో 32 మంది పౌరులు మృతి చెందారు. మృతుల్లో ఎక్కువగా టీనేజ్‌కు చెందిన వారు ఉన్నట్లు అధికారులు తెలిపారు.ఈ ఘటనలో డజన్ మందికి పైగా గాయపడ్డారని అంతర్గత వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి నస్రత్ రహిమి తెలిపారు. కాబూల్ యూనివర్సిటీ ఎదురుగా ఉన్న ఆస్పత్రి వరకు నడుచుకుంటూ వచ్చిన వ్యక్తి తనను తాను పేల్చేసుకున్నాడని తెలిపారు.అఫ్ఘన్లు ప్రతి ఏటా పర్షియన్ నవ్రోజ్ పండుగ జరుపుకునే కర్టే సఖికి 200 మీటర్లలోపు ఘటన చోటు చేసుకుంది. రక్తపు మడుగులో నాలుగు మృతదేహాలు ఉండటాన్ని తాను చూశానని ఘటనా స్థలానికి కొన్ని మీటర్ల దూరంలో ఉన్న వ్యక్తి మీడియాకు తెలిపారు. కాబూల్‌లో గత కొద్ది వారాలుగా ఆత్మాహుతి దాడి జరగడం ఇది ఐదో సారి. ఈ ఘటనకు సంబంధించి ఏ ఉగ్రవాద సంస్థ ప్రకటన చేయనప్పటికీ తాలిబన్లు, ఐసిస్ ఉగ్రవాదులు ఇటీవల దేశ రాజధానిపై దాడులు ఉధృతం చేశారు. కాగా,ఈ ఘటనతో తమకు ప్రమేయం లేదని తాలిబన్లు ట్విట్టర్‌లో పేర్కొన్నారు.16 ఏళ్ల యుద్ధానికి ముగింపు పలికేందుకు శాంతియుత చర్చలకు రావాలని ఇటీవలఅఫ్ఘన్ అధ్యక్షుడు అష్రాఫ్ ఘని తాలిబన్లను ఆహ్వానించారు. దీంతో ఒత్తిడికి గురవుతు న్న తాలిబాన్లు దాడులకు తెగబడుతున్నారు. 2016 అక్టోబరులో ఇదే ప్రదేశంలో షియాలు జరుపునే అశుర వేడుకల సందర్భంగా ఐసిస్ ఉగ్రవాదులు దాడి చేసి 18 మంది చంపారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు నవ్రోజ్ వేడుకల సందర్భంగా భద్రతను పెంచారు.అఫ్ఘనిస్థాన్‌లో అమెరికా, నాటో దళాలకు నాయకత్వం వహిస్తున్న జాన్ నికోలస్ మీడియా తో మాట్లాడుతూ కాబూల్‌కు భద్రత కల్పించడమే తమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా భద్రతా బలగాల కార్యకలాపాల ను సమీక్షించేందుకు అమెరికా సంయుక్త దళాల జాయింట్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్ జోసెఫ్ డన్‌ఫోర్డ్ అఫ్ఘనిస్థాన్‌కు రావడంతో ఉగ్రవాదుల ఈ చర్యకు పాల్పడ్డారు.


ఎన్నికల ముందే పొత్తులపై ఆలోచన


ఏప్రిల్ 1న బహిరంగ సభ : చాడ

మన తెలంగాణ/హైదరాబాద్ : ఎన్నికలకు ముందు పొత్తులు, సర్దుబాటులపై ఆలోచిస్తామని, అందుకు ఏడాది సమయం ఉన్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్, తెలంగాణ జెఎసిలతో సిపిఐ అవగాహన, సీట్ల సర్దుబాటు చేసుకుందని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి అలాంటి ప్రతిపాదనేది లేదని, ఎన్నికల పొత్తులపై సిపిఐలో కూడా అంతర్గతంగా ఎలాంటి చర్చ జరగడం లేదన్నారు. ఎన్నికల హామీల అమలు, వ్యవసాయ సంక్షోభం, నిరుద్యోగం, భూముల సమస్య తదితర ప్రజా సమస్యలపై లౌకిక ప్రజాతంత్ర శక్తులలో కలిసి చెప్పారు. హైదరాబాద్‌లో ఏప్రిల్ 1 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించనున్న సిపిఐ రాష్ట్ర 2వ మహాసభల పోస్టర్‌ను మఖ్దుంభవన్‌లో బుధవారం చాడ ఆవిష్కరించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మ, మహాసభల ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఇ.టి.నరసింహా, నాయకులు బి.వెంకటేశం, ఎం.నరసింహా, పులిజాల గెల్వయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన పౌర హక్కులకు భంగం కలుగుతుందని, ఫలితంగా ప్రజా సమస్యలపై పార్టీలు, ప్రజా సంఘాలు తమ కార్యాలయాల వద్దనే దీక్షలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం పాలన ఏకపక్షంగా సాగుతున్నదని, అసెంబ్లీ నిర్వహణ కూడా ఏకపక్షంగా సాగుతోందన్నారు. జాతీయ రాజకీయాల్లో అస్థిరత ఏర్పడిందని, ఏక పార్టీ పాలన అంతమై బహుళపార్టీల పాలన కొనసాగుతున్నదని, ఏ ఫ్రంట్ అయిన బహుళ పార్టీల పాలనే మళ్లీ రానుందన్నారు. రాష్ట్ర మహాసభల సందర్భంగా ఏప్రిల్ 1వ తేదీన ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. నిజాం కాలేజీ నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు జన సేవాదల్ యాత్రకు అనుమతి కోరినట్లు తెలిపారు. సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ,జాతీయ కార్యదర్శి కె.నారాయణతో పాటు సీనియర్ నాయకులు హాజరవుతారని ఆయన చెప్పారు.

భారీ ఎత్తున గుట్కా ప్యాకెట్లు పట్టివేత

● రూ.50 లక్షల విలువైన ప్యాకెట్లు స్వాధీనం ● 19 మంది నిందితులు అరెస్ట్ ● 11 వాహనాలు సీజ్





మన తెలంగాణ/హైదరాబాద్ / గచ్చిబౌలి : భారీ ఎత్తున అక్రమంగా గుట్కా ప్యాకెట్‌ల సంచులను కర్ణాటక నుంచి నగరంకు తరలిస్తున్న వ్యక్తులను, వాహనాలను అరెస్ట్ చేసిన సంఘటన రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బుధవారం గచ్చిబౌలిలోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాదాపూర్ డీసీపీ విశ్వప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం శంషాబాద్ ఎస్‌ఓటి పోలీసులు బుధవారం చందానగర్, రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాలను తనిఖీలు చేస్తుండగా కర్ణాటక రాష్ట్రం నుంచి మొత్తం 11 వాహనాలలో 19 మంది కలిసి సుమారు 50 లక్షల రూపాయల విలువ చేసే గుట్కా ప్యాకెట్‌లను ఖరీదైన కార్లలో స్కోడా, షిఫ్టుటు డిజైర్, ఐ20, ఇనోవా తదితర వాహనాలలో తరలిస్తుండగా వారిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. వీరు తెలంగాణ రాష్ట్రంలోని పలు నగరాలలో ఆటోల ద్వారా ట్రాలీ బండ్ల ద్వారా చిన్న చిన్న పాన్ షాప్‌లకు గుట్కా ప్యాకెట్లను విక్రయిస్తున్నట్లు వారు తెలిపారు. ఒకే సారి కర్ణాటక నుంచి వివిధ వాహనాలలో గుట్కా ప్యాకెట్లను తరలించి నగరానికి దూరంగా ఓ గోదాంను కిరాయికి తీసుకొని పెద్ద ఎత్తున గుట్కా ప్యాకెట్ల సంచులను నిలువ చేసి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ షాపుల వారు ఇచ్చిన ఆర్డర్‌లపై గుట్కా ప్యాకెట్లను సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఎస్‌ఒటి పోలీసులు ఖచ్చితమైన సమాచారంతో నిఘా ఏర్పాటు చేసి వీరిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. రమేష్, అనిల్, రాకేష్, సోమా రమేష్, రమేష్, మహ్మద్ శకీల్‌హమ్మద్, మహ్మద్ అంజత్ ఆలీ, మహ్మద్ గౌస్, అంజత్, అబ్దుల్ షమి, షాఇక్ ఇర్ఫాన్ పాషా,మహ్మద్ జావెద్,షేక్ షారుక్, భరత్, షాహిద్ సలీం, మహ్మద్ సమీర్, మహ్మద్ ఫజుద్దీన్, నటేష్ ఖాన్, దినేష్ కుమార్ లను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు.

లోయలోపడ్డ బస్సు, 19మంది దుర్మరణం


ఫిలిప్పీన్స్: ఫిలిప్పీన్స్‌లో ఘోరప్రమాదం చోటు చేసుకుంది. సబ్లాయన్ పట్టణ సమీపంలో ఓ బస్సు అదుపుతప్పి ఇరవై అడుగుల లోతున్న లోయలో పడింది. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారంరాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో జరిగిన ఈ దుర్ఘటనలో 19మంది ప్రాణాలు కోల్పోగా17మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సాంకేతిక లోపం కారణంగా డ్రైవర్ బస్సుపై నియంత్రణ కోల్పోయి ఉండవచ్చని అధికారులు తెలిపారు. మృతుల్లో బస్సు డ్రైవరు కూడా ఉన్నాడు.




23 నుంచి మెడికల్ పిజి ప్రవేశాలకు దరఖాస్తులు

మన తెలంగాణ/హైదరాబాద్ : మెడికల్ పోస్టు గ్రాడ్యుయేషన్ అడ్మిషన్ల కోసం నీట్‌లో అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు కాళోజి నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలలయం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ప్రవేశాలకు ఈ నెల 23 నుంచి 28 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. కాళోజి హెల్త్ వర్సిటీ వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలు పొందుపరిచారు.

రాశి ఫలాలు



అప్పులు చేయాల్సి వస్తుంది. ఆకస్మిక ప్రయాణాలు. సోదరులు, స్నేహితులతో స్వల్ప విభేదాలు. ఆరోగ్య సమస్యలు. వ్యాపారులకు నిరుత్సాహం. ఉద్యోగవర్గాలకు పనిఒత్తిడులు. కళాకారులకు గందరగోళం.



నూతన పరిచయాలు ఏర్పడతాయి. కొత్త కార్యక్రమాలు చేపడతారు. నిరుద్యోగుల కలఫలిస్తుంది. వ్యాపారులు ఉత్సాహంగా ముందుకుసాగుతారు. ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి. పారిశ్రామికవేత్తల యత్నాలు సఫలం.



స్నేహితులతో మనస్పర్థలు. ప్రయాణాలు వాయిదా వేస్తారు. ఆదాయం అంతగా కనిపించదు. ఆరోగ్య సమస్యలు. వ్యాపారులకు లాభాలు అంతగా కనిపించవు. ఉద్యోగస్తులు మార్పులకు సిద్ధమవ్వాలి. కళాకారులు ఆచితూచి అడుగేయాలి.



పాతస్నేహితులను కలుసుకుంటారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. చేపట్టిన కార్యక్రమాలు సమయానికి పూర్తి. వ్యాపారులు అనుకున్న లాభాలు ఆర్జిస్తారు. ఉద్యోగులకు పనిఒత్తిడులు తొలగుతాయి. నాయకులు ప్రజాదరణ పొందుతారు.




కొన్ని కార్యక్రమాలు అప్రయత్నంగా పూర్తి. సోదరులు, సోదరీలతో వివాదాలు తీరతాయి. ఆహ్వానాలు అందుతాయి. ధనలబ్ధి. వ్యాపారులకు విస్తరణ యత్నాలు కలసివస్తాయి. కళాకారులకు అవకాశాలు తప్పిపోతాయి.



ఆదాయం కంటే ఖర్చులు పెరుగుతాయి. కార్యక్రమాలలో అవాంతరాలు. సన్నిహితులతో విభేదాలు. ఆకస్మిక ప్రయాణాలు. వ్యాపారులకు లాభాలు స్వల్పమే. ఉద్యోగులకు విధి నిర్వహణ కత్తిమీదసాముగా ఉంటుంది. కళాకారులకు ఒడిదుడుకులు.



స్నేహితులతో తగాదాలు. ప్రయాణాలు వాయిదా వేస్తారు. ఆదాయం అంతంత మాత్రమే. ఆలోచనలు స్థిరంగా ఉండవు. వ్యాపారులు ఆచితూచి వ్యవహరించాలి. ఉద్యోగులకు మార్పులు. పారిశ్రామికవేత్తలకు పర్యటనలు వాయిదా.



దూరపు బంధువులను కలుసుకుంటారు. ముఖ్య విషయాలు చర్చిస్తారు. కొత్త కార్యక్రమాలు చేపడతారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. వ్యాపారులకు ఊహించని లాభాలు. ఉద్యోగులకు ప్రోత్సాహకరం. కళాకారులకు సన్మానాలు.



సన్నిహితులు, సోదరులతో ఉల్లాసంగా గడుపుతారు. ఆహ్వానాలు సంతోషాన్నిస్తాయి. చిరకాల స్వప్నం నెరవేరుతుంది. కార్యక్రమాలలో విజయం. వ్యాపారులకు కొత్త పెట్టుబడులు. ఉద్యోగస్తులకు ప్రశంసలు. రాజకీయవేత్తలకు ఆహ్వానాలు.



కార్యక్రమాలు ముందుకు సాగవు. ఆలోచనలు నిలకడకగా ఉండవు. కుటుంబసభ్యుల నుంచి ఒత్తిడులు. దేవాలయ దర్శనాలు. అనారోగ్యం. వ్యాపారులకు లాభాలు అంతగా ఉండవు. ఉద్యోగస్తులకు అదనపు పనిభారం.



ఆదాయం కంటే ఖర్చులు పెరుగుతాయి. ఆకస్మిక ప్రయాణాలు. కుటుంబసభ్యులతో తగాదాలు. ఆరోగ్యసమస్యలు. వ్యాపారులకు లాభాలు ఊరిస్తాయి. ఉద్యోగులకు పైస్థాయి నుంచి ఒత్తిడులు. కళాకారుల కృషి ఫలించదు.



పరిస్థితులు అనుకూలిస్తాయి. సభలు, సమావేశాలలో పాల్గొంటారు. పాతబాకీలు వసూలవుతాయి. వస్తులాభాలు. వ్యాపారులకు లాభాలు తథ్యం. ఉద్యోగులకు విఎధుల్లో చికాకులు. రాజకీయవేత్తలకు పదవులు దక్కుతాయి.

మెయిన్ డ్రాకు యూకి బాంబ్రీ



మియామి: భారత స్టార్ ఆటగాడు యూకి బాంబ్రీ ప్రతిష్ఠాత్మకమైన మియామి ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ మెయిన్ డ్రాకు అర్హత సాధించాడు. ఇండియన్ వెల్స్ టెన్నిస్ టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్‌కు చేరి ప్రకంపనలు సృష్టించిన బాంబ్రీ తాజాగా మియామి ఓపెన్‌కు అర్హత సాధించి అందరిని ఆశ్చర్య పరిచాడు. క్వాలిఫయింగ్ పోటీల్లో భాగంగా జరిగిన రెండో రౌండ్‌లో బాంబ్రీ 7–5, 6–2 తేడాతో ఇలియాస్ ఎమర్‌పై విజయం సాధించాడు. తొలి సెట్‌లో పోరు ఉత్కంఠభరితంగా సాగింది. ఇద్దరు కూడా ప్రతి పాయింట్ కోసం తీవ్రంగా పోరాడారు. దీంతో పోరు యుద్ధాన్ని తలపించింది. ఇద్దరు ఒకరి సర్వీస్‌ను మరోకరూ బ్రేక్ చేస్తూ ముందుకు పోయారు. ఈ నేపథ్యంలో సెట్ టైబ్రేకర్‌కు వెళ్లక తప్పలేదు. కానీ, దీనిలో భారత స్టార్ పైచేయి సాధించాడు. చూడచక్కని షాట్లతో చెలరేగిన బాంబ్రీ సెట్‌ను సొంతం చేసుకున్నాడు. ఇక, రెండో సెట్‌లో యూకికి ఎదురే లేకుండా పోయింది. ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన బాంబ్రీ ఏదశలోనూ ప్రత్యర్థిని కోలుకోనివ్వలేదు. తనకు మాత్రమే సాధ్యమయ్యే ప్రత్యేక షాట్లతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేశాడు. బాంబ్రీ ధాటికి ప్రత్యర్థి ఎమర్ కనీస ప్రతిఘటన కూడా ఇవ్వకుండానే చేతులెత్తేశాడు. కాగా, గురువారం జరిగే తొలి రౌండ్‌లో మీర్జాతో బాంబ్రీ తలపడుతాడు.

ఐపిఎల్‌లో కొత్త సాంప్రదాయం

- ప్రారంభ వేడుకలకు కెప్టెన్లు దూరం

ముంబయి: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) పదకొండో సీజన్‌లో కొత్త సాంప్రదాయానికి శ్రీకారం చుట్టనున్నారు. ఇప్పటి వరకు పది సీజన్లలో జరిగిన సంప్రదాయానికి భిన్నంగా ఈసారి ప్రారంభోత్సవ వేడుకలను నిర్వహించనున్నారు. గతంలో జరిగిన ప్రతి ఐపిఎల్ ప్రారంభోత్సవ వేడుకలకు ప్రతి ఫ్రాంచైజీకి చెందిన కెప్టెన్ తప్పని సరిగా పాల్గొనే వాడు. అయితే ఈసారి ఈ సంప్రదాయాన్ని మార్చారు. ఈ సారి ముంబయిలో ఏప్రిల్ 7న జరిగే ఐపిఎల్ ప్రారంభోత్స కార్యక్రమంలో కేవలం రెండు జట్లకు చెందిన కెప్టెన్లు మాత్రమే హాజరు కానున్నారు. ఈ విషయాన్ని బిసిసిఐకి చెందిన ఓ అధికారికి బుధవారం మీడియాకు వెల్లడించాడు. సుప్రీం కోర్టు పర్యవేక్షణలోని పాలక మండలి ప్రారంభోత్సవ వేడుకలకు సంబంధించి పలు ఆంక్షలను విధించిన విషయం తెలిసిందే. దీంతో గతానికి భిన్నంగా ఈసారి మ్యాచ్ ప్రారంభానికి కొద్ది సేపటి ముందే ప్రారంభ వేడుకలు జరుపనున్నారు. కాగా, ఈ వేడుకల్లో పాల్గొని మ్యాచ్‌లు జరిగే నగరాలకు చేరుకోవడం ఆయా జట్ల కెప్టెన్లకు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. దీంతో ప్రారంభ వేడుకలకు ఆయా జట్ల కెప్టెన్లను దూరంగా ఉంచాలని బిసిసిఐ నిర్ణయించింది. దీంతో ఈసారి జరిగే ఆరంభ వేడుకల్లో కేవలం ముంబయి ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లకు చెందిన కెప్టెన్లు మాత్రమే హాజరు కానున్నారు. కాగా, ఐపిఎల్ పాలక మండలి అధికారుల నిర్లక్ష్యం వల్లే కెప్టెన్లు ఆరంభ వేడుకల్లో పాల్గొనలేక పోతున్నారని బిసిసిఐకి చెందిన ఒక అధికారి ఆరోపించాడు. ఐపిఎల్ నిర్వహకులు సకాలంలో చర్యలు తీసుకొని ఉన్నట్లయితే అన్ని జట్లకు చెందిన కెప్టెన్లు ఐపిఎల్ వేడుకలకు హాజరయ్యే అవకాశం ఉండేదన్నాడు. అయితే అధికారుల అలసత్వం వల్ల అది కార్యరూపం దాల్చకుండా పోయిందని ఆయన వాపోయాడు. కాగా, ఆరంభోత్సవ వేడుకలకు బెంగళూరు కెప్టెన్ విరాట్ కోహ్లి, ఢిల్లీ కెప్టెన్ గౌతం గంభీర్, రాజస్థాన్ సారథి స్టీవ్ స్మిత్, హైదరాబాద్ కెప్టెన్ డేవిడ్ వార్నర్, కోల్‌కతా నాయకుడు దినేష్ కార్తీక్ తదితరులు ఈసారి ప్రారంభ వేడుకలకు దూరంగా ఉండనున్నారు. ఈసారి కేవలం చెన్నై కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని, ముంబయి ఇండియన్స్ సారథి రోహిత్ శర్మలు మాత్రమే పాల్గొంటున్నారు. కాగా, ఆరంభోత్సవ వేడుకలకు గతంలో కంటే చాలా తక్కువ మొత్తంలోనే నిధులను పాలక మండలి కేటాయించింది. దీంతో ఈ వేడుకలను గతంలో లాగా అత్యంత వైభవంగా నిర్వహించడం సాధ్యం కావడం లేదు.



భారీ షాట్లకు ప్రయత్నించడం వల్లే

విజయ్ శంకర్



చెన్నై: నిదహాస్ కప్ ఫైనల్లో తన ప్రదర్శన ఇప్పటికీ వెంటాడుతూనే ఉందని భారత యువ ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ అన్నాడు. ఈ మ్యాచ్ ద్వారా దినేష్ కార్తీక్ దేశ వ్యాప్తంగా స్టార్‌డమ్ తెచ్చుకోగా శంకర్ పేలవమైన బ్యాటింగ్‌తో అభిమానుల ఆగ్రహానికి గురయ్యాడు. మ్యాచ్ ముగిసి ఇప్పటికే మూడు రోజులు గడిచినా అభిమానుల ఆగ్రహం చల్లారనే లేదు. ఇప్పటికీ కూడా సోషల్ మీడియా వేదికగా వేలాది మంది అభిమానులు శంకర్‌ను వ్యంగ్యస్త్రాలు సంధిస్తూనే ఉన్నారు. ఇది చాలా రోజుల పాటు కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా, తనపై వస్తున్న విమర్శలపై శంకర్ బుధవారం స్పందించాడు. ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన వాదనను వినిపించాడు. ముస్తఫిజుర్ అసాధారణ రీతిలో బంతులు వేయడంతో తాను ఎంతో ఒత్తిడికి గురైన విషయం వాస్తవమేనన్నాడు. అయితే ఒకటి రెండు భారీ షాట్లు కొట్టి మళ్లీ పైచేయి సాధించేందుకు ప్రయత్నించానన్నాడు. ఇందు కోసం సింగిల్స్ కోసం ప్రయత్నించలేదన్నాడు. ఒకవేళ ఒక ఫోర్ కొట్టినా ఒత్తిడి తగ్గిపోయేదన్నాడు. అయితే చూస్తుండగానే నాలుగు బంతులు అయిపోయాయని, దీంతో ఒత్తిడి మరింత పెరిగిందన్నాడు. ప్రతి బంతిని భారీ షాట్‌గా మలచాలనే తపనతో సింగిల్స్‌పై దృష్టి పెట్టలేదన్నాడు. ఇదే తాను చేసిన అతి పెద్ద పొరపాటని తెలిపాడు. ఒకవేళ మ్యాచ్ ఓడిపోయి ఉంటే మాత్రం ఈ ప్రదర్శన తనను జీవితాంతం వేధించేదన్నాడు. కాగా, జట్టు విజయం సాధించిన వెంటనే సహచర క్రికెటర్లు ఆనందంలో మునిగి తేలగా తాను మాత్రం అవమాన భారంతో కుచించి పోయానని తెలిపాడు. అప్పుడే కోచ్ రవిశాస్త్రి తనకు ధైర్యం చెప్పి గ్రౌండ్‌లోకి తీసుకెళ్లాడని వివరించాడు. కాగా, ఇటువంటి చెత్త ప్రదర్శన ఏ క్రికెటర్‌కైనా చాలా తలవంపులు తెస్తుందన్నాడు. తన ప్రదర్శనపై ఎంతో అసంతృప్తితో ఉన్నానని విజయ్ పేర్కొన్నాడు. కాగా, భవిష్యత్తులో అవకాశం దొరికితే మాత్రం ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా జట్టుకు అండగా నిలుస్తాననే నమ్మకాన్ని వ్యక్తం చేశాడు.

షమీకి ఊరట

క్లీన్ చీట్ ఇచ్చిన విచారణ కమిటీ!

న్యూఢిల్లీ: భారత ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమికి పెద్ద ఊరట కలిగింది. అతనిపై వచ్చిన అవినీతి ఆరోపణలన్ని నిరాధారమైనవేనని విచారణలో తేలినట్టు సమాచారం. మహ్మద్ షమి మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడని, ఇందులో భాగంగా పాకిస్థాన్‌కు చెందిన అలీష్బా అనే మహిళా వద్ద నుంచి దుబాయ్‌లో డబ్బులు తీసుకున్నాడని అతని భార్య హసిన్ జహాన్ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన భారత క్రికెట్ బోర్డు విచారణకు ఆదేశించింది. ఇందులో భాగంగా భారత క్రికెట్ బోర్డుకు చెందిన అవినీతి నిరోధక శాఖ (ఎసియు) విచారణ చేపట్టింది. పకడ్బంధీగా విచారణ జరిపిన బిసిసిఐ అవినీతి నిరోధక శాఖ షమి నిర్దోషి అని తేల్చింది. ఈ మేరకు బిసిసిఐకి నివేదిక కూడా అందజేసినట్టు బుధవారం జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. కాగా, గురువారం షమి భారత క్రికెట్ బోర్డు అధికారికంగా ప్రకటన చేసే అవకాశం ఉన్నట్టు తెలిసింది. షమిపై వచ్చిన ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదనే విషయం తమ విచారణలో తేలిందని విచారణ కమిటీ అధికారి నీరజ్ కుమార్ స్పష్టం చేశారు. పాకిస్థాన్‌కు చెందిన అలీష్బా అనే మహిళా మహ్మద్ భాయ్ అనే వ్యక్తి ద్వారా షమికి డబ్బులు పంపించిందని హసిన్ ఆరోపించిన విషయం తెలిసిందే. కాగా, దుబాయ్‌లో ఉన్న మహ్మద్ భాయ్‌ను తాము సంప్రదించామని అత ను ఈ ఆరోపణలు కొట్టి పారేశాడని నీరజ్ కుమార్ తెలిపారు. అంతేగాక అలీష్బా కూడా మహ్మద్ షమికి ఎలాంటి డబ్బులు పంపలేదని తమ విచారణలో తేలిందన్నారు. దీంతో మహ్మద్ షమికి క్లీన్ చీట్ ఇచ్చినట్టు నీరజ్ కుమార్ ఓ జాతీయ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. కాగా, ఫిక్సింగ్‌తో ఆరోపణల్లో చిక్కుకున్న స్పీడ్‌స్టర్ షమికి ఇది పెద్ద ఊరటనిచ్చే అంశమే.



విండీస్‌కు ప్రపంచకప్ బెర్త్

కీలక మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై విజయం



హరారే: ఇంగ్లాండ్‌లో వచ్చే ఏడాది జరిగే ప్రపంచకప్ క్రికెట్ టోర్నమెంట్‌కు విండీస్ అర్హత సాధించింది. బుధవారం స్కాట్లాండ్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ నిబంధన ప్రకారం ఐదు పరుగుల తేడాతో విండీస్ జయకేతనం ఎగుర వేసింది. దీంతో 2019లో ఇంగ్లాండ్ వేదికగా జరిగే వరల్డ్‌కప్ బెర్త్ దక్కింది. రెండు సార్లు విశ్వవిజేతగా నిలిచిన విండీస్ వన్డేల్లో పేలవమైన ఆటతో వరల్డ్‌కప్‌కు నేరుగా అర్హత కూడా సాధించలేని దుస్థితికి చేరింది. దీంతో క్వాలిఫయింగ్ పోటీల ద్వారా ప్రపంచకప్‌కు అర్హత సాధించక తప్పలేదు. కాగా, కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో కూడా విండీస్ పేలవంగానే ఆడింది. అయితే వర్షం పుణ్యమా అని డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో విజయాన్ని అందుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన విండీస్ 48.4 ఓవర్లలో 198 పరుగులకే ఆలౌటైంది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన స్కాట్లాండ్ 35.2 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 125 పరుగులు చేసింది. ఈ సమయంలో వర్షం రావడంతో మ్యాచ్ ముందుకు సాగలేదు. దీంతో డక్‌వర్త్ లూయిస్ నిబంధన ప్రకారం విండీస్‌ను విజేతగా ప్రకటించారు. ఊరిస్తున్న లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన స్కాట్లాండ్‌కు ప్రారంభంలోనే కష్టాలు మొదలయ్యాయి. ఓపెనర్లు మాథ్యూ క్రాస్ (4), కైల్ కొయెట్జర్ (2) నిరాశ పరిచారు. జట్టును ఆదుకుంటాడని భావించిన కెప్టెన్ కొయెట్జర్ తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరి నిరాశ పరిచాడు. వన్‌డౌన్‌లో వచ్చిన మిఖయిల్ జోన్స్ కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలువలేక పోయాడు. 14 పరుగులకే చేసి వెనుదిరిగాడు. స్టార్ ఆటగాడు మెక్‌లీడ్ కొంత సేపు పోరాటం చేశాడు. రిచి బెరింగ్టన్‌తో కలిసి స్కోరును ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించాడు. అయితే మెక్‌లీడ్ 21 పరుగుల స్కోరు వద్ద నర్స్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. మరోవైపు సమన్వయంతో బ్యాటింగ్ చేసిన బెరింగ్టన్ 4 ఫోర్లతో 33 పరుగులు చేశాడు. మరోవైపు జార్జ్ మున్సె ఐదు ఫోర్లతో 32 పరుగులు చేసి అజేయంగా ఉన్నాడు. అతనికి మిఛెల్ లీస్క్ 14 (నాటౌట్) అండగా నిలిచాడు. కాగా, స్కాట్లాండ్ స్కోరు 125/5 ఉన్న సమయంలో వర్షం రావడంతో మ్యాచ్ ఆగిపోయింది. దీంతో విండీస్‌కు విజయం వరించింది. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్‌ను ఓపెనర్ ఎవిన్ లెవిస్ ఆదుకున్నాడు. స్టార్ ఆటగాడు క్రిస్ గేల్ మరోసారి నిరాశ పరిచాడు. సఫియాన్ షరీఫ్ వేసిన ఇన్నింగ్స్ తొలి బంతికే పెవిలియన్ చేరాడు. ఆ వెంటనే వికెట్ కీపర్ శాయ్ హోప్ (0) కూడా ఔటయ్యాడు. దీంతో విండీస్ రెండు పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యతను లెవిస్, సీనియర్ ఆటగాడు మర్లొన్ శామ్యూల్స్ తమపై వేసుకున్నారు. ఇద్దరు స్కాట్లాండ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. కీలక ఇన్నింగ్స్ ఆడిన లెవిస్ ఏడు ఫోర్లు, రెండు సిక్సర్లతో 66 పరుగులు చేశాడు. మరోవైపు శామ్యూల్స్ 4 ఫోర్లతో 51 పరుగులు చేశాడు. చివర్లో వెంటవెంటనే వికెట్లు కోల్పోవడంతో విండీస్ ఇన్నింగ్స్ 198 పరుగుల వద్దే ముగిసింది. స్కాట్లాండ్ జట్టులో షరీఫ్, బ్రాడ్లి వీల్ మూడేసి వికెట్లు పడగొట్టారు. షరీఫ్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది.

ఆత్మవిశ్వాసంతో సౌతాఫ్రికా

నేటి నుంచి ఆసీస్‌తో మూడో టెస్టు



కేప్‌టౌన్: రెండో టెస్టులో చిరస్మరణీయ విజయం సాధించిన ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టు గురువారం నుంచి ఆస్ట్రేలియాతో ప్రారంభమయ్యే మూడో టెస్టుకు ఆత్మవిశ్వాసంతో సిద్ధమైంది. రెండో మ్యాచ్‌లో జట్టును ఒంటిచేత్తో విజయం సాధించి పెట్టిన స్పీడ్‌స్టర్ రబడాపై నిషేధం ఎత్తేయడంతో సఫారీ ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యింది. ఈ మ్యాచ్‌లోనూ ఆస్ట్రేలియాను ఓడించి సిరీస్‌లో పైచేయి సాధించాలని భావిస్తోంది. మరోవైపు రబడాపై నిషేధం ఎత్తివేయడంతో ఆస్ట్రేలియా జట్టులో కలవరం మొదలైంది. రెండో టెస్టులో రబడా ధాటికి ఆసీస్ బ్యాట్స్‌మెన్ కంగారెత్తి పోయిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో కూడా రబడాతో ఆసీస్‌కు ప్రమాదం పొంచి ఉందనే చెప్పాలి. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే సత్తా కలిగిన రబడా చెలరేగితే ఈసారి కూడా ఆసీస్‌కు కష్టాలు ఖాయం. అయితే హేమాహేమీలతో కూడిన ఆస్ట్రేలియాను తక్కువ అంచన వేస్తే సఫారీలకు ఎదురుదెబ్బ తగలడం ఖాయం. స్మిత్, వార్నర్, బెన్‌క్రాఫ్ట్, ఉస్మాన్ ఖ్వాజా, షాన్ మార్ష్, మిఛెల్ మార్ష్, పైన్‌లతో ఆసీస్ బ్యాటింగ్ చాలా బలంగా ఉంది. అంతేగాక స్టార్క్, హాజిల్‌వుడ్, కమిన్స్, లియాన్ తదితరులతో బౌలింగ్ కూడా పటిష్టంగా కనిపిస్తోంది. ఇక, డివిలియర్స్, ఎల్గర్, మార్‌క్రామ్, ఆమ్లా, డుప్లెసిస్, డికాక్‌లతో కూడిన బలమైన బ్యాటింగ్ లైనప్ సఫారీలకు అందుబాటులో ఉంది. ఎల్గర్, డివిలియర్స్, ఆమ్లాలు భీకర ఫాంలో ఉన్నారు. ఇక, ఫిలాండర్, రబడా, ఎన్‌గిడి, మహారాజ్‌లతో బౌలింగ్ కూడా బలంగానే ఉంది. దీంతో మూడో టెస్టు నువ్వానేనా అన్నట్టు సాగడం ఖాయం.

నేటి నుంచి మహిళల ముక్కోణపు సమరం

ముంబయి: మహిళల ముక్కోణపు ట్వంటీ–20 సమరానికి గురువారం తెరలేవనుంది. ముంబయిలోని బ్రాబోర్న్ స్టేడియం ఈ టోర్నమెంట్‌కు వేదికగా నిలువనుంది. ఆతిథ్య భారత్‌తో పాటు ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా జట్లు టోర్నీలో తలపడనున్నాయి. లీగ్ దశలో ప్రతి జట్టు ప్రత్యర్థితో రెండేసి మ్యాచ్‌లు ఆడుతుంది. అగ్రస్థానంలో నిలిచే రెండు జట్లు ఫైనల్‌కు చేరుకుంటాయి. ఫైనల్ సమరం మార్చి 31న జరుగుతుంది. కాగా, గురువారం జరిగే మొదటి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఆతిథ్య భారత్‌తో తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఇప్పటికే భారత్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను ఆస్ట్రేలియా క్లీన్ స్వీప్ చేసిన విషయం తెలిసిందే. ఈ టోర్నమెంట్‌లో కూడా ఆస్ట్రేలియా ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. కాగా, వన్డేల్లో ఎదురైన ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలనే లక్ష్యంతో భారత్ పోరుకు సిద్ధమైంది. భారత జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యం వహించనుంది. కాగా, స్టార్ ఓపెనర్ స్మృతి మందనపై భారత్ భారీ ఆశలు పెట్టుకుంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే సత్తా కలిగిన మందన చెలరేగితే భారత్‌కు గెలుపు కష్టమేమి కాదు. మిథాలీ, వేద కృష్ణమూర్తి, జెమియా రోడ్రిక్స్, దీప్తి శర్మలతో భారత్ బలంగానే ఉంది. వెటరన్ క్రీడాకారిణి జులన్ గోస్వామి రాకతో బౌలింగ్ మరింత బలోపేతంగా మారింది. దీంతో భారత్ కూడా భారీ ఆశలతో టోర్నీకి సిద్ధమైంది. ఇక, ఆస్ట్రేలియా మాత్రం బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో చాలా బలంగా ఉంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే ఆటగాళ్లకు జట్టులో కొదవలేదు. దీంతో ఆసీస్‌ను టోర్నీ ఫేవరెట్‌గా పరిగణిస్తున్నారు. కాగా, అన్ని మ్యాచ్‌లు ఉదయం పది గంటలకు ప్రారంభమవుతాయి.



ఉద్యోగులకు ఆటవిడుపు అవసరం

- టిఎన్‌జిఒస్ రాష్ట్రస్థాయి క్రీడలను ప్రారంభించిన ఎంపి కవిత

మనతెలంగాణ/ ఇందూరు: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను అమలు చేసి ప్రజలకు చేరవేయడంలో ఉద్యోగులు చేస్తున్న పాత్ర అభినందనీయమని నిజామాబాద్ ఎంపి కవిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ మైదానంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల తెలంగాణ నాన్ గెజిటెడ్ గెమ్స్, స్పోర్ట్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపి కవిత హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించి, క్రీడకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం మొదటిసారిగా నిజామాబాద్ జిల్లాలో టీఎన్‌జీఓస్‌ల రాష్ట్రస్థాయి క్రీడలు జరుపడం చాలా ఆనందంగా ఉందని, నా వంతు సంపూర్ణ సహకారం ఉంటుందని తెలిపారు. సమైక్య రాష్ట్రంలో ఉద్యోగులు చాలా సమస్యలు ఎదుర్కొన్నారని, వాటిని ప్రభుత్వం తీర్చుకుంటూ వస్తుందని తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా రైతులకు 24గంటలు కరెంటు సరఫరా చేయడంలో విద్యుత్తు ఉద్యోగులు ఎంతో కష్టపడ్డారని, అలాగే భూప్రక్షాళన చేయడంలో రెవెన్యూ ఉద్యోగులు ఎంతో కృషి చేశారని వారి కృషిని గుర్తించి ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు నెల వేతనం బహుమతిగా అందజేశారన్నారు. బంగారు తెలంగాణ సాధించడానికి ఉద్యోగులు మరింత కృషి చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ రాంమోహన్‌రావు మాట్లాడుతూ క్రీడలతో మానసికంగా, శారీరకంగా ఎంతో ఆరోగ్యం పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ ఆకుల సుజాత, బేవరేజస్ ఛైర్మన్ దేవిశ్రీప్రసాద్, జిల్లా సంయుక్త కలెక్టర రవీందర్‌రెడ్డి, టీఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ పాల్గొన్నారు.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.